


మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక





ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 181 శుక్రవారం 27 ఫిబ్రవరి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు 25 :- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్

# నదుల అనుసంధానంతో నీటి సమస్యలు తగ్గుతాయి

- సాగునీటి రంగంపై శాసనసభలో మాట్లాడిన సీఎం చంద్రబాబు
- పోలవరం-నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదని గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి వెళ్లే వరద జలాలను తరలిస్తామని వెల్లడి
- "పోలవరం అతిపెద్ద ప్రాజెక్టు ఎమ్మెల్యేలందరూ ఒకసారి చూసి రావాలి
- పోలవరం వంటి పెద్ద ప్రాజెక్టు దేశంలో మరొకటి నిర్మించే అవకాశం లేదు
- ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలని మా ప్రభుత్వ లక్ష్యం
- ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు అందించేలా చర్యలు



**అమరావతి**

గంగా-కావేరి అనుసంధానం కావాలనేది నా ప్రగాఢ ఆకాంక్ష అని సీఎం చంద్రబాబు చెప్పారు. గోదావరికి అఖండ హారతి, కృష్ణాకు పవిత్ర హారతి ఇచ్చామని గుర్తు చేస్తూ నదులను పూజించడం సంప్రదాయంగా పెట్టుకున్నామని తెలిపారు. సాగునీటి రంగంపై సీఎం చంద్రబాబు శాసనసభలో మాట్లాడుతూ ఏ పనైనా చిన్న ఆలోచనతోనే మొదలవుతుందని గంగా-కావేరి అనుసంధానం సాధ్యాసాధ్యాలపై ఆనాడే చర్చలు జరిగాయని తెలిపారు. నదుల అనుసంధానం చేసి తెలుగుతల్లికి జలహారతి ఇచ్చే బాధ్యత మాది అని అన్నారు. నదుల అనుసంధానం వల్ల నీటి సమస్యలు తగ్గుతాయని - మిగతా3లో



## భారత్-ఇజ్రాయెల్ మధ్య కీలక ఒప్పందాలు

- మైత్రి మరింత బలపడిందన్న మోదీ, నెతన్యాహు
- భారత్-ఇజ్రాయెల్ బంధం 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి
- ఏఐ, క్వాంటం టెక్నాలజీపై కొత్త ఒప్పందం.. ఇజ్రాయెల్‌లో యూపీఐ సేవలు
- సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ సంఖ్యను 100కి పెంచాలని నిర్ణయం
- తమ బంధం ప్రతి సవాల్‌ను తట్టుకుని నిలిచిందన్న ప్రధాని మోదీ
- ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాడతామని ఇరు దేశాల స్పష్టీకరణ



## పది విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక

ఉత్తమ ఫలితాలు వస్తాయంటున్న ఉపాధ్యాయులు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమౌతున్న విద్యార్థులు

100 రోజుల యాక్షన్ ప్లాన్ సత్ఫలితాలను ఇస్తోందని చెబుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆహారనియమాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

**అమరావతి**

రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలకు ఇంకా కొన్ని రోజులే సమయం ఉండటంతో మంచి మార్కులు సాధించేందుకు విద్యార్థులు కృషి చేస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా చదువుతున్నారు. పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. - మిగతా3లో




## ఇక ఇజ్రాయెల్‌లోనూ మన యూపీఐ సేవలు

ఇజ్రాయెల్‌లో యూపీఐ సేవలు అందుబాటులోకి

ప్రధాని మోదీ పర్యటనలో కుదిరిన కీలక ఒప్పందం

వేగంగా, చౌకగా మారనున్న డిజిటల్ లావాదేవీలు

క్రిటికల్ టెక్నాలజీ రంగాల్లోనూ భాగస్వామ్యానికి నిర్ణయం

## 'ఆపరేషన్ సిందూర్ 2.0' ఊహలకు అందనంత భయంకరంగా ఉంటుంది

- సరిహద్దుల్లో ప్రచ్ఛన్న యుద్ధం సాగిస్తున్న పాకిస్థాన్ : భారత సైనికాధికారి
- ఈసారి ప్రతిస్పందన 'ఆపరేషన్ సిందూర్' కంటే భీకరంగా ఉంటుందన్న ఎల్జీ మనోజ్ కుమార్
- తాము ఎంతటి కఠిన నిర్ణయానికైనా వెనుకాడబోమని హెచ్చరిక




## సచివాలయం, హెచ్‌ఓడీ టవర్లలో శాఖలకు స్థలం

సిబ్బంది సంఖ్య ఆధారంగా కేటాయింపు

ఆయా శాఖలు, విభాగాధిపతుల కార్యాలయాల నుంచి వివరాల సేకరణ

కేటగిరీల వారీగా ప్రామాణిక యూనిట్ ఏరియా నిర్దేశించిన ప్రభుత్వం



**అమరావతి**

రాష్ట్ర ప్రభుత్వం రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న పలు హెచ్‌ఓడీ (విభాగాధిపతులు)ల భవనాలు, సచివాలయం, కార్యాలయాల టవర్లలో ఏ శాఖకు ఎంత స్థలం కేటాయించాలన్న అంశంపై కసరత్తులు మరింత ముమ్మరం చేసినట్లు తెలుస్తుంది. దీని కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఈ నెల 13న సమావేశమైంది. ఈ క్రమంలో ఆయా విభాగాలు, శాఖల్లో సిబ్బంది (కేడర్ స్ట్రెంగ్త్) వివరాలు సేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఆ శాఖలు, విభాగాధిపతుల కార్యాలయాల్లో మంజూరు చేసిన అధికారులు, సిబ్బంది పోస్టులు (శాంక్షన్డ్ స్ట్రెంగ్త్), ప్రస్తుతం పని చేస్తున్న అధికారులు, సిబ్బంది సంఖ్య (వర్కింగ్ స్ట్రెంగ్త్) వివరాల్ని గురువారం నాటికి పంపించాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె. విజయానంద్ సర్క్యులర్ జారీ చేశారు. - మిగతా3లో




## ఎన్‌సీఈఆర్‌టీ వివాదం- బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం

- కేంద్ర విద్యాశాఖ మంత్రి
- న్యాయవ్యవస్థను అగౌరవపరిచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేసిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్
- ఆర్ఎస్ఎస్ పాత్రపై విచారణ చేయాలని కాంగ్రెస్ డిమాండ్

# జగన్ చేతకానితనం వల్లే సీమ లిఫ్ట్ ఆగింది

టీడీపీ మంత్రుల ధ్వజం

రాయలసీమ ఎత్తిపోతల పథకంపై శాసనమండలిలో తీవ్ర వాగ్వాదం

వైసీపీ హయాంలోనే పనులు ఆగిపోయాయని మంత్రులు నిమ్మల, పయ్యావుల వెల్లడి

సీమకు ఐదేళ్లలో జగన్ చేసిందేమీ లేదని, ఆయనో రాయలసీమ ద్రోహి అని విమర్శ

తమ ప్రభుత్వ హయాంలో సీమ ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించామన్న మంత్రులు

ఎన్జీటీ ఆదేశాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని తీవ్ర ఆరోపణలు



**అమరావతి**

శాసనమండలిలో రాయలసీమ ఎత్తిపోతల పథకం (రాయలసీమ లిఫ్ట్) అంశంపై అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసు కుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే నిలిచిపోయిన ఈ ప్రాజెక్టుపై ఇప్పుడు తమను ప్రశ్నించడం ఏంటని కూటమి ప్రభుత్వ మంత్రులు వైసీపీ సభ్యులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాలుగేళ్ల పాటు ఆగిపోయిన పనులకు సమాధానం చెప్పకుండా, ఇప్పుడు ప్రభు త్వంపై బురద చల్లడమేంటని నిలదీశారు. ఈ సందర్భంగా మంత్రు లు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైసీపీ తీరును తీవ్రంగా ఎండగట్టారు. "రాయలసీమ లిఫ్ట్ పనులు 2020లోనే జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలతో ఆగిపోయాయి. ఈ విషయాన్ని నాటి - మిగతా3లో

## విమాన ప్రయాణికులకు గుడ్ న్యూస్.. టికెట్ రద్దుపై డీజీసీఏ కొత్త రూల్స్

- విమాన టికెట్ బుక్ చేశాక 48 గంటల్లో ఫ్రీగా రద్దు లేదా మార్పు
- దేశీయ ప్రయాణానికి 7 రోజులు, అంతర్జాతీయ ప్రయాణానికి 15 రోజుల ముందు వర్తింపు
- విమానయాన సంస్థల వెబ్‌సైట్లలో బుక్ చేసిన టికెట్లకే ఈ సదుపాయం
- పేరు తప్పుగా పడితే 24 గంటల్లోపు ఛార్జీల్లేకుండా సరిచేసుకునే అవకాశం




## ప్రతి వ్యవస్థ నమ్మకంపై ఆధారపడి ఉంది!

- డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు పూర్తి బాధ్యత వహించడం తప్పనిసరి
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్
- ఆన్‌లైన్ కంటెంట్, చిన్నారుల భద్రతపై ప్లాట్‌ఫామ్‌లే బాధ్యులు
- డీప్‌ఫేక్, ఏఐ దుర్వినియోగంపై కఠిన నియంత్రణ అవసరం
- నమ్మకాన్ని కాపాడే విధంగా డిజిటల్ రంగంలో సంస్కరణలు



మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## ‘ఆపరేషన్ సిందూర్ 2.0’ ఊహలకు అందనంత భయంకరంగా ఉంటుంది

సరిహద్దుల్లో పాకిస్థాన్ సాగిస్తున్న ప్రచ్ఛన్న యుద్ధంపై భారత సైన్యం తీవ్రస్థాయిలో మండిపడింది. గతేడాది పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’ కంటే ఈసారి ప్రతిస్పందన మరింత భీకరంగా ఉంటుందని వెస్టన్ కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ హెచ్చరించారు. ఊహలకు అందనంత భయంకరంగా ఉంటుందని అన్నారు. గతంలో భారత క్షిపణులు పాక్ వైమానిక స్థావరాలను, పీఓకేలోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసినప్పుడు పాక్ సైన్యం కాల్పుల విరమణ కోసం భారత కాళ్లపై పడిందని ఆయన గుర్తుచేశారు. నేరుగా యుద్ధం చేసే ధైర్యం లేక ప్రాక్సీల ద్వారా ముసుగు దాడులకు పాకిస్థాన్ పాల్పడుతోందని, ఆ దేశం ఒక దుర్భరమైన, బలహీనమైన స్థితిలో ఉందని కటియార్ విశ్లేషించారు. పరిస్థితిని బట్టి తాము ఎంతటి కఠిన నిర్ణయానికైనా వెనుకాడబోమని, గతంలో చేసిన దానికంటే ఈసారి దెబ్బ తీవ్రత మరింత బలంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఒకవేళ పాక్ తన తీరు మార్చుకోకపోతే, మరోసారి విధ్వంసాన్ని చవిచూడక తప్పదని వ్యాఖ్యానించారు.

## ఇక ఇజ్రాయెల్‌లోనూ మన యూపీఐ సేవలు




భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) తన సేవలను మరో దేశానికి విస్తరించింది. భారత్, ఇజ్రాయెల్ మధ్య డిజిటల్, ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ యూపీఐ వినియోగంపై నేడు కీలక ఒప్పందం కుదిరింది. ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల ఇజ్రాయెల్ పర్యటన ముగింపు సందర్భంగా ఈ చారిత్రక ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందంలో భాగంగా, ఇజ్రాయెల్ దేశీయ చెల్లింపుల వ్యవస్థతో యూపీఐని అనుసంధానిస్తారు. దీనివల్ల ఇరు దేశాల మధ్య చెల్లింపులు మరింత వేగంగా, సులభంగా, తక్కువ ఖర్చుతో పూర్తి చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. ఈ పరిణామంపై ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. “ఇజ్రాయె-ల్‌లో యూపీఐ వినియోగానికి ఒప్పందం కుదరడం ఆనందంగా ఉంది” అని ఆయన తెలిపారు. ఈ ఒప్పందంతో ఇరు దేశాల్లోని వ్యాపారాలకు లావాదేవీల ఖర్చులు, సమయం తగ్గుతాయని భావిస్తున్నారు. యూపీఐ ఒప్పందంతో పాటు పలు కీలక రంగాల్లో సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించినట్లు ప్రధాని వెల్లడించారు. “కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం, కీలక ఖనిజాలు వంటి రంగాల్లో సహకారం కోసం ‘క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ పార్ట్‌నర్‌షిప్’ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అణుశక్తి, అంతరిక్ష రంగాల్లోనూ కలిసి పనిచేస్తాం” అని మోదీ వివరించారు. భారత్‌లో యూపీఐ వ్యవస్థ ఇప్పటికే అత్యంత ప్రజాదరణ పొందింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ అధ్యయనం ప్రకారం, దేశంలోని మొత్తం లావాదేవీల్లో 57 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయి. ముఖ్యంగా 18–25 ఏళ్ల యువతలో 66 శాతం మంది యూపీఐని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్, శ్రీలంక సహా 8కి పైగా దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. తాజాగా ఈ జాబితాలో ఇజ్రాయెల్ కూడా చేరింది.

## విమాన ప్రయాణికులకు గుడ్ న్యూస్.. టికెట్ రద్దుపై డీజీసీఏ కొత్త రూల్స్

విమాన ప్రయాణికులకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) శుభవార్త చెప్పింది. టికెట్ రద్దు, రిఫండ్‌లకు సంబంధించి సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్ (సీఏఆర్)ను సవరిస్తూ కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. దీని ప్రకారం, ప్రయాణికులు టికెట్ బుక్ చేసిన 48 గంటల లోపు ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండానే టికెట్‌ను రద్దు చేసుకోవచ్చు లేదా మార్పులు చేసుకోవచ్చు. ఈ కొత్త నిబంధనలు మార్చి 26 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే, ఈ ‘లుక్–ఇన్’ పీరియడ్ సదుపాయానికి కొన్ని షరతులు వర్తిస్తాయి. దేశీయ విమాన ప్రయాణానికి కనీసం 7 రోజుల ముందు, అంతర్జాతీయ ప్రయాణానికి 15 రోజుల ముందు బుక్ చేసుకున్న టికెట్లకు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుంది. కేవలం ఎయిర్‌లైన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా నేరుగా టికెట్లు బుక్ చేసుకున్న వారికే ఈ ప్రయోజనం అందుబాటులో ఉంటుంది. ఒకవేళ వేరే విమానానికి టికెట్ మా-ర్చుకుంటే, ఛార్జీల వ్యత్యాసాన్ని ప్రయాణికులు చెల్లించాల్సి ఉంటుంది. 48 గంటలు దాటిన తర్వాత సాధారణ రద్దు ఛార్జీలు వర్తిస్తాయని డీజీసీఏ స్పష్టం చేసింది. టికెట్లపై పేరు తప్పుగా పడితే, బుక్ చేసిన 24 గంటల్లోపు తెలియజేస్తే ఎలాంటి రుసుము లేకుండా సరిచేసుకోవచ్చని తెలిపింది. ఇక రిఫండ్ల విషయంలోనూ డీజీసీఏ స్పష్టత ఇచ్చింది. ట్రావెల్ ఏజెంట్ల ద్వారా బుక్ చేసుకున్న టికెట్ల రిఫండ్ బాధ్యత కూడా విమానయాన సంస్థలదేనని, 14 రోజుల్లోగా ఆ మొత్తాన్ని వాపసు ఇవ్వాలని ఆదేశించింది. క్రెడిట్ కార్డ్ చెల్లింపుల రిఫండ్‌ను 7 రోజుల్లో, ఆఫీసులో నగదు చెల్లింపులను తక్షణమే పూర్తి చేయాలని పేర్కొంది. బేస్ ఫేర్ నాన్–రిఫండబుల్ అయినప్పటికీ, పన్నులు, ఇతర ఛార్జీలను తప్పనిసరిగా వాపసు ఇవ్వాలని స్పష్టం చేసింది.

## ‘రాహుల్ ఏజ్ పెరుగుతోంది- కానీ ఆ గద్దె దక్కదు’

ఇజ్రాయెల్? పార్లమెంట్?లో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ చేసిన విమర్శలను బీజేపీ గురువారం తీవ్రంగా ఖండించింది. రాహుల్ గాంధీకి వయసు అయిపోతోందని, ఆయనకు ప్రధాని అయ్యే అవకాశం లేనందున కాంగ్రెస్? అసంతృప్తితో ఉందని ఎద్దేవా చేసింది. “రాహుల్ గాంధీ, ఆయన కుటుంబం పూర్తిగా రాజీపడ్డారు. దేశ తొలి ప్రధానిగా ఉన్న సమయంలో జవహర్?లాల్ నెహ్రూ భారత భూభాగాలను చైనా, పాకిస్థాన్?లకు ఎందుకు కానుకగా ఇచ్చేశారో కాంగ్రెస్ దేశానికి చెప్పాలి” అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర డిమాండ్ చేశారు. అంతకుముందు, ఇజ్రాయెల్ పార్లమెంట్?లో ప్రధాని మోదీ ప్రసంగాన్ని కాంగ్రెస్ తప్పుబట్టింది. ఇజ్రాయెల్? ప్రధాని బెంజమిన్ నెతన్యాహును మోదీ నిస్సిగ్గుగా సమర్థించారని విమర్శించింది. “గాజాలో మారణహోమానికి పాల్పడుతున్న, వేలాది మంది పాలస్తీనియన్లను ఆకలితో అలమటించేలా చేస్తున్న నెహన్యాహు ప్రభుత్వానికి మోదీ నిస్సిగ్గుగా మద్దతు ఇచ్చారు” అని కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్? శర్మ ఎక్స్ వేదికగా విమర్శించారు.

### బీజేపీ కౌంటర్ ఎటాక్?

కాంగ్రెస్ విమర్శలపై బీజేపీ ప్రతిదాడికి దిగింది. దేశానికి, ప్రధాని మోదీకి ఏదైనా మంచి జరిగినప్పుడు కాంగ్రెస్? దానిని ‘చెడు వార్త’గా భావిస్తుందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర విమర్శించారు. “ఇజ్రాయెల్ పార్లమెంట్?లో ప్రధాని మోదీకి లభించిన గౌరవం దేశానికే గర్వకారణం. అక్కడి ప్రజలు స్వచ్ఛందంగా మోదీ, మోదీ అని నినదించారు. అది 140 కోట్ల భారతీయుల పట్ల ఇజ్రాయెల్ ప్రజలకు ఉన్న ప్రేమకు నిదర్శనం” అని ఆయన పేర్కొన్నారు. “భారత్?–ఇజ్రాయెల్ వ్యూహాత్మక సంబంధాల బలోపేతానికి మోదీ చేసిన కృషికి గుర్తింపుగా ఆయనకు స్పీకర్ ఆఫ్? ది కెస్సెట్? మెడల్? లభించింది. కానీ అధికారం (ప్రధాని పీఠం) దక్కలేదనే బాధలో కాంగ్రెస్ ఉంది. రాహుల్ బాబాకు వయస్సు మళ్లుతోంది. కానీ ఆయనకు ప్రధాని పీఠం దక్కదు.”

### నెహ్రూపై తీవ్ర ఆరోపణలు

ఎప్?స్టీన్? ఫైల్స్ ప్రభావంతో మోదీ రాజీపడ్డారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించడంపై సంబిత్ పాత్ర తీవ్రంగా స్పందించారు. ఆయన జవహర్?లాల్? నెహ్రూపై సంచలన ఆరోపణలు చేశారు. నెహ్రూ హయాంలో భారత్? మ్యాప్?ను శాశ్వతంగా మా-రుస్తూ చైనా, పాకిస్థాన్?లకు కీలక భూభాగాలను అప్పగించారని ఆరోపించారు. చైనాకు కోపం వస్తుందనే భయంతో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వాన్ని తిర-స్కరించారని అన్నారు.

# భారత్-ఇజ్రాయెల్ మధ్య కీలక ఒప్పందాలు



భారత్, ఇజ్రాయెల్ మధ్య సంబంధాలు ప్రతి సవాల్‌ను తట్టుకుని కాలపరీక్షకు నిలిచాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పరస్పర విశ్వాసం, ప్రజాస్వామ్య విలువలపై ఏర్పడిన ఈ బంధం ఎంతో బలమైనదని పేర్కొన్నారు. ఇరు దేశాల భాగస్వామ్యాన్ని ‘శాంతి, ఆవిష్కరణ, శ్రేయస్సు కోసం ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం’స్థాయికి పెంచుతూ చారిత్రక నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. జెరూసలేంలో గురువారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ మాట్లాడారు. అంతకుముందు ఇరు దేశాల మధ్య పలు కీలక అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) జరిగాయి. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో సహకారాన్ని వేగవంతం చేసేందుకు ‘క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ పార్ట్‌నర్‌షిప్’ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయె-ల్‌లో యూపీఐ సేవలను వినియోగిం చేందుకు ఒప్పందం కుదరడం సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో సహకారానికి సుదీర్ఘ చరిత్ర ఉందని, దీన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. ఇజ్రాయెల్ సహకారంతో భారత్‌లో ఏర్పాటు చేసిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ విజయవంతం కావడంతో, వాటి సంఖ్యను 100కు పెంచనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి తుది రూపు ఇస్తామని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై ఇరు దేశాల వైఖరి స్పష్టంగా ఉందని, దానికి ప్రపంచంలో చోటు లేదని మోదీ స్పష్టం చేశారు. గాజా శాంతి ప్రణాళిక ద్వారా శాంతికి మార్గం ఏర్పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇచ్చిందని పునరుద్ఘాటించారు. తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఇజ్రాయెల్ చారిత్రక గడ్డపై అడుగుపెట్టడం గర్వంగా, భావోద్వేగంగా ఉందని మోదీ అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ ‘క్నెస్సెట్’లో ప్రసంగించే అవకాశం కల్పించినందుకు, స్పీకర్ మెడల్‌తో సత్కరించినందుకు నెతన్యాహుకు, ఇజ్రాయెల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మోదీ పర్యటన చిన్నదే అయినా అద్భుతం: నెతన్యాహు ప్రశంసలు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన చిన్నదే అయినప్పటికీ, అది అసాధారణంగా ఫలవంతమైందని, హృదయాలను కదిలించిందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. గురువారం జెరూసలేంలో ఇరు నేతల మధ్య చర్చల అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. “ఇది ఒక అద్భుతమైన పర్యటన. పర్యటన ముగింపు కూడా అంతే అద్భుతంగా ఉంది. నిన్న ఇజ్రాయెల్ పార్లమెంట్ ‘నెస్సెట్’లో మోదీ చేసిన ప్రసంగం అందరి కళ్లను చెమర్చేలా చేసింది” అని నెతన్యాహు ప్రశంసించారు. ఇరు దేశాల్లోని ప్రతిభావంతుల మధ్య సహకారం గురించి చర్చించామని, వాటిని నిర్దిష్ట ప్రణాళికలుగా మారుస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా భారత్‌లో ప్రభుత్వ స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన ప్రకటించారు. ఇది ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ నాయకత్వం లోని భారత ప్రభుత్వం చాలా సమర్థవంతంగా పనిచేస్తోందని నెతన్యాహు కితాబిచ్చారు. “ఆవిష్కరణలను అందిపుచ్చుకున్న వారికే భవిష్యత్తు ఉంటుంది. భారత్, ఇజ్రాయెల్ గర్వించ దగిన ప్రాచీన నాగరికతలు. భవిష్యత్తును అందిపుచ్చు కోవడానికి మేం నిశ్చయించుకున్నాం. కలిసికట్టుగా మరింత అభివృద్ధి సాధించగలం” అని అన్నారు. ప్రెసిషన్ అగ్రికల్చర్, ప్రెసిషన్ ఎడ్యుకేషన్ వంటి రంగాల్లో కలిసి పనిచేయడం ద్వారా ప్రతి ఒక్కరి సామర్థ్యాన్ని వెలికితీయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం బుధవారం ఇజ్రాయెల్ చేరుకున్న ప్రధాని మోదీకి నెతన్యాహు దంపతులు ఘన స్వాగతం పలికారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించారు.

# ప్రతి వ్యవస్థ నమ్మకంపై ఆధారపడి ఉంది!

డిజిటల్ ప్రపంచంలో ప్లాట్‌ఫామ్‌లు ఇకపై బాధ్యత నుంచి తప్పించుకోలేవని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. తాము ప్రదర్శించే లేదా ప్రచురించే ప్రతి కంటెంట్‌కు పూర్తి బాధ్యత వహించాల్సిందేనని ఆయన కఠిన హెచ్చరిక చేశారు. ఆన్‌లైన్‌లో చిన్నారులు, సాధారణ పౌరుల భద్రతను కాపాడటం వారి ప్రాథమిక కర్తవ్యమని తెలిపారు. డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడిన కేంద్ర మంత్రి, వేల ఏళ్లుగా మనుషుల సమాజం నిర్మించు కున్న విశ్వాస వ్యవస్థలను డిజిటల్ వేదికలు దెబ్బతీయ కూడదని సూచించారు. కుటుంబం నుంచి న్యాయవ్యవస్థ, మీడియా, శాసనసభ వరకు ప్రతి వ్యవస్థ నమ్మకంపై ఆధార పడి పనిచేస్తుందని గుర్తుచేశారు. అదే నమ్మకాన్ని డిజిటల్ ప్రపంచం కూడా పాటించాల్సిన అవసరం ఉందన్నారు.

### చట్టబద్ధమా కాదా అన్నది పరిశీలించాల్సిందే!

డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఇప్పటివరకు తాము కేవలం వేదిక మా-త్రమేనని చెప్పే రోజులు ముగిశాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచానికి ఆతిథ్య వేదికలుగా మారిన ఈ ప్లాట్‌ఫామ్‌లు తమ వద్ద ప్రసారం అయ్యే సమాచారంపై బాధ్యత వహించాల్సిందేనని చెప్పారు. ఒక హోటల్ యజమాని తన హోటల్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసుకునే బాధ్యత తీసుకున్నట్లే, డిజిటల్ వేదికలు కూడా తమ వద్ద హోస్ట్ అయ్యే కంటెంట్ చట్టబద్ధమా కాదా అన్నది పరిశీలించాలన్నారు.

### చట్టపరమైన చర్యలు తప్పవ్

అల్గారిథమ్‌ల ద్వారా వ్యాప్తి చెందే సమాచారం మోసపూరితమైందా? పౌరులకు హాని కలిగిస్తుందా? చిన్నారులపై ప్రభావం ఉంటుందా? నేరాలకు దోహదపడుతుందా? వంటి ప్రశ్నలకు ప్లాట్‌ఫామ్‌లే సమాధానం చెప్పాలని స్పష్టం చేశారు. బాధ్యతను విస్మరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



### ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా!

ఏఐ ఆధారిత కంటెంట్‌పై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వేరొకరి ముఖం, గొంతు, వ్యక్తిత్వాన్ని అనుమతి లేకుండా ఉపయోగించి కంటెంట్ సృష్టించడం అనైతికమని, దానికి నియంత్రణ అవసరమని పేర్కొన్నారు. డీప్‌ఫేక్‌ల ద్వారా లేనిది ఉన్నట్లు చూపించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉందని అన్నారు. ఇలాంటి సాంకేతికతలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని చెప్పారు.

### భవిష్యత్తులో డిజిటల్ రంగ అభివృద్ధికి కీలకం

మీడియా పాత్రను ఉదాహరణగా తీసుకుంటూ, సమాచారాన్ని ధ్రువీకరించి మాత్రమే ప్రచురించడం, పాక్షికత లేకుండా వ్యవహరించడం, బాధ్యత వహించడం వంటి విలువల వల్లే మీడియాకు విశ్వసనీయత వచ్చిందన్నారు. ఇదే ధోరణిని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు కూడా అనుసరించాలన్నారు. త్వరగా మారుతున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా డిజిటల్ రంగంలో పెద్ద ఎత్తున సంస్కరణలు అవసరమని అభిప్రాయ పడ్డారు. సమాజం కోరుతున్న ఈ మార్పును ప్లాట్‌ఫామ్‌లు గౌరవించాలన్నారు. ప్రజల నమ్మకాన్ని కాపాడటమే భవిష్యత్తులో డిజిటల్ రంగ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు.

### సమాజానికి మేలు చేసే దిశగా!

ఇక రైల్వే రంగంలో సాంకేతికతను మరింతగా ప్రోత్సహించేం దుకు కేంద్రం రైల్టెక్ విధానాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. స్టార్టప్‌లు, పరిశోధకులు సులభంగా రైల్వేలతో అనుసంధానం కావడానికి ప్రత్యేక డిజిటల్ పోర్టల్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఎలాంటి అడ్డంకులు లేకుండా ఎండ్ టు ఎండ్ ప్రక్రియను పూర్తిగా డిజిటల్ రూపంలో అమలు చేస్తామని వెల్లడించారు. కొత్త సాంకేతికతలను ప్రయోగాత్మకంగా అమలు చేసి రైల్వే సేవలను మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. డిజిటల్ వేదికలు బాధ్యతాయుతంగా వ్యవహరించి సమాజానికి మేలు చేసే దిశగా పనిచేయాల్సిన సమయం వచ్చిందని మంత్రి స్పష్టం చేశారు. పిల్లలు, పౌరుల భద్రతను కాపాడుతూ విశ్వసనీయ సమాచారాన్ని అందించడమే వారి ప్రధాన బాధ్యత అని ఆయన తేల్చిచెప్పారు.

# ఎన్‌సీఈఆర్‌టీ వివాదం- బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం

ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యపుస్తకంలో ‘న్యాయవ్యవస్థలోని అవినీతి’ గురించి ఒక అధ్యాయం చేర్చడంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ వివాదాస్పద అంశాన్ని పిల్లల పాఠ్యాంశంగా రూపొందించిన వారిని బాధ్యులుగా చేస్తామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గురువారం పేర్కొన్నారు. ప్రభుత్వానికి న్యాయవ్యవస్థపై పూర్తి గౌరవం ఉందని, ఆ వ్యవస్థను అగౌరవపరిచే ఉద్దేశం ఏమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థను అప్రతిష్ఠపాలు చేసే ఒక సంఘటిత కుట్ర జరిగినట్లు కనిపిస్తోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ఈ కీలక ప్రకటన చేయడం గమనార్హం.

### బీజేపీ స్టాండ్ ఇదే!

మరోవైపు బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. ఎన్?సీఈఆర్?టీ పుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించి ఉన్న వివాదాస్పద అధ్యయాన్ని ‘సున్నితమైన అంశంగా’ అభివర్ణించింది. తాము దేశ న్యాయవ్యవస్థను గౌరవిస్తామని, దాని నిష్పాక్షిక పనితీరు పట్ల గర్విస్తున్నామని పేర్కొంది. “ఇది చాలా సున్నితమైన అంశం. పార్టీ ప్రతినిధిగా నేను ఒక విషయం స్పష్టం చేయాలని అనుకుంటున్నాను. భారత్?లోనే కాకుండా ప్రపంచం మొత్తంలో భారత న్యాయవ్యవస్థ అంత స్వతంత్రమైనది, అర్హత కలిగినది మరెక్కడా లేదని నేను చెబుతాను. భారత న్యాయవ్యవస్థ పట్ల మనందరికీ ఎంతో గౌరవం, గర్వం ఉన్నాయి. ఇది ప్రతి ఒక్కరి హృదయంలోని భావన.”

బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు, ప్రభుత్వం న్యాయవ్యవస్థకు అండగా ఉంటుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారని సంబిత్ పాత్ర గుర్తుచేశారు.

### ఆ పుస్తకంపై నిషేధం

వివాదాస్పద ఎన్?సీఈఆర్?టీ 8వ తరగతి సామాజిక శాస్త్ర పుస్తకంలో అవినీతి, భారీగా పేరుకుపోయిన కేసులు, సరిపడా సంఖ్యలో న్యాయమూర్తులు లేకపోవడం వంటివి న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లుగా పేర్కొన్నారు. అంతేకాదు న్యాయవ్యవస్థలో అవినీతి అనే సబ్?ఛాప్టర్?ను చేర్చారు. ఇదే తీవ్ర వివాదానికి దారి తీసింది. అందుకే ఈ పాఠ్యపుస్తకంపై సుప్రీంకోర్టు పూర్తిస్థాయి నిషేధం విధించింది. అంతేకాదు ఫిజికల్, డిజిటల్ రూపంలో ఉన్న అన్ని కాపీలను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది.

తాము రూపొందించిన 8వ తరగతి పాఠ్యపుస్తకంలో ‘అనుచిత కంటెంట్ ఉండడం’పై నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) క్షమాపణలు చెప్పింది. సదరు పాఠ్యాంశాన్ని తొలగిస్తామని పేర్కొంది. ఇది జరిగిన ఒక రోజు తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్, “వారు తుపాకీతో కాల్చారు. న్యాయవ్యవస్థ రక్తమోడుతోంది” అంటూ ఎన్‌సీఈఆర్‌టీపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

### పాత్రపై విచారణ చేయాలి!

మరోవైపు ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో ‘న్యాయవ్యవస్థలోని అవినీతి’ అంశాన్ని చేర్చడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడాన్ని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ సమర్థించారు. గత దశాబ్ద కాలంగా పాఠ్యపుస్తకాల రూపకల్పనలో ‘రాష్ట్రీయ స్వ-యంసేవక్ సంఘ్’ (ఆర్‌ఎస్‌ఎస్) సాగించిన ‘దుర్మార్గపు, ద్వేషపూరిత చర్యల’పై విచారణ జరిపించాలని డిమాండ్ చేశా-రు. “ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో న్యాయవ్యవస్థపై ఉన్న విమర్శనాత్మక ప్రస్తావనల పట్ల సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడం సరైనదే. నిజానికి గత దశాబ్దకాలంగా ఈ పుస్తకాలను తిరిగి రాసిన తీరు సిగ్గుచేటు. ఇది ఆర్?ఎస్?ఎస్ చేస్తున్న దుర్మార్గపు, కుట్రపూరితమైన పని. వాస్తవానికి ఈ మొత్తం ముఠాపై విచారణ జరగాలి.”

### వారికి షోకాజ్ నోటీసులు

పిల్లల పాఠ్యపుస్తకంలో ‘న్యాయవ్యవస్థలో అవినీతి’ అనే ఉప-అధ్యాయాన్ని చేర్చినందుకు విద్యామంత్రిత్వశాఖ కార్యదర్శికి, ఎన్?సీఈఆర్?టీ డైరెక్టర్? దినేశ్ ప్రసాద్ సక్లానీకి సుప్రీంకోర్టు గురువారం షోకాజ్? నోటీసులు జారీ చేసింది. కోర్టు ధిక్కార చర్యలు, ఇతర చట్టాల కింద వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని కోరింది. వాస్తవానికి ఇప్పటికే ఎన్?సీఈఆర్?టీ క్షమాపణలు చెప్పినప్పటికీ, ఈ అంశంపై సుమోటోగా చేపట్టిన విచారణను నిలిపివేయడానికి నిరాకరించింది. అంతేకాదు ఈ ఉత్తర్వులు ఉల్లంఘించే ఏ ప్రయత్నమైనా న్యాయపరిపాలనలో నేరుగా జోక్యం చేసుకున్నట్లు, కోర్టు ధిక్కారచర్యలు చేపట్టినట్లే భావిస్తామని హెచ్చరించింది. సదరు వివాదాస్పద అధ్యాయాన్ని ఆమోదించిన టీచింగ్–లెర్నింగ్ మెటీరియల్స్ కమిటీకి సంబంధించిన పూర్తి రికార్డులను సమర్పించాలని సుప్రీంకోర్టు ఎన్?సీఈఆర్?టీని ఆదేశించింది. ముఖ్యంగా ఆ పాఠ్యాంశ రూపకల్పన బృందంలోని సభ్యుల పేర్లు, వారి అర్హతలు, ఇతర వివరాలను అందజేయాలని స్పష్టం చేసింది.

# నదుల అనుసంధానంతో నీటి సమస్యలు తగ్గుతాయి

–మొదటిపేజీ తరువాయి

సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టులన్నీ ఎన్డీయే లేదా టీడీపీ హయాంలోనే జరిగాయని ఇంకా పట్టిసీమ నుంచి 100 టీఎంసీలు కృష్ణాకు తీసుకొచ్చామని వెల్లడించారు. వెలిగొండ ప్రాజెక్టుకు తానే శంకుస్థాపన చేశా, తానే పూర్తి చేస్తున్నానని స్పష్టం చేశారు. ధవళేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మాణం వల్ల కాటన్ దొరను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటున్నారని గోదావరి జిల్లాల్లో కాటన్ దొర విగ్రహాలు పెట్టి పూజిస్తున్నారని సీఎం చంద్రబాబు అన్నారు.

"పోలవరం అతిపెద్ద ప్రాజెక్టు ఎమ్మెల్యేలందరూ ఒకసారి చూసి రావాలి. పోలవరం వంటి పెద్ద ప్రాజెక్టు దేశంలో మరొకటి నిర్మించే అవకాశం లేదు. పుష్కరాల కంటే ముందు పోలవరాన్ని పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. అన్ని రిజర్వాయర్లు కళకళలాడుతున్నాయంటే ప్రభుత్వ దూరదృష్టి. ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలని మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు అందించేలా చర్యలు.'

కాళేశ్వరంకు మేం అభ్యంతరం చెప్పలేదు: పోలవరం–నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదని గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి వెళ్లే వరద జలాలను తరలిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరిపై ఎగువ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందని అందుకు మేం అభ్యంతరం చెప్పలేదని తెలిపారు. ఆ ప్రాజెక్టు వల్ల తెలుగు రాష్ట్రాలకు లాభమని చెప్పారు. పోలవరం డయాఫ్రంవాల్ కొట్టుకుపోతే గుర్తించలేని పరిస్థితి గత పాలకులదని విమర్శించారు. చేయని నేరానికి నన్ను గత పాలకులు 53 రోజులు పాటు జైల్లో పెట్టారని రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరు ఇవ్వాలన్న లక్ష్యంతోనే పని చేస్తున్నానని సీఎం తెలిపారు.

కావేరిపై 2 రాష్ట్రాలు ఎలా కొట్లాడుకుంటున్నాయో చూశామని నీరు పుష్కలంగా ఉంటే ఎలాంటి సమస్యలు రావని సీఎం చంద్రబాబు అన్నారు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యలను తీసుకొస్తున్నారని మండిపడ్డారు. ఏపీకి ఉండే వాటర్ సెక్యూరిటీ దక్షిణ భారత్‌లో మరే రాష్ట్రానికీ లేదని భూమినే జలాశయంగా మార్చి నీటి సంరక్షణ చేయాలని అందరికీ పిలుపునిస్తున్నానని వివరించారు. సాగునీరు, పరిశ్రమలకు నీరు, ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తే లక్ష్యం సాధించినట్లేనని అన్నారు. తెలుగుతల్లికి జలహారతి ఇచ్చేలా ప్రతి ఎకరాకు నీరివ్వాలని సంకల్పతో ఉన్నామని అలానే రాష్ట్రంలో ప్రాజెక్టుల పూర్తికి బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు.

చట్ట సవరణ బిల్లులకు ఆమోదం: హరిత ఇంధన కంపెనీలకు అసైన్డ్ భూములు లీజుకు ఇచ్చేందుకు వెసులుబాటు కల్పించే చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టగా ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పార్థసారథి బలపరిచారు. కర్బన ఉద్గారాలు సున్నాకు తీసుకొచ్చే లక్ష్యంతో హరిత ఇంధన సంస్థలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అనగాని తెలిపారు. రాష్ట్రంలో 10,000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటవుతున్నట్లు వెల్లడించారు. తద్వారా 7 లక్షల 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు.

గ్రామ, వార్డు సచివాలయాలను స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డులుగా మారుస్తూ చట్ట సవరణకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆమోదం తెలిపింది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఈ బిల్లు ప్రవేశపెట్టగా ఎమ్మెల్యేలు గణబాబు, కాల్వ శ్రీనివాసులు బలపరిచారు. బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల విధులపై స్పష్టత లేదన్నారు. కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ 2047తో పని చేస్తోందని అందుకు తగ్గట్లుగా సచివాలయాల విధుల్లో మార్పులు చేశామన్నారు. ఈ క్రమంలోనే స్వర్ణగ్రామం, స్వర్ణ వార్డులుగా పేర్లు మారుస్తూ చట్టసవరణ చేస్తున్నట్లు వివరించారు. స్వర్ణగ్రామ, స్వర్ణ వార్డుల సిబ్బందికి పదోన్నతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. స్వర్ణగ్రామాలు, స్వర్ణ వార్డుల పర్యవేక్షణకు ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారిని గవర్నింగ్ బాడీగా నియమించినట్లు చెప్పారు.

**జీరో అవర్లో సమస్యలపై మాట్లాడిన నేతలు**

అసెంబ్లీ జీరో అవర్లో మాట్లాడిన మాట్లాడిన ఎమ్మెల్యేలు నియోజకవర్గాల పరిధిలో ఉన్న సమస్యలు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలను ప్రస్తావించారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అజిత్ సింగ్ నగర్ ప్రాంతంలో ట్రాఫిక్ పెరిగినందున ప్రస్తుత ఫ్లైఓవర్ సరిపోవటం లేదని రెండో ఫ్లైఓవర్ నిర్మించాలని కోరారు. చీరాల ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ మొంథా తుపాన్ కారణంగా చీరాల ప్రాంతంలో రోడ్లకు గుంతలు పడ్డాయన్నారు. రూ.8.40 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపించామని త్వరగా నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ ఒంగోలు–కత్తిపూడు హైవే 1సిమెంట్ రోడ్డు కావటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. నో హెల్మెట్–నో ఫ్యూయల్ విధానం తెచ్చి హెల్మెట్ లేని వారికి పెట్రోల్ కొట్టకుండా చట్టం చేయాలన్నారు.

తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతిలో టీటీడీ భవనాలకు పన్ను చెల్లించటం లేదన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునిత మాట్లాడుతూ హంద్రీనీవా ప్రధాన కాలువకు పిల్ల కాలువలు నిర్మించటం ద్వారా రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల పరిధిలో సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖలో రహదారులు చిన్నగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని విశాఖ నార్త్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిష్టాత్మక సంస్థలు విశాఖలో కంపెనీలు ఏర్పాటు చేస్తున్నందున మెట్రో నిర్మాణం, ఫ్లైఓవర్లు రహదారుల విస్తరణ చేపట్టాలని కోరారు.

**ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి చర్యలు:**

మత్స్యకారులకు ఉపాధి పెంచే ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి బీసీ జనార్థనరెడ్డి తెలిపారు. పిషింగ్ హార్బర్ల నిర్మాణంపై ఎమ్మెల్యేలు నడికుడితి ఈశ్వరరావు, లోకం మాధవి అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఎచ్చర్ల నియోజకవర్గంలోని బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులకు రూ.441 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. దీనికి సాస్కి నిధులు వినియోగిస్తామని చెప్పారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో చింతపల్లి జెట్టీ నిర్మించేందుకు ప్రతిపాదనలున్నాయని ప్రస్తుతానికి అక్కడ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ మంజూరు చేసి టెండర్లు పిలిచామన్నారు.

రాయితీలు, ప్రోత్సాహకాలు అందించటం ద్వారా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు తోడ్పాటు అందిస్తున్నట్లు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చాక 751 ఎకరాలు ఎస్సీ, ఎస్టీలు ఏర్పాటు చేసే పరిశ్రమలకు కేటాయించామని డీపీఆర్ ప్రకారం రూ.1274 కోట్లు పెట్టుబడులు పెడుతున్నారని వివరించారు. ఎస్సీ ఎస్టీలకు రూ.37 కోట్లు రిబేటు ఇచ్చామని ఎలాంటి పెనాల్టీ లేకుండా కాలపరిమితి పెంచామని తెలిపారు. రూ.100 కోట్లు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి 5000 ఎంఎస్ఎంఈలకు సహకరించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

**15 రకాల రక్షణ ఫీచర్లతో పాస్ పుస్తకాలు**

భూముల రీసర్వే ద్వారా రాజముద్రతో పాటు 15 రకాల రక్షణ ఫీచర్లతో పాస్ పుస్తకాలు అందిస్తున్నట్లు రెవిన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. భూముల రీసర్వేపై ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. జగన్ ప్రచారయావ, భూమిని కాజేసే ఆలోచనలతో గతంలో భూసర్వేలో సమస్యలు వచ్చాయన్నారు. రాళ్లు పాతడానికి రూ.700 కోట్లు ఖర్చు చేసిన జగన్ రీసర్వేపై సరైన దృష్టి పెట్టలేదని ఆరోపించారు. కూటమి వచ్చాక రీసర్వేపై గ్రామ సభలు, రెవెన్యూ సదస్సులు పెట్టామని, సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని వివరించారు. రీసర్వే 2.0లో బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా రికార్డులను ట్యాంపరింగ్ కాకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 7,926 గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యిందని 4,236 గ్రామాల్లో రీసర్వే జరుగుతోందని చెప్పారు. వైఎస్సార్సీపీ హయాంలో అనర్హులకు ఎక్కడైనా ఇంటి స్థలాలిస్తే వాటిని రద్దు చేస్తామని గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. అప్పట్లో కొన్నిచోట్ల పట్టాలు ఇచ్చి స్థలాలు ఇవ్వలేదని తెలిపారు. వారిలో అర్హులను గుర్తించే ప్రక్రియ జరుగుతోందని పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు భూమి ఇస్తామని చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో కేంద్రం నిబంధనలు మార్చిందని దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల కోసం ఇచ్చే నిధుల్లో తేడా జరిగిందన్నారు.

# ఏపీలో కొత్త సోలార్ పార్కు

**అనంతపురం :** ఏపీలో కొత్త సోలార్ పార్కు ఏర్పాటు కానుంది, శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలో సోలార్ పవర్ పార్కు ఏర్పాటు చేయడానికి ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.1200 కోట్లతో 200 మెగావాట్ల సోలార్ పార్కు ఏర్పాటు చేయడానికి అనుమతి ఇచ్చింది. యశస్య పవర్ ఎల్ఎల్‌పీ ఈ సోలార్ పవర్ పార్కు ఏర్పాటు చేయనుంది. పరిగి మండలం బీచుగానిపల్లితో పాటుగా ఆ సమీప గ్రామాలలో ఈ సోలార్ పార్కు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో సోలార్ పార్క్ ఏర్పాటు కానుంది. శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలో 200 మెగావాట్ల సోలార్ పవర్ పార్కు ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.1200 కోట్లతో యశస్వ పవర్ ఎల్‌ఎల్‌పీ ఈ సోలార్ పార్కును అభివృద్ధి చేయనుంది. ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ లక్ష్యాల సాధన దిశగా ఈ సోలార్ పార్కు ఉపయోగపడనుంది. అలాగే పలువురికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు తెలిపారు. మరోవైపు యశస్వ పవర్ ఎల్ఎల్‌పీ సంస్థ.. క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనుబంధ సంస్థ. శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలోని బీచిగానిపల్లి , ఆ చుట్టుపక్కల గ్రామాల్లో ఈ సోలార్ పార్క్ ఏర్పాటు కోసం ప్రణాళికలు రచిస్తున్నారు. మరోవైపు ఏటా 445 మిలియన్ యూనిట్ల క్లీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంతో ఈ సోలార్ పార్కు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఈ ప్రాజెక్టు ద్వారా 690 మందికి ప్రత్యక్షంగా. మరికొందరికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని



అధికారులు చెప్తున్నారు. 1200 ఎకరాల విస్తీర్ణంలో ఈ సోలార్ పార్కు ఏర్పాటుకానుంది."ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పునరుత్పాదక ఇంధన రంగంలో క్లీన్‌మాక్స్ సంస్థ పెట్టుబడిని స్వాగతిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024కి అనుగుణంగా, పెద్ద ఎత్తున గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా రాష్ట్రాన్ని బలోపేతం చేస్తుంది" అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఓ ప్రకటన విడుదల అయ్యింది. మరోవైపు ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరవు పరిస్థితులు ఎక్కువ. దీంతో ఈ ప్రాంతం నుంచి అటు కర్నాటక, ఇటు హైదరాబాద్ ప్రాంతాలకు జనం వలస పోతుంటారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో డ్రోన్లు, ఏరోస్పేస్, సోలార్ పార్కులు ఏర్పాటు ద్వారా స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు అటు కర్ణాటక రాజధాని బెంగళూరు, ఇటు తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు మధ్యలో ఉండటంతో ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు సంస్థలు ఆసక్తి చూపుతున్నారు. జాతీయ రహదారి సౌకర్యం, సమీపంలోనే విమానాశ్రయాలు ఉండటంతో ఆసక్తి చూపుతున్నారు.

## విజయవాడవాసులకు పండగే..
## కొత్తగా 100 ఎలక్ట్రికల్ బస్సులు, 11 రూట్‌లలో పరుగులు

**విజయవాడ :** ఏపీకి కేంద్రం పీఎం ఈ–బస్ సేవా పథకం కింద విద్యుత్ బస్సులు కేటయించిన సంగతి తెలిసిందే. అయితే ఈ బస్సుల్లో విజయవాడకు ఏకంగా 100 బస్సుల్ని కేటాయించారు. అయితే ఈ బస్సులు మరో ఆరు నెలల్లో అందుబాటులోకి వస్తాయని చెబుతున్నారు. ఈ బస్సుల నిర్వహణ కోసం విద్యాధరపురం డిపోలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బస్సులు మొత్తం 11 రూట్లలో అందుబాటులోకి రానున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సహకారంతో పీఎం ఈ–బస్ సేవా పథకం ద్వారా రాష్ట్రానికి ఎలక్ట్రికల్ బస్సులు తీసుకొస్తోంది. ప్రధాన నగరాలకు ఈ బస్సుల్ని కేటాయించారు.. అయితే విజయవాడకు కూడా భారీగా బస్సుల్ని కేటాయించారు. విజయవాడకు మొత్తం 100 బస్సులు కేటాయించారు.. ఈ బస్సుల నిర్వహణ కోసం విద్యాధరపురం డిపోలో ఏర్పాట్లు చేయనున్నారు. ఈ బస్సులకు సంబంధించిన ఒప్పందం కూడా పూర్తి చేయగా.. మరో ఆరు నెలల్లో బస్సులు విజయవాడలో పరుగులు తీయనున్నాయి. ఈ ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ భారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే. విజయవాడ నగరంలో మొత్తం 400 బస్సు?లు ఉన్నాయి.. అయితే కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులు రానుండటంతో.. పాత బస్సుల్ని పక్కన పెడతారు. ఈ ఎలక్ట్రిక్ బస్సులతో దాదాపుగా 7వేల లీటర్ల డీజిల్ వరకు ఆదా అవుతుంది.. కాలుష్యం కూడా తగ్గుతుందంటున్నారు. విద్యాధరపురం డిపోలో ఈ బస్సుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాదు విద్యాధరపురం డిపోను పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సుల కోసం కేటాయిస్తున్నారు.. అక్కడ ఉన్న బస్సుల్ని పొరుగున ఉన్న డిపోలకు తరలిస్తారు.. ఉద్యోగుల్ని కూడా అక్కడికి పంపిస్తారని చెబుతున్నారు. విద్యాధరపురం డిపోలో అవసరమైన పనులు చేపట్టేందుకు రూ.12.5 కోట్లు కేటాయించారు. ఈ ఎలక్ట్రిక్ బస్సుల కోసం సబ్ స్టేషన్ (6,000 కేవీ), ఛార్జింగ్ స్టేషన్ నిర్మిస్తారు. మొత్తం 20 ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో పాయింట్‌లో ఐదు బస్సుల్ని ఛార్జ్ చేసుకోవచ్చు. అయితే నిధుల్లో కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం సమకూరుస్తాయి. ఈ బస్సుల నిర్వహణ బాధ్యతను పినాకిల్ మొబిలిటీ సంస్థకు అప్పగించారు. ఈ బస్సుల్లో విధులు నిర్వహించేందుకు మొత్తం 250 మంది డ్రైవర్లను పినాకిల్ సంస్థ సమకూరుస్తుంది. ఈ బస్సులకు సబంధించి అవసరమైన 250 మంది కండక్టర్లను ఆర్టీసీ సర్దుబాటు చేయనుంది. ఒక్కో బస్సులో 40 సీట్లు ఉంటాయి.. అలాగే ఉచిత బస్సు పథకం స్త్రీశక్తి కూడా వర్తిస్తుంది. విజయవాడకు కేటాయించిన మొత్తం 100 బస్సులు 11 రూట్లలో అందుబాటులోకి రానున్నాయి.

## జగన్ చేతకానితనం వల్లే సీమ లిఫ్ట్ ఆగింది

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ మంత్రి హరీశ్ రావు స్వయంగా ప్రకటించారు. అలాంటప్పుడు, నాలుగేళ్లుగా అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం ఏం చేసింది? కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయకుండా నిర్లక్ష్యం వహించింది మీ అసమర్థత కాదా?" అని పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో రాయలసీమ ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి, ప్రాజెక్టులు కొట్టుకుపోవడానికి కారణమైన జగన్ రెడ్డి ఓ రాయలసీమ ద్రోహి అని వారు అభివర్ణించారు. తమ ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు. "రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో వైసీపీ ప్రభుత్వం సీమకు 1 శాతం నిధులు కూడా ఖర్చు చేయలేదు. కానీ, మేం హంద్రీనీవా పనులు పూర్తి చేసి 190 రోజుల్లోనే 44 టీఎంసీల నీటిని తరలించాం. ప్రస్తుతం రాయలసీమ ప్రాజెక్టుల్లో 366 టీఎంసీల నీటిని నిల్వ చేశాం. ఇది మా నాయకుడు చంద్రబాబు సమర్థతకు నిదర్శనం" అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం 20 నెలల్లోనే రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిందని, తాజా బడ్జెట్‌లో మరో రూ.10,014 కోట్లు కేటాయించిందని వివరించారు. వైసీపీ ప్రభుత్వం జీఓ 365 తెచ్చి 102 సాగునీటి ప్రాజెక్టులను రద్దు చేసిందని, గోరుకల్లు, గాలేరు–నగరి వంటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించిందని మంత్రులు ఆరోపించారు. "మీ దరిద్రపు పాలనలో, మీ అసమర్థ నాయకుడి చేతకానితనం వల్లే రాయలసీమ లిఫ్ట్ ఆగిపోయింది. ఆ నిజాన్ని కప్పిపుచ్చి ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు ఒక యజ్ఞంలా పనిచేస్తుంటే, వైసీపీ నేతలు రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు" అని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ హయాంలో నిలిచిపోయిన పనులకు మమ్మల్ని బాధ్యులను చేసే ప్రయత్నాన్ని మానుకోవాలని వారు హితవు పలికారు.

## పది విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక

-మొదటిపేజీ తరువాయి

గతంలోకంటే పదిలో ఉత్తమ ఫలితాలు రాబట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తోంది. ఈ నిర్ణయం మంచి ఫలితాలను ఇస్తోందని విద్యార్థులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు ఎంతో దోహదం చేస్తుందంటున్నారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవడంతో పాటు ఆహారపరంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఏప్రిల్? 1 వరకు పరీక్షలు జరగనున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న వంద రోజులు ప్రణాళిక మెరుగైన ఫలితాలు సాధనకు ప్రయోజనకరంగా మారుతుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడతున్నారు. డిసెంబర్ 6 నుంచి నూరు శాతం పది ఫలితాల కోసం 100 రోజుల ప్రణాళిక పేరిట విద్యార్థులకు ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సంపూర్ణంగా సిద్ధమవ్వడానికి, పబ్లిక్ పరీక్షల కంటే 100 రోజుల ముందు (సాధారణంగా డిసెంబర్ నుంచి) ప్రభుత్వం అమలు చేసే ప్రత్యేక ప్రణాళికే ఈ 100 రోజుల యాక్షన్ ప్లాన్. దీని ముఖ్య ఉద్దేశం సిలబస్ పూర్తి చేయడం, రివిజన్, బలహీన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉత్తీర్ణత శాతం పెంచడం. పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి రోజు ఒక సబ్జెక్టులో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా శిక్షణ ఇస్తే మెరుగైన ఫలితాలు సాధ్యపడతాయని ఉపాధ్యాయులు కూడా అభిప్రాయపడుతున్నారు.

**ప్రతి రోజూ పరీక్షలు నిర్వహిస్తూ...**

వంద రోజుల పాఠ్య ప్రణాళికలో భాగంగా రోజుకు ఒక సబ్జెక్టులో షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతిలోని పాఠ్యాంశాలను రివిజన్ చేసి, అదే సబ్జెక్టుకు సంబంధించి పరీక్ష నిర్వహిస్తున్నారు. దీంతో వారి ప్రగతిని గుర్తించి షైనింగ్ స్టార్లు, రైజింగ్ స్టార్లుగా విభజిస్తున్నారు. ఏ, బీ గ్రేడు సాధించిన వారిని షైనింగ్ స్టార్లుగా గుర్తిస్తున్నారు. సీ, డీ గ్రేడ్లు వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి సంవత్సరాంతం పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. "ప్రభుత్వం తీసుకువచ్చిన వంద రోజుల యాక్షన్ ప్లాన్ మంచి ఫలితాలను ఇస్తోంది. ప్రతి సబ్జెక్టులో 7 డైలీ స్లిప్ టెస్టులు అయ్యాయి. యాక్షన్ ప్లాన్ వల్ల చదివిందే చదువుతూ, రివిజన్ చేయటం వల్ల అది మన మైండ్?లో గుర్తుండిపోతుంది. దీనివల్ల ప్రీ ఫైనల్?లో కూడా మంచి మార్కులు వచ్చాయి. అలాగే ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతిలోని పాఠ్యాంశాలను రివిజన్ చేసి, అదే సబ్జెక్టుకు సంబంధించి పరీక్ష నిర్వహిస్తున్నారు. దీనివల్ల మేం చేస్తున్న తప్పులను తెలుసుకుని తరువాత పరీక్షలో ఆ తప్పులు చేయకుండా జాగ్రత్త పడుతున్నాం." – విద్యార్థులు ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక అమలులోకి తేవడం పేద విద్యార్థులకు ప్రయోజనకరంగా మారుతోందని, నూరు శాతం ఫలితాలు సాధిస్తే వచ్చే ఏడాది ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు నమోదు పెరిగే అవకాశముంటుందని ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు ఉచితంగా అందించే స్ఫూర్తి స్టడీ మెటీరియల్, ఉపాధ్యాయ సంఘాలు అందించే మెటీరియల్‌ను విద్యార్థులు అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు పొందవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు. "వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా విద్యార్థుల ప్రగతి బట్టి షైనింగ్ స్టార్లు, రైజింగ్ స్టార్లుగా విభజిస్తున్నాం. ఏ, బీ గ్రేడు సాధించిన వారిని 100 శాతం మార్కులు సాధించేలా తీర్చిదిద్దుతున్నాం. అలాగే సీ, డీ గ్రేడ్లు వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. విద్యార్థులు ఈ సమయంలో రోజూ కనీసం 7 గంటలు నిద్రపోవాలి. అలాగే బయటి జంక్ ఫుడ్?లను తినరాదు. పదునుగా ఉన్న వస్తువులను వాడరాదు. తల్లిదండ్రులు వారి పిల్లలకు ఎటువంటి పనులు అప్పగించరాదు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

## సచివాలయం, హెచ్ఓడీ టవర్లలో శాఖలకు స్థలం

-మొదటిపేజీ తరువాయి

సీఎస్ ఆదేశాలు: మంత్రులు, విభాగాధిపతులు, కార్యదర్శులు, మిడిల్ లెవెల్ అధికారులు ఇలా వివిధ కేటగిరీల వారీగా కేటాయించే ప్రామాణిక స్థల విస్తీర్ణాన్ని ఆ సర్క్యులర్‌లో పొందుపరిచారు. ఆయా శాఖలు, విభాగాల్లో కేటగిరీల వారీగా వర్కింగ్ స్ట్రెంగ్త్ , శాంక్షన్డ్ స్ట్రెంగ్త్ వివరాలకు అనుగణంగా దేనికోసం ఎంత స్థలం కేటాయించాలనే దానిపై మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులు చేస్తుంది. శాంక్షన్డ్, వర్కింగ్ స్ట్రెంగ్త్ వివరాల్ని పట్టిక రూపంలో సాధారణ పరిపాలనశాఖకు ఈ మెయిల్ ద్వారా పంపించాలని సంబంధిత అధికారులను సీఎస్ ఆదేశించారు.

## 11 బిలియన్ డాలర్ల విలువైన ఏఐ డేటా సెంటర్

**విశాఖపట్టణం :** విశాఖపట్నంలో 11 బిలియన్ డాలర్ల విలువైన ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు అవుతుందనే వార్త రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అంత పెద్ద స్థాయిలో పెట్టుబడి వస్తే నిజంగా మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయా అనే ప్రశ్న తల్లిదండ్రులలో, యువతలో సహజంగానే వస్తోంది. ముఖ్యంగా ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ వంటి రంగాల్లో అవకాశాలు పెరుగుతాయని ప్రచారం జరుగుతోంది. డేటా సెంటర్ అంటే పెద్ద మొత్తంలో సమాచారాన్ని నిల్వ చేయడం, ప్రాసెస్ చేయడం, నిర్వహించడం కోసం ఏర్పాటు చేసే సాంకేతిక వసతి. ఏఐ ఆధారిత కేంద్రం అంటే మెషిన్ లెర్నింగ్ , క్లౌడ్ కంప్యూటింగ్, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక సేవలను అందించే స్థలం. ఇలాంటి ప్రాజెక్టు వస్తే నిర్మాణ దశలోనే వేలాది మందికి తాత్కాలిక ఉపాధి లభిస్తుంది. సివిల్ పనులు, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ, లాజిస్టిక్స్ రంగాల్లో స్థానికులకు పని దొరకవచ్చు. అయితే శాశ్వత ఉద్యోగాల విషయంలో వాస్తవ పరిస్థితి కొంచెం భిన్నంగా ఉంటుంది. డేటా సెంటర్లలో పనిచేసే సిబ్బంది ఎక్కువగా టెక్నికల్ నైపుణ్యాలు కలిగినవారే. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్లు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, డేటా సైంటిస్టులు వంటి ప్రత్యేక శిక్షణ పొందినవారికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. కాబట్టి మన పిల్లలకు ఉద్యోగాలు రావాలంటే సంబంధిత విద్య, నైపుణ్యాలు ఉండాలి. కేవలం ప్రాజెక్టు రావడం మాత్రమే సరిపోదు. ఇంకా ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఇలాంటి భారీ పెట్టుబడులు నగర అభివృద్ధికి దోహదం చేస్తాయి. రోడ్లు, విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ కనెక్టివిటీ వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయి. దీని వల్ల ఇతర ఐటీ కంపెనీలు కూడా విశాఖపట్నం వైపు ఆకర్షితమయ్యే అవకాశం ఉంది. ఐటీ ఎకోసిస్టమ్ ఏర్పడితే పరోక్షంగా మరిన్ని ఉద్యోగాలు సృష్టించబడతాయి. హోటళ్లు, రవాణా, రెంటల్ హౌసింగ్ వంటి రంగాలు కూడా లాభపడతాయి. అయితే ఈ ప్రాజెక్టు నిజంగా ఎప్పుడు ప్రారంభమవుతుంది, ఎంతకాలంలో పూర్తి అవుతుంది, ఎంతమందికి ప్రత్యక్ష ఉద్యోగాలు ఇస్తుంది వంటి అంశాలు అధికారిక ప్రకటనలపై ఆధారపడి ఉంటాయి. కొన్ని సందర్భాల్లో పెద్ద మొత్తాల పెట్టుబడులు ప్రకటించినా, అవి దశలవారీగా అమలు అవుతాయి.



సంపాదకీయం

# మమతా బెనర్జీ కళ్లు తెరవాలి!

> బెంగాల్లో సర్ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో అక్కడ జ్యుడిషియల్ అధికారుల అజమాయిషీలో జరగాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతోపాటే సర్ ప్రక్రియను అడ్డుకోరాదని మమతా బనర్జీకి సుప్రీం గట్టిగానే సూచించింది. నిజానికి సర్ ప్రక్రియ ద్వారా ఓట్లను సంస్కరించడం అవసరమే. తమిళనాట లక్షల్లో ఓట్లు తొలగించారు. గుజరాత్‌లోనూ తొలగించారు. ఇప్పుడు దక్షిణాదిలో కూడా సర్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ క్రమంలో ఓట్లు తొలగింపు వల్ల ఎవరైనా తమ ఓటు నిజంగానే కోల్పోతే వారి పక్షాన ప్రభుత్వం పోరాడాలి. అంతే తప్ప అడ్డుకోవడం సరికాదు. ఇదేదో రాజ్యాంగ విఘాతం కలిగించారన్న రీతిలో ప్రచారం చేయడం విపక్షాలకు తగదు.

ఎన్నికల కమిషన్ ఏం చేసినా, ఎలా చేసినా విమర్శించే విపక్ష స్థానంలో ఉన్న కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డిఎంకెపార్టీలు తీవ్రంగా అడ్డుపడు తున్నాయి. బ్యాలెట్ బాక్స్ లతో ఓటింగ్ విధానం ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతికి మారాక కొన్ని ఎన్ని కల వరకూ బాగా నడిచిందని ప్రశంసలు ఇచ్చిన పార్టీలు ఇప్పుడు ఆ విధానం వల్ల తమకు నష్టం వాటిల్లుతోందని ఘోషిస్తున్నాయి. పార్టీ ఏదైనా తమకు ఓటింగ్ అనుకూలంగా రాకపోయి ఓటమిపాలైతే ఎలక్ట్రానిక్ ఓటింగ్ పక్రి యలో లోటుపాట్లు ఉన్నందునే తాము ఓడిపోయామని విమర్శలు గుప్పిస్తున్నారు. విపక్ష పార్టీలు తమ స్థానాలు మారినా విమర్శలకు వెనుకాడడం లేదు. 'సర్' పేరెత్తితేనే విపక్షాల్లో అదీ అతి ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ అపచారం జరిగిందని అంటున్నారు. ఇలా కాకుండా ఎక్కడైనా ఓట్ల తొలగింపుతో ఎవరైనా నష్టపోతే దానిని ఆధారంగా చేసుకుని పోరాడాలి. కానీ మొత్తం ప్రక్రియనే వ్యతిరేకించడం ద్వారా రాజ్యాంగాన్ని తృణీకరిస్తున్నాయని గుర్తించాలి. సుప్రీం ఇచ్చిన ఆదేశాలు లేదా సూచనలు ఆయా రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. ఇంకా సర్ ప్రక్రియను అప్రతిష్టపాలు చేయాలనే ఆలోచన నుంచి రాజకీయ పార్టీలు బయటపడాలి. ఎన్నికల కమిషన్ పై సవాల్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీపై తమ నిరసన ధ్వనులను పెంచుతున్నాయి. ఒకపక్క ఎన్నికల కమిషన్ త్వరలో ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళ నాడు, కేరళ వంటి రాష్ట్రాలలో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టగా కాంగ్రెస్ అధ్యక్షు డు రాహుల్గాంధీ, 'ఓట్ చోరీ' ప్రచార కార్యక్రమాన్ని బహుళ ప్రచారం చేస్తున్నారు. బీహార్ ఎన్నికల్లో చతికిలపడినా ఓటరు జాబితా విషయంలో రాజీ పడేది లేదనే ధోరణిలో ముందుకు కదులుతున్నారు. బీహార్లో 'సర్' కార్యక్రమం చేపట్టినప్పుడు ఎన్నికల కమిషన్ను కాంగ్రెస్ పార్టీ విపరీ తంగా ఆరోపణలు గుప్పించింది. ఎన్నికల కమిషన్ తన ధోరణిలో తనప్రణాళిక ప్రకారం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టింది. ఎన్నికలు సజావుగానే నడిపించింది. బీహార్లో అప్పటికే అధికారంలో ఉన్న పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. అంటే విపక్షాల అభ్యంతరాలు ఎవరినీ కదిలించలేదన్నది సుస్పష్టం. అయినా కాంగ్రెస్ తదితర పక్షాలు తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లన్న ధోరణిలో తమ పిడివాదంతో విమర్శలు గుప్పిస్తున్నాయి. ఓటు దొంగల కబంధ హస్తాల నుంచి భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించే నినాదంతో కాంగ్రెస్ సంతకాల సేకరణ చేస్తోంది. బీహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన ఆలోచనలో మార్పు తెచ్చుకోగలదని అందరూ భావించారు. కానీ అలా జరుగలేదు. కనీసం ఆది నుంచీ ఒకే మాటమీద వ్యవహా రాన్ని నడిపిస్తున్నారు. బోగస్ ఓట్లను చేర్చడం, విపక్ష అనుకూల ఓటర్లను తొలగించడం, ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడడం వంటివి ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీలు కలిసికట్టుగా వ్యవహరిస్తున్నాయన్నది కాంగ్రెస్ ఆరోపణలు. బిజెపి ఓటర్లకు ఆయా నియోజక వర్గాల్లో నగదు పంచుతున్నా చర్యలు తీసుకోకుండా, ఇసి సహకరిస్తోందని విపక్షాలు గట్టిగా నమ్ముతున్నాయి. తాజాగా పశ్చిమ బెంగాల్లో ఓటర్ల జాబితా సవరణ మొదలైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఎన్నికల కమిషన్పై రుసరుసలాడుతున్నారు. దేశవ్యాప్తంగా ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఒక ఉద్దేశపూర్వక కుట్రగా అభివర్ణించారు. బీహార్ లో 'సర్' అమలులో విజయవంతమైన కార్యక్రమంగా రూపొందించి దేశవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాన్ని చేప ట్టేందుకు ఇసి నిర్ణయం తీసుకుందంటే అది ఎంతోమంచి కార్యక్రమమేననుకోవాలి. అయినా బిజెపియేతర ఇండియా కూటమిలు ప్రధానపక్షమైన కాంగ్రెస్ఎన్నికల కమిషన్ వివవరణలను ఆకళింపు చేసుకోలేకపోయింది. దానికితోడు దేశవ్యాప్త 'సర్' విచారణ కోసం నియమితులైన 16మంది బిఎల్ఎలు ఒత్తిడి వల్లనే మరణించారన్న వార్తలను ఆసరాగా చేసుకుని ఇసి ఒత్తిడిలపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. పశ్చిమ బంగలోని ధులగోరి, బిరాటి, న్యూటేన్ ఘసురి వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉండే బంగ్లా దేశీయులు ఓటర్ల జాబితా ఏరివేతలో తగు పత్రాలు చూపలేక అక్రమంగా వలస వచ్చినట్లు తేలినవారంతా ఇప్పుడు బంగ్లాదేశ్ దారిపట్టారు. ఇప్పుడీ కార్యక్రమం వలన పశ్చిమ బెంగాల్లో సంక్లిష్ట పరిస్థితులేర్పడ్డా యి. బంగ్లాదేశ్ నుంచి వచ్చి బెంగాల్లో ఉండేవారి పత్రా లను చూసే పనిని బిఎస్ఎఫ్ జవాన్లకు అప్పగించారు. వెనక్కివెళ్లే సమయంలోనూ వీరే వారిపత్రాలను పరిశీ లించి పోలీసులకు పంపాల్సి ఉంటుంది. ఈ పక్రియ ఎంతో కష్టమైనది. సుదీర్ఘమైనది. బంగ్లాదేశీయుల రివర్స్ మైగ్రే షన్తో బెంగాల్ పోలీసులు సతమత మవుతున్నారు. సరైన పత్రాలు లేనివారిని నిర్బంధించి జైల్లోపెట్టే పరిస్థితి ఉంది. నిజానికి బంగ్లాదేశీయులు పశ్చిమ బెంగాల్లో ప్రవేశించిన ప్పుడు దళారీల ద్వారా ఆధార్ కార్డులు రేషన్ కార్డులు, ఓటరు ఐడీలతో ప్రవేశించారు. ఇప్పుడు అలాంటి ఎన్నీ బయటపడి పత్రాలన్నీ నకిలీవని తేలుతున్నందున మమతా బెనర్జీ సిగ్గుపడాలి.



కంచర్ల అచ్యుత రావు
ఎడిటర్, మనసులో మాట,
తెలుగు దినపత్రిక

# భారత్-ఇజ్రాయెల్ సరికొత్త మైత్రి

- త్వరలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం..
- యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఎంవోయూ
- ఏఐ, వ్యవసాయ రంగాల్లో 27 కీలక ఒప్పందాలు
- ఇజ్రాయిల్ పర్యటనలో ప్రధాని ప్రకటన
- భారత్‌కు రుణపడి ఉన్నానన్న నెతన్యాహు





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** ఇజ్రాయెల్-భారత్ మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. అలాగే ఇజ్రాయెల్‌లో కూడా త్వరలో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. యూపీఐ పేమెంట్స్‌తో పాటు ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరా యి. రెండు దేశాల మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనున్నట్టు ఇరు దేశాల ప్రధానులు సంయు క్త ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 27 రంగాల్లో పరస్ప ర సహకారానికి ఇరు దేశాలు అంగీకరించాయి. మరోవై పు గాజాపై ప్రధాని మోదీ మరోసారి భారత్ వైఖరిని స్పష్టం చేశారు. మానవత్వం ఎప్పుడూ సంఘర్షణకు బలికాకూడదన్నారు. ప్రస్తుతం శాంతి ప్రణాళిక ద్వారా ఓ ముందడుగు పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని మోదీ హామీ ఇచ్చారు. ఃూగా, త్వరలోనే భారత పర్యటనకు రావాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహును ఆహ్వానించారు. అంతకు ముందు ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని నెతన్యాహు ప్రశంసించారు. ఆయన ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించిందని అన్నారు. భారత్ కు రుణపడి ఉన్నామన్నారు. మోదీ తమకు స్నేహితుడు కంటే ఎక్కువని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ పర్యటన రెండు దేశాల మధ్య సరికొత్త మైత్రికి నాంది పలికింది. విమానాశ్రయం నుంచి ఇజ్రాయెల్ పార్లమెంట్ వరకు మోడీకి లభించిన ఘన స్వాగతం ఈ పర్యటన ప్రాధాన్యతను చాటిచెప్పింది. పర్యటనలో భాగంగా నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన వ్యక్తి గత విషయాన్ని ఒకటి పంచుకొని అందరినీ ఆశ్చర్యపరి చారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు మాట్లాడుతూ.. తన భార్యతో తన మొదటి డేట్ ఒక భారతీయ రెస్టారెంట్‌లో జరిగిందని, ఆ భోజనం అద్భుతంగా ఉండటం వల్లే వారి బంధం బలపడిందని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి తాను, తన పిల్లలు కూడా భారత్‌కు రుణపడి ఉంటామని ఆయన అనగానే ప్రధాని మోడీ నవ్వు ఆపుకోలేక పోయారు. భారతదేశంలోని అపారమైన ప్రతిభను, ఇజ్రాయెల్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని కలపడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని ఇద్దరు నేతలు ఆకాంక్షించారు. ప్రధానంగా కచ్చితమైన వ్యవసాయం, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఆవిష్కరణలు, సాంకేతికత, అభివృద్ధికి సంబంధించి రెండు దేశాల మధ్య 16 కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి. రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే భారత్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేతలు నిర్ణయించారు. 'మా వ్యక్తిగత స్నేహం, ప్రభుత్వాల మధ్య సహకారం, ప్రజల మధ్య అనుబంధం నానాటికీ బలపడుతోంది' అని నెతన్యాహు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దీనిని కొనసాగించేందుకు సాధ్యమైనంత త్వరగా భారతదేశంలో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటన కేవలం దౌత్యపరమైన ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఇద్దరు దేశాధినేతల మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత స్నేహాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.




# బ్యాంకింగ్ యాప్స్‌లో 'డార్క్ ప్యాటర్న్స్'కు చెక్

## ఆర్‌బీఐ సంచలన నిర్ణయం!

**ముంబై, ఫిబ్రవరి 26:** భారతదేశంలో డిజిటల్ బ్యాంకింగ్ వాడుతున్న కోట్లాది మంది వినియోగదారులకు ఊరటనిచ్చేలా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. బ్యాంకింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లలో వినియోగదారులను గందరగోళానికి గురిచేస్తూ, వారి ప్రమేయం లేకుండా అదనపు సేవలను రుద్దే 'డార్క్ ప్యాటర్న్స్' పద్ధతులపై ఆర్‌బీఐ ఉక్కుపాదం మోపింది. ఈ మేరకు 'రెస్పాన్సిబుల్ బిజినెస్ కండక్ట్ అమెండ్‌మెంట్ డైరెక్షన్ 2026' పేరుతో ముసాయిదా నిబంధనలను ప్రకటించిన ఆర్‌బీఐ, దేశంలోని అన్ని వాణిజ్య బ్యాంకులు తమ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఉన్న ఇటువంటి మోసపూరిత డిజైన్లను 2026 జూలై నాటికి పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. సాధారణంగా ఏదైనా ట్రాన్సాక్షన్ చేస్తున్నప్పుడు చివరి నిమిషంలో తెలియకుండానే అదనపు ఛార్జీలు పడటం, ఇన్సూరెన్స్ వంటి సేవలను కొనుగోలు చేయమని పదేపదే నోటిఫికేషన్లు రావడం వంటివి డార్క్ ప్యాటర్న్స్ కిందకు వస్తాయి. ఇవి వినియోగదారుల నిర్ణయాధికారాన్ని దెబ్బతీస్తూ వారిని తప్పుదారి పట్టించేలా ఉన్నాయని ఆర్‌బీఐ గుర్తించింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం ఏదైనా ఆర్థిక ఉత్పత్తిని విక్రయించేటప్పుడు కస్టమర్ నుంచి స్పష్టమైన అనుమతి తీసుకోవాలని, కస్టమర్లు అడగని థర్డ్ పార్టీ ఉత్పత్తులను బలవంతంగా అంటగట్టకూడదని స్పష్టం చేసింది. బ్యాంకులు ఇచ్చే ప్రకటనలు వాస్తవాలకు దగ్గరగా ఉండాలని, వడ్డీ రేట్లు, ఇతర ఛార్జీల గురించి పూర్తి సమాచారాన్ని ముందే బహిర్గతం చేయాలని ఆదేశించింది. ఆర్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల డిజిటల్ బ్యాంకింగ్ మరింత సురక్షితం కానుందని, వినియోగదారులకు తెలియకుండా జరిగే అనవసర ఖర్చులు తగ్గుతాయని నిపుణులు భావిస్తున్నారు.

# ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

## వసలదారుల పట్ల అనుసరిస్తున్న విధానంపై కోర్టు ఆగ్రహం



**న్యూయార్క్, ఫిబ్రవరి 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ దేశ న్యాయస్థానాల్లో వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రపంచ దేశాలపై సుంకాల విషయాల ఇప్పటికే కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు రాగా.. తాజాగా వలసదారుల విషయంలోనూ అదే అనుభవం ఎదురైంది. అక్రమ వలసదారులను వారికి సంబంధం లేని ఇతర దేశాలకు తరలించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టు తప్పుబట్టింది. అక్రమ వలసదారుల విషయంలో ట్రంప్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మసాచుసెట్స్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి తీర్పునిచ్చారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులను టా÷-గ్గ్ం÷ట్ చేసిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులను అమెరికా నుంచి గ్వాటమాల, దక్షిణ సూడాన్, కోస్టారికా వంటి ఇతర దేశాలకు తరలించారు. దీంతో ఈ తరలింపు ముప్పును ఎదుర్కొంటున్న వలసదారులు కోర్టులో దావా వేశారు. దావాపై తాజాగా న్యాయస్థానంలో విచారణ జరిగింది. సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, తగిన సమయం ఇవ్వకుండా వారికి సంబంధం లేని వేరే దేశాలకు తరలించడం చట్ట విరుద్ధమని కోర్టు తీర్పునిచ్చింది (÷బి।ట।సజీ ఇనీబీసబి తిపపతిణసజీబితినీని ఇజీబ।). ట్రంప్ కార్యవర్గం నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ట్రంప్ యంత్రాంగానికి 15 రోజుల సమయం ఇచ్చింది.

# ఎన్‌సీఈఆర్‌టీ వివాదంపై మోదీ అసంతృప్తి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** జాతీయ విద్యాపరిశోధన-శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'ని పాఠ్యాంశంగా చేర్చటం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ అసంతృప్తి వ్యక్తం చేశారట. ప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. 'వీటన్నింటినీ ఎవరు పర్యవేక్షిస్తున్నారు?.. బాధ్యులను గుర్తించారా? ' అని మోదీ ప్రశ్నించారట. ఇక, ఈ విషయంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విచారం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'మేము న్యాయ వ్యవస్థకు అత్యున్నత స్థానం ఇచ్చాం. న్యాయ వ్యవస్థను కించపరచాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి ఇసుమంత కూడా లేదు. మేము ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నాము. న్యాయ వ్యవస్థ తీసుకున్న నిర్ణయంతో ఏకీభవిస్తున్నాము. జరిగిన దానికి నేను ఎంతో చింతిస్తున్నా' అని అన్నారు.

# భారతీయ రైల్వేల్లో డిజిటల్ విప్లవం

- 'రైల్ టెక్' పోర్టల్, 'ఈ-ఆర్సీటీ' వ్యవస్థ ప్రారంభం
- 52 వారాల్లో 52 సంస్కరణలు
- స్టార్టప్‌లు, ఆవిష్కర్తలకు పెద్దపీట


**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** భారతీయ రైల్వే రంగాన్ని సాంకేతికంగా మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ "52 వారాల్లో 52 సంస్కరణలు" అనే వినూత్న కార్యక్రమంలో భాగంగా పలు కీలక డిజిటల్ వేదికలను ప్రారంభించారు. ఇందులో భాగంగా రైల్వే రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 'రైల్ టెక్' పాలసీని ప్రకటించడంతో పాటు, దానికి సంబంధించిన ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే రైల్వే క్లెయిమ్స్ ట్రైబ్యునల్ కార్యకలాపాలను సులభతరం చేసేందుకు 'ఈ-ఆర్సీటీ' డిజిటల్ వ్యవస్థను కూడా ఆయన ప్రారంభించారు.

### ఆవిష్కర్తలకు నేరుగా అవకాశం

కొత్తగా ప్రారంభించిన రైల్ టెక్ పోర్టల్ ద్వారా స్టార్టప్ కంపెనీలు, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, వ్యక్తిగత ఆవిష్కర్తలు తమ అత్యాధునిక సాంకేతిక ఆలోచనలను నేరుగా రైల్వే శాఖకు తెలియజేయవచ్చు. దీనివల్ల భారతీయ రైల్వేలో ఆధునిక సాంకేతికతను వ్యవస్థబద్ధంగా ప్రవేశపెట్టేందుకు వీలు కలుగుతుంది. దేశీయ పరిజ్ఞానంతో రైల్వే రంగాన్ని ఆధునీకరించాలనే లక్ష్యంతో ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు మంత్రి తెలిపారు.

### క్లెయిమ్స్ పరిష్కారంలో వేగం

రైల్వే క్లెయిమ్స్ ట్రైబ్యునల్‌లో తీసుకువచ్చిన 'ఈ-ఆర్సీటీ' వ్యవస్థ ద్వారా బాధితులకు సత్వర న్యాయం అందనుంది. ప్రమాదాలు లేదా ఇతర ఘటనలకు సంబంధించి క్లెయిమ్‌లను ఇకపై 24 గంటల పాటు ఆన్‌లైన్‌లోనే (ఈ ఫైలింగ్) దాఖలు చేసుకోవచ్చు. రియల్ టైమ్ కేసు ట్రాకింగ్, పేపర్‌లెస్ కోర్టులు, హైబ్రిడ్ విచారణలు మరియు ఆన్‌లైన్ తీర్పులు వంటి సదుపాయాలు ఈ వ్యవస్థ ద్వారా అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల బాధితులు ట్రైబ్యునల్‌ను ప్రత్యక్షంగా సందర్శించాల్సిన అవసరం లేకుండానే తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు. రాబోయే 12 నెలల్లో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే క్లెయిమ్స్ ట్రైబ్యునల్ బెంచ్‌లను పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ సందర్భంగా ప్రకటించారు.



మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
శుక్రవారం 27 జనవరి 2026


### అనంతగిరి మండలం లోని పలు గ్రామాలు

# సుడిగాలి పర్యటన

### - జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్





**అరకులోయ,ఫిబ్రవరి26 (మనసులో మాట):** అనంతగిరిమండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సుడిగాలి పర్యటన చేశారు. గురువారం ఉదయం గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగముచే చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను,పనుల ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతగిరి మండలం, పెద్దబిడ్డ పంచాయతీ డముకు, నిమ్మల పాడు నుండి పెద్దబిడ్డ వరకు తారు రోడ్డు నిర్మాణం పనులు,రోడ్డు పొడవు 2.10 కిలోమీటర్ ప్రస్తుతం వెట్ మిక్ లేయర్ వరకు పూర్తి కావలసిన పనులు రోలింగ్ చేయుటకు సిద్ధంగా ఉన్న పనులను పరిశీలించారు. వీటిని త్వరితగతిన పూర్తి చేసి తారు రోడ్డు వేయాలని ఆదేశించారు. అదే మండలానికి చెందిన గుమ్మ పంచాయతీ గుమ్మ నుండి చీడివలస వరకు నిమ్మవూట, మిర్తుతుంగడ, మద్దిపాడు, బూరుగుల పాడు, కరకవలస, బూసిపాడు, పొర్లువలస మీదుగా నిర్మితమవుతున్న తారు రోడ్డు నిర్మాణం పనులను, రోడ్డు పొడవు 11 కిలోమీటర్లు కాగ ప్రస్తుతం కిలోమీటర్లు వెట్ మిక్స్ లేయర్ 6 కిలోమీటర్ల జి.ఎస్.డి లేయర్ వరకు పూర్తి చేయవలసిన పనులను రోలింగ్ జరుగుతున్నపనులుపరిశీలించారు. వాటిని వీలైనంత త్వరితగతిన తారు రోడ్డు వేయాలని ఆదేశించారు. వివిధ దశల్లో ఉన్న రోడ్ల పనుల లేయర్ల తీక్నెస్ ను రోడ్డు వెడల్పు పనులను పరిశీలించారు.ఈ రోడ్డు వేయుట వలన జరుగుతున్న లబ్ధిని గూర్చి గ్రామస్థులతో చర్చించారు, ఈ రోడ్డు వేయుట వలన చుట్టుపక్కల గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు, నూతన సెల్ టవర్ నిర్మాణ పనులను ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పెద్ద వర్షాలు వచ్చినప్పుడు రోడ్డు కల్వర్టు అప్రోచ్ ల వద్ద రోడ్డు కొట్టుకు పోకుండా, సిసిర్యాంప్ వేయుట మరియు స్టోన్ ప్యాకింగ్ వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అనంతరం అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ఓపి రిజిస్టర్, సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి వివరాలని అడిగి తెలుసుకున్నారు.అనంతగిరి మండలం, చెరుకు బిడ్డ గ్రామం లో ఎంపీపీ స్కూల్ ను పరిశీలించి పిల్లలతో ముచ్చటించి పిల్లల విద్య బోధనపై ఆరా తీశారు.ఈ పర్యటనలో గిరిజన సంక్షేమ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. వేణు గోపాల్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.అభిషేక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.గణేష్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.





### సబ్ జైలును సందర్శించిన

## న్యాయమూర్తి షియాజ్ ఖాన్

**నర్సీపట్నం రూరల్, ఫిబ్రవరి 26 , ( మనసులో మాట) :** నర్సీపట్నం సివిల్ జడ్జి ( సీనియర్ డివిజన్) పి షియాజ్ ఖాన్ గురువారం నర్సీపట్నం సబ్ జైలును సందర్శించారు. సబ్ జైలులోని ఖైదీలతో ఆయన మాట్లాడి వారి సాధక బాధకాలు అడిగి తెలుసుకున్నారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు రెగ్యులర్ గా వస్తున్నారా? మంచి భోజనం అందిస్తున్నారా? ఇక్కడ వసతులు ఏ విధంగా ఉంటున్నాయి అనే విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. కేసు వాదించడానికి లాయర్ ను పెట్టుకునే స్తోమత లేని వారు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కి తెలియజేస్తే ఉచితంగా లాయర్ ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఖైదీలకు అందించే ఆహారాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### పంచాయతీ నిధులతో తాచేరు నది కి

## మెట్లు శంకుస్థాపన

**విమాడుగుల. ఫిబ్రవరి 26 (మనసులో మాట)..** మాడుగుల సమీపంలో సాగరంవెళ్లె మార్గంలోతాచెరు నది ప్రాంతంలో పంచాయతీ నిధులతో గతంలో రైతుల కోరిక మేరకు మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఇచ్చిన హామీ మేరకు గురువారం ఉదయం మాడుగుల సర్పంచ్ యడ్ల కళావతి. మండల పరిషత్ ఉపాధ్యక్షులు పొలిమేర విజయలక్ష్మి. ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు. అనకాపల్లి జిల్లా ఐవీఎఫ్ఆర్యవైశ్య సంఘ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీనాథు శ్రీనివాసరావు. వైసిపి పట్టణ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు. ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి. ఈ మధ్యకాలంలో తాచేరునది పక్కనే శివపార్వతుల విగ్రహాలను ఏర్పాటు చేయడంతో కార్తీకమాసంలో భక్తులు మెట్లు ద్వారా నదిలోకి దిగి స్నానాలు చేసేందుకు ఈ మెట్లు ఉపయోగపడతాయని వారు తెలిపారు. భక్తులకు మెట్లు ఏర్పాటు చేసే విధంగా ఏర్పాటు చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కు పంచాయతీ సర్పంచ్ పాలకవర్గానికి రైతులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్ శీలమంతుల జ్యోతి కో ఆప్షన్ నంబరు షేక్ మున్నీసా . రైతులు పాల్గొన్నారు

### ఎలమంచిలి నియోజకవర్గంలో ఐటి మంత్రి నారా లోకేష్

## పర్యటనను విజయవంతం చేయాలి



**మునగపాక, ఫిబ్రవరి 26, మనసులో మాట..** ఎలమంచిలి నియోజకవర్గ ఈ నెల 28 న ఉదయం 10 గంటలకురాంబిల్లి మండలంలో సీత పాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బ్లూ జట్ కొత్త కంపెనీ ఏర్పాటుకు చేయడానికి శంకుస్థాపనకు విచ్చేస్తున్న రాష్ట్ర విద్యా శాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనలను మునగపాక మండలంలో ఉన్న రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు కార్యకర్తలు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మునగపాక మండల టిడిపి అధ్యక్షుడు పెంటకోట విజయ్ కోరారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలోని పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలివస్తున్నాయని దీంతో నిరుద్యోగులకు కొత్త ఆశలు చిగురుతున్నాయని విజయ్ అన్నారు. యువ నాయకుడు నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం శర వేగంగా అభివృద్ధి చెందడం ఖాయమని విజయ్ దిమా వ్యక్తం చేశారు.

### అనకాపల్లి లో ఘనంగా ప్రారంభమైన జనసేన పార్టీ

# క్రియాశీలక సభ్యత్వ నమోదు

**- తొలిరోజే సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన**

**- అనకాపల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీ క్రియాశీలక తొలి సభ్యత్వం పొందిన శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ**





**అనకాపల్లి, ఫిబ్రవరి 26 (మనసు లో మాట):** అనకాపల్లి రింగ్ రోడ్డు లోని జనసేన పార్టీ కార్యాలయం లో గురువారం ఆ పార్టీ క్రియశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనంగా ప్రారంభ మయ్యింది. ముందు గా ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ను మాజీ మంత్రి, అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. తొలిరోజే జనసేన క్రియశీలక సభ్యత్వ నమోదు కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకొని, పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు ఎవరైతే ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వం తీసుకుంటారో "పార్టీలో నాయకుడిగా ఎదగాల నుకుంటున్నారో అటువంటి వారు క్షేత్రస్థాయిలో పని చేసే కార్యకర్త కష్టాన్ని గుర్తించినప్పుడే పార్టీలో సంపూర్ణ నాయకులుగా ఎదుగుతారని అన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సాధకులు గ్రామస్థాయి, మండల స్థాయి, వార్డు స్థాయిలలో , అందరూ ప్రధానపాత్ర వహించి ఉత్సాహంగా పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇదిలావుంటే 2024 సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో సుమారు 22,954 మంది నమోదు చేసుకున్నారన్నారు. ఈ దఫా నమోదు కార్యక్రమం లో దాన్ని మించిపోయే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, రాష్ట్రంలో అందరికన్నా ఎక్కువ సంఖ్యలో అనకాపల్లి నియోజకవర్గంలో క్రియాశీలక సభ్యత్వాలు చేసి జనసేన అధ్యక్షులకు వారికి బహుమతిగా అందించాలని సాధకులకు పిలుపు నిచ్చారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమంలో మొట్టమొదటగా కొణతాల రామకృష్ణ జనసేన పార్టీ తొలి క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం రామకృష్ణ చేతుల మీదగా తగరంపూడి మహిళలు, జనసేన నాయకులు,మాజీ సైనికులు,సభ్యులకు క్రియాశీలక సభ్యత్వం అందించారు . జనసేన పార్టీ నాయకులు, అధికసంఖ్యలో జనసేన కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

# వైద్యరంగంలో పరిశోధనలు పెరగాలి

### - డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్



**విజయనగరం (మనసులోమాట), ఫిబ్రవరి 26:** వైద్యరంగంలో పరిశోధనలను పెంచాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలోని యూజీ, పీజీ విద్యార్థులు మరియు అధ్యాపకులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వైద్య విద్యలో పరిశోధన ప్రచురణలు, విద్యా ప్రమాణాల మెరుగుదల మరియు కళాశాల అభివృద్ధిపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, వైద్య రంగంలో పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పరిశోధనా కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు గానూ రూ. 50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా విద్యార్థుల మానసిక మరియు శారీరక దృఢత్వం కోసం, క్రీడా కార్యకలాపాలకు ప్రతీ ప్రభుత్వ వైద్య కళాశాలకు అదనంగా రూ. 10,00,000/- (పది లక్షల రూపాయలు) కేటాయించినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు తప్పనిసరిగా ఈ-జర్నల్స్ సభ్యత్వాన్ని తీసుకోవా లని, తద్వారా అత్యాధునిక వైద్య పరిజ్ఞానం అందరికీ అందుబా టులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి కళాశాల తమ పరిశోధనలు మరియు విద్యాప రమైన పురోగతిపై ప్రతి మూడు నెలలకు ఒకసారి త్రైమాసిక నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మరియు అడిషనల్ డీఎంఈ డాక్టర్ బి. దేవి మాధవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ. పద్మజ, డాక్టర్ ఎన్టీఆర్ యూహెచ్ఎస్ ఈ.సి. సభ్యులు డాక్టర్ జె.సి. నాయుడు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. శివ శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె. లోకనాథ రావు, డాక్టర్ బి. సుదర్శి, డాక్టర్ కె.ఎస్.ఎస్. సరోజిని దేవి మరియు ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అధ్వర్యాన

# అనకాపల్లి లో అంగన్వాడీ లు నిరసన దీక్షలు



**అనకాపల్లి, ఫిబ్రవరి 26 (మనసు లో మాట):** అంగన్వాడీ లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్న తదితర డిమాండ్లపై అనకాపల్లి సబ్ జైలు సమీపంలో గురువారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి భారీ స్థాయిలో అంగన్వాడీల హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు మాట్లాడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలపై తీవ్ర పనిభారాన్ని మోపుతుందే తప్ప వారి వేతనాలు పెంపుదల కోసం కనీసం ఆలోచించడం లేదని, గత సమ్మె కాలంలో ఇచ్చిన మినిట్స్ అమలు చేయడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్ కు నిధులు తగ్గించి కోత పెట్టడంతో భవిష్యత్తులో ప్రజలకు సేవలు దూరం అవుతాయని అన్నారు. అలాగే ప్రీస్కూల్ బలోపేతానికి ఐదో సంవత్సరం వరకు ప్రతి పిల్లవాడు అంగన్వాడీలో ఉండాలనే నిబంధనను అమలు చేయాలని అన్నారు. అంగన్వాడీ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని కోరారు. గ్రాడ్యుటీ అమలకు వెంటనే గైడ్లైన్స్ ఇవ్వాలని, మెడికల్ లీవ్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలను ధారాధత్నం చేస్తున్నాయని ఆరోపించారు. అదే కష్టపడుతున్న కార్మికులకు వేతనాలు పెంచకపోవడం దుర్మార్గమని దుయతయబట్టారు. అంగన్వాడీలు సుదీర్ఘకాలం పనిచేసిన ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు దుర్గారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.వి శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ నాయకులు బుజ్జీ, ఆదారి రామలక్ష్మి, కుమారి, సత్యవేణి, రమణమ్మ, హెల్పర్స్ నాయకులు మామిడి సంతోషి, మజ్జి శిరీష, డి. విజయ, జె స్వరూపదేవి, సిహెచ్ నాగమణి, కె. జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

### మార్చి 8 న అనకాపల్లి నూకాంబిక అమ్మవారి

## ఆలయ ప్రతిష్టా మహోత్సవం, కలశ స్థాపన వేడుకలు

**అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చే ఆహ్వాన పత్రిక అవిష్కరణ**



**అనకాపల్లి, ఫిబ్రవరి 26 (మనసు లో మాట):** ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ ప్రతిష్టా మహోత్సవం, కలశ స్థాపన వేడుకలు మార్చి 8 న ఘనంగా జరిపేందుకు సన్నహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు అనకాపల్లి రింగ్ రోడ్డు లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో గురువారం అమ్మవారి మహోత్సవ ఆహ్వాన పత్రికలు అవిష్కరించారు. ప్రధానంగా అమ్మవారి పండగ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన సంగతి విదితమే. ఈ సందర్భంగా శాసనసభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ ఆలయ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు అన్నీ కూడా ఎటువంటి లోటుపాటులు లేకుండా పరిపూర్ణంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్లబాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళ శ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్ కుమార్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్ కుమార్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## మోటారు సైకిళ్ళ చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

### 6 మోటారు సైకిళ్ళను రికవరీ - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం(మనసులో మాట):** ఫిబ్రవరి 26:: 1వ పట్టణ, 2వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలో మోటారు సైకిళ్ళను అపహరించిన నేరస్థుడు విజయనగరం పట్టణం, సుంకరి వీధిలో నివాసం ఉంటున్న గుమ్మడి ఆదినారాయణను అరెస్ట్ చేసి అతని వద్ద నుండి 6 మోటారు సైకిళ్ళను రికవరీ చేసినట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ ఫిబ్రవరి 25న ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - విజయనగరం 1వ, 2వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలో మోటారు సైకిళ్ళుచోరీకి గురవుతున్నాయని, వీటికి కారకులైన వారిని అరెస్టు చేసేందుకు నిఘా పెట్టామన్నారు. ఇందులో భాగంగా పట్టణంలో పోలీసు వారిచే ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరాల ఫుటేజి ద్వారా నిందితుడిని గుర్తించి బాబామెట్ట వద్ద నిందితుడు గుమ్మడి ఆదినారాయణను 2వ పట్టణ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుండి 6 మోటారు సైకిళ్ళను రికవరీ చేసామన్నారు. రికవరీ చేసిన మోటారు సైకిళ్ళ విలువ సుమారు రూ. 2.5 లక్షలు ఉంటుందన్నారు. నిందితుడు గుమ్మడి ఆదినారాయణ శ్రీకాకుళం జిల్లా, రణస్థలం మండలం, చిల్లపేట గ్రామానికి చెందినవాడని, గత 6 సం.ల నుండి విజయనగరం పట్టణం సుంకరి వీధిలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడని, ఇతను డ్రైవరుగా పనిచేస్తూ, హేండిల్ లాక్ వేయని మోటారు సైకిళ్ళను నడిపించుకొని తెసుకోనిపోయి వాటిని తాకట్టుపెట్టి డబ్బులు సంపాదిస్తున్నాడని తెలిపారు. అదే విధంగా 1వ పట్టణ పోలీసు స్టేషనుకు చెందిన 3 కేసుల్లో 3 మోటారు సైకిళ్ళు, 2వ పట్టణ పోలీసు స్టేషనుకు చెందిన 3 కేసుల్లో 3 మోటారు సైకిళ్ళు దొంగాలించాడని తెలిపారు. వీటిని కోర్టు ఆదేశాలతో బాధితులకు తిరిగి అందించేందుకు చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ తెలిపారు. నిందితుడి మీద సస్పెక్ట్ షీట్ తెరుస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.ప్రజలు మోటారు సైకిళ్ళను పార్కింగ్ చేసేటప్పుడు ఖచ్చితంగా హేండిల్ లాక్ వేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. అదే విధంగా నేరాల నియంత్రణ మరియు నేర పరిశోధనలో సిసిటివి కెమెరాల పాత్ర కీలకమని, కనుక దేవాలయాలు మరియు ఇతర మత సంబంధమైన ప్రాంతాలు, అపార్ట్మెంట్స్, ముఖ్య కూడళ్ళ వద్ద సిసి కామెరాలను ఏర్పాటు చేయుటకు ప్రజలు ముందుకు రావాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కేసులో క్రియాశీలకంగా పనిచేసిన 2వ పట్టణ పోలీసు స్టేషనుకు సిఐ టి.శ్రీనివాసరావు, ఎసఐ ప్రమీల, పిసిలు వాసు, షఫీ, గణేష్ లను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అభినందించారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## జానికిరామపురం గ్రామంలో ఘనంగా శ్రీ శ్రీ శ్రీ తలుపులమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రారంభం

**గొలుగొండ, ఫిబ్రవరి 26, (మనసులో మాట):** గొలుగొండ మండలం జానికిరామపురం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ తలుపులమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రాంగణం భక్తి పరవశంతో మార్మోగింది. మహిళలు కోలాటం ఆడి భక్తి భావాన్ని వ్యక్తపరిచారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఆలయ అభివృద్ధికి సహకరించాల్సిందిగా సంకల్పం చేశారు.

## జాతీయ రెజ్లింగ్ (కుస్తీ) పోటీల ఛాంపియన్షిప్ టెక్నికల్ రెఫరీ గా జ్యోతిర్మయి

### జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మళ్ళ మాణిక్యాలు, నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబీ అభినందన



**అనకాపల్లి, ఫిబ్రవరి 26 (మనసు లో మాట):** తమిళనాడు సేలం పట్టణంలో ఈనెల 26 నుంచి మార్చి 1 వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ రెజ్లింగ్ (కుస్తీ) పోటీల ఛాంపియన్షిప్ కు అనకాపల్లి జిల్లా నాగులాపల్లి కి చెందిన సీనియర్ రెస్లింగ్ క్రీడాకారిణి టి. జ్యోతిర్మయి టెక్నికల్ రెఫరీ గా ఎంపికయ్యారు. ఈ మేరకు రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి లిఖిత పూర్వక ప్రకటన జ్యోతిర్మయి కు అందినట్లు తెలిపారు.
ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మళ్ల మాణిక్యాలు, కార్యదర్శి హేమసాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆళ్ల ప్రవీణ్, సతీష్, నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబి, ఇతర సభ్యులు జ్యోతిర్మయి కు అభినందనలు వ్యక్తం చేశారు.

## కొవ్వూరులో జనసేన సభ్యత్వాలు ప్రారంభం



**రోలుగుంట మనసులో మాట, ఫిబ్రవరి 26..** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కొవ్వూరు గ్రామంలో జనసేన సభ్యత్వ కార్యక్రమం అద్భుత ఉత్సాహంతో ప్రారంభమైంది. జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జనసైనికుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం చోడవరం కొవ్వూరులో ఇస్తోంది. కొవ్వూరు గొప్ప నియోజకవర్గం ఫలితాలు జనసేన అధ్యక్షుడు నందారపు చంద్రావు మాట్లాడుతూ, "ఈ సభ్యత్వం ప్రతి కార్యకర్తకు భరోసా అని. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుంది అని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేపట్టిన అనేక సామాజిక కార్యక్రమాలు, చోడవరం నియోజకవర్గ ఇన్చార్జ్ పివిఎస్ ఎన్ఎస్ రాజు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకోవటం వల్ల ప్రజలు జనసేనకు నీరాజనం పడుతున్నారని, స్వచ్ఛందంగా సభ్యత్వాలకు ముందుకు వస్తున్నారని చంద్రావు పేర్కొన్నారు. ఈ సభ్యత్వం కేవలం 400 రూపాయలు మాత్రమే అని తెలిపారు. ఈ యొక్క సభ్యత కార్యక్రమంలో గ్రామంలోని జనసైనికులు వీర మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# తూటిపాల గ్రామంలో అక్రమ ఇసుక తవ్వకాలు జెసిపి స్వాధీనం



**మాకవరపాలెం, ఫిబ్రవరి 26 (మనసులో మాట)..** మాకవరపాలెం మండలం పరిధిలోని తూటిపాల గ్రామంలో వ్యవసాయ భూముల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్న ఘటన బయటపడింది. స్థానిక రైతుల ఫిర్యాదుతో అప్రమత్తమైన రెవెన్యూ అధికారులు అకస్మాత్తుగా దాడులు నిర్వహించి తవ్వకాలకు ఉపయోగిస్తున్న జెసిపిని స్వాధీనం చేసుకున్నారు.
గ్రామానికి చెందిన కొందరు ప్రభావశీలుల ఆశ్రయంతో ఇసుక మాఫియా రాత్రి వేళల్లో భారీ యంత్రాలతో వ్యవసాయ భూములను లోతుగా తవ్వి, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం. ఈ తవ్వకాల వల్ల పంట భూములు దెబ్బతినడంతో పాటు భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
తాజాగా అందిన విశ్వసనీయ సమాచారంతో తహసీల్దార్ బి. వెంకటరమణ నేతృత్వంలో రెవెన్యూ సిబ్బంది గ్రామానికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా ఇసుక తవ్వుతుండగా జెసిపిని అక్కడికక్కడే స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసే ప్రక్రియ ప్రారంభించారు.
రైతులు పలుమార్లు సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు ఆలస్యంగా తీసుకున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై గ్రామస్థులు, రైతు సంఘాలు తీవ్రంగా స్పందిస్తూ, ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకుని భూములను రక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అక్రమ తవ్వకాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.
రెవెన్యూ అధికారులు హెచ్చరిస్తూ, వ్యవసాయ భూముల్లో అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# బూరుగుపాలెం గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభం

### – అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన భీమిరెడ్డి గోవిందారావు





**మాకవరపాలెం ఫిబ్రవరి 26 (మనసులో మాట)..** మాకవరపాలెం మండలం బురిగుపాలెం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ ఈజీఎస్) కింద నిలిచిపోయిన పనులు మళ్లీ ప్రారంభం కావడంతో గ్రామంలో ఆనందం వ్యక్తమవుతోంది. పనులు నిలిచిపోయిన అంశంపై జిల్లా కలెక్టర్ కార్యాలయం లో పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర వలంటీర్ వింగ్ జాయింట్ సెక్రటరీ భీమిరెడ్డి గోవింద స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఫిర్యాదు అనంతరం జిల్లా అధికారులు తక్షణమే స్పందించి ఏపీవోను గ్రామానికి పంపించి పరిస్థితులను పరిశీలించి పనులు పునఃప్రారంభించడాన్ని ఆయన అభినందించారు. చెరువుల మరమ్మతులు, మట్టి పనులు తిరిగి ప్రారంభం కావడంతో కార్మికులకు మళ్లీ ఉపాధి అవకాశాలు లభించాయని, పేద కుటుంబాలకు ఇది ఎంతో ఊరట కలిగించిందని భీమిరెడ్డి గోవిందరావు పేర్కొన్నారు.
గ్రామ ప్రజల సమస్యను గుర్తించి వేగంగా చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్ కు మరియు ఏపీవోకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇకపై అర్హులైన ప్రతి కార్మికుడికి నిరంతర ఉపాధి కల్పించేందుకు చర్యలు కొనసాగించాలని ఆయన కోరారు. అధికారుల స్పందనపై గ్రామ ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

### రోలుగుంట మండలం ఎంఆర్సి సిబ్బంది

# మార్చి 6 'చలో విజయవాడ'కు మాస్ లీవ్ అభ్యర్థన




**రోలుగుంట మనసులో మాట, ఫిబ్రవరి 26.** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన రోలుగుంట,సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 2026 మార్చి 6న విజయవాడలో నిర్వహించనున్న 'చలో విజయవాడ' రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి మాస్ లీవ్ మంజూరు చేయాలని రోలుగుంట మండలం ఎంఆర్సి సిబ్బంది ఎంఇఓ కి విన్నత పత్రం సమర్పించారు. వేతనాల పెంపు, సేవా నిబంధనలు, క్రమబద్ధీకరణ, కనీస టైమ్ స్కేల్ అమలు, హెచ్ఆర్ పాలసీ రూపకల్పన, ఉద్యోగ భద్రత, సంక్షేమ సౌకర్యాలు వంటి ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ ఈ అభ్యర్థన చేశారు. గతంలో ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో సమస్యలు పరిష్కారం కాకపోవడం ఉద్యోగుల్లో తీవ్ర నిరాశను కలిగించింది. 2025 నవంబర్ 4 మరియు డిసెంబర్ 19 తేదీలలో రెండు దఫాలుగా జరిగిన చర్చల్లో వేతనాలతో పాటు సేవా నిబంధనలు, హెచ్ఆర్ పాలసీ, ఉద్యోగ భద్రత వంటి నాన్-ఫైనాన్స్ సమస్యలకు కూడా పరిషకారాలు రాలేదు. ఈ నిరాశలోనే ఉద్యోగుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణార్థం మార్చి 6న విజయవాడలో శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రోలుగుంట మండలం ఎంఆర్సి సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మాస్ లీవ్ మంజూరు చేయాలని ఎంఇఓ ని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు ఎప్పటికీ పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు మరింత తీవ్రమవుతాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సిబ్బంది, ప్రభుత్వం వాగ్దానాలు అమలు చేయకపోతుంటే ఉద్యోగులు మరింత ఆందోళనకు దిగవలసి వస్తుందని చెప్పారు.

# పోలీయో ఫండ్ రైజింగ్ సైకిల్ రైడ్

### అనకాపల్లి లో ఘన స్వాగతం పలికిన రోటరీక్లబ్ ప్రతినిధులు

### 550 కిలోమీటర్ల లక్ష్యం తో ఇచ్ఛాపురం నుంచి కాకినాడ వరకు రోటరీ క్లబ్ లను కలుస్తున్న సైకిల్ రైడ్




**అనకాపల్లి, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** పోలీయో ఫండ్ రైజింగ్ సైకిల్ రైడ్ కు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనకాపల్లి సుంకరమెట్ట జంక్షన్ లో గురువారం ఘన స్వాగతం లభించింది. డిస్ట్రిక్ట్ గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తి పోలియో ఫండ్ రైజింగ్ సైకిల్ రైడ్ ఇచ్ఛాపురం నుంచి బయలుదేరి విశాఖపట్నం, ఫేస్2 లో విశాఖపట్నం నుంచి బయలుదేరి అనకాపల్లి సుంకరమెట్ట జంక్షన్ కు చేరుకుంది. వారికి అనకాపల్లి రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. పోలియో ఫండ్ పెంచాలన్న మంచి ఆశయంతో 57 సంవత్సరాల వయసు లోను సైకిల్ రైడ్ చేపట్టడం జరిగింది. ఇచ్ఛాపురం నుంచి కాకినాడ వరకు అన్ని రోటరీ క్లబ్స్ నీ కలుస్తూ సైకిల్ రైడ్ (550 కిలోమీటర్లు) చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షులు బుద్ధ శ్రీనివాసరావు, క్లబ్ కార్యదర్శి కె.వి.పి.ఎస్ ప్రకాష్ రావు, కోశాధికారి బి. సర్వారావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# కొయ్యూరులో జనసేన 'ఉద్యమిసాధక్ ప్రదాత' సభ్యత్వ నమోదు




**కొయ్యూరు, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని జనసేన పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "నా కార్యకర్త శ్రేయస్సే జనసేన శ్రేయస్సు" నినాదంతో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం కొయ్యూరు మండలంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం పాడేరు నియోజకవర్గ పరిధిలో పార్టీ ఇంచార్జ్, ఆంధ్ర రాష్ట్ర జానపద కళలు & సృజనాత్మక అకాడమీ చైర్మన్ డా. పంపూరు గంగులయ్య పర్యవేక్షణలో జరుగుతోంది. క్రియాశీల సభ్యత్వానికి "ఉద్యమి సాధక్ ప్రదాత"గా నామకరణం చేసినట్లు నాయకులు తెలిపారు. "మెంబర్షిప్ టు లీడర్ షిప్" అనే భావనతో సభ్యత్వం నుండి నాయకత్వం దిశగా కార్యకర్తలను తీర్చిదిద్దే లక్ష్యంతో ఈరోజు 26 నుండి కొయ్యూరు మండల పరిధిలో సభ్యత్వ నమోదు ప్రారంభించారు. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై, సమాజంలో మార్పు కోరుకునే ప్రతి ఒక్కరూ ఈ సభ్యత్వాన్ని పొందాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేయదలచిన వారు తప్పనిసరిగా సభ్యత్వం నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. ముందుగా రూ.500గా ఉన్న ఉద్యమి సభ్యత్వ రుసుమును రూ.400కు నిర్ణయించినట్లు వెల్లడించారు.

సభ్యత్వం వలన కలిగే ప్రయోజనాలు:
- పార్టీ సభ్యునిగా అధికారిక గుర్తింపు, గౌరవం
- పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత
- కమిటీల్లో బాధ్యతల అప్పగింతకు సభ్యత్వం తప్పనిసరి
- నాయకత్వ బాధ్యతలు సభ్యులకు మాత్రమే
- రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం
- నాయకత్వ శిక్షణ కార్యక్రమాలు
- ప్రమాదవశాత్తు గాయాలయితే రూ.30 వేల నుండి రూ.75 వేల వరకు వైద్య సహాయం.

కొయ్యూరు మండల పరిధిలో సభ్యత్వ నమోదు కోసం వివిధ పంచాయతీల నుండి 13 మందిని "ఉద్యమిసాధక్ప్రదాత"లుగా నియమించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గూడెం లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడు సాగిన బుజ్జి బాబు, మహిళా మండల అధ్యక్షురాలు సెగ్గే బావన సాయి జయంతి, ఉపాధ్యక్షుడు పూర్రా రాజేష్, మండల ఆర్గనైజర్ పిటా సుదీర్ బాబు(రాజేంద్రపాలెం పంచాయతీ ఉద్యమిసాధక్ప్రదాత), మంప పంచాయతీ అధ్యక్షుడు కోటం నాగేంద్ర బాబు (మంప ఉద్యమిసాధక్ప్రదాత), కంటారం నుంచి ఉద్యమిసాధక్ రాఘవ రాజు బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.



# గొలుగొండ లో జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

**గొలుగొండ ఫిబ్రవరి 26,( మనసులో మాట):** గొలుగొండలో నర్సీపట్నం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ రాజాని వీర సూర్యచంద్ర ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జనసేన సభ్యత్వం నమోదు కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. జనసేన పార్టీ సిద్ధాంతాలు భావజాలాలు నచ్చి ఈ ఉద్యమి సభ్యత్వం నమోదు చేసుకోవడానికి ఆసక్తి గలవారు ఉద్యమి సభ్యత్వ నమోదు చేసుకుంటారని అంతే కాకుండా సభ్యత్వ నమోదు చేసుకోవడం వల్ల ఏదైనా ప్రమాదవశాస్తూ మరణిస్తే 5 లక్షల రూపాయలు, ప్రమాదవశాస్తూ గాయపడితే 50000 రూపాయలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు ఊడి చక్రవర్తి జిల్లా సెక్రటరీ పంచాడ హరినాథ్ గొలుగొండ మండల అధ్యక్షులు గడ్డం దొరబాబు, నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సలాదుల ప్రసాదు బాబు దేవి, రేగుబ్బల శివ, నర్సీపట్నం ఎస్సీ సెల్ అధ్యక్షులు కోన నారాయణరావు, గొలుగొండ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, మద్దపు కామనాయుడు మర్సా స్వామినాయుడు ఎలిసెట్టి సాయి, కర్రీ శ్యామ్ కుమార్,నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి' హామీ పనులు గుర్తించాలి

### - ఏపీవో సూరిబాబు...

పెదబయలు ఫిబ్రవరి26 మనసులో మాట : మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి పనులు గుర్తించాలని స్థానిక పీఎం వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ అండ్ అజీవికా హామీమిషన్ ( గ్రామీణ్) ఏపీవో కె. సూరిబాబు సూచించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ పంచాయతీలో 20 పనులు తప్పనిసరిగా గుర్తించాలని అన్నారు. గతంలో కాకుండా జీపీఆర్ఎస్ పద్ధతిలో ల్యాండ్ మాపింగ్ చేస్తూ పనులు గుర్తించడం జరుగుతుందని మిషన్ మ్యాపింగ్ అయిన ప్రాప్తికి మాత్రమే అంచనా జనరేట్ అవుతుందన్నారు. దీనిప్రకారం పని చేయాల్సి ఉంటుందని అన్నారు. మండలంలో పీఎం జన్మన్ పథకంలో 3500 పక్కా గృ హాలు మంజూరు కాగా 1499 గృహాలకు చెల్లింపులు జరిగినట్టు ఆయన తెలిపారు. ఈ గృహ నిర్మాణాలకు సంబంధించి బేస్మెంట్ కు 50 పనిదినాలు, లింటల్ వరకు 40 పనిదినాలు చొప్పున మొత్తం 90 పని దినాలు చేసుకోవాలన్నారు. పక్కా గృహాలకు సంబం ధించి పనులు జరిగిన ప్రాప్తికి బిల్లులు అందించడం జరుగుతుందన్నారు. గత ఏడాది పండ్ల తోటలు, సిల్వర్ ఓక్ మొక్కల పెంపకానికి ప్రస్తుతం గొప్పులు తీయడం, కంచె నిర్మాణం పనులు చేయాల్సి ఉం దన్నారు. పండ్ల తోటలకు కంచె, గొప్పు తీయడంతో పాటు మొక్కలకు నీరు అందించాలని ఆయన సూచించారు. మండలంలో 2610 ఎకరాల సిల్వర్ ఓక్, మహాగని మొక్కలు పంపిణీ చేయడం జరిగిం దని ఆయన పేర్కొన్నారు.

# పెదబయలు మండలంలో నాలుగు చోట్ల పంటల కొనుగోలు కేంద్రాలు

### - జీసీసీ బ్రాంచ్ మేనేజర్. జి.అప్పన్న...

పెదబయలు ఫిబ్రవరి 26 మనసులో మాట : మండలంలోని రైతులకు మేలు చేసేందుకు నాలుగు ప్రధాన ప్రాం తాల్లో పసుపు, చింతపండు, రాగుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు. చేస్తున్నట్లు స్థానిక జీసీసీ బ్రాంచ్ మేనేజర్ జి. అప్పన్న తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు పెదబయలు, గంపరాయి, పెదకోడాపల్లి, లక్ష్మీపేట ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. బాగా ఎండిన పసుపు కిలో రూ.115, రాగులు (చోళ్లు) రూ.36, చింతపండు రూ. 35కు కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఎంత మేర పంట పండిస్తున్నారనే వివరాలను సేక " రించేందుకు జీసీసీ సిబ్బంది ఇంటింటికీ వస్తారని, ఆ సమయంలో రైతులు తమ ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం, ఐఎఫ్ ఎస్సీ కోడ్ వివరాలను నమోదు చేసు కోవాలని కోరారు. సంస్థకు సరకు విక్రయిం చిన 24 గంటల్లోపే నగదు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయబడుతుందని మేనేజర్ స్పష్టం చేశారు. బయట మార్కెట్లో ధరల హెచ్చుతగ్గులు ఉన్నప్ప టికీ, రైతులు తాము పండించిన పంటలను, ఆటవీ ఉత్పత్తులను జీసీసీకే విక్రయించి సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో కాఫీ రుణాలు తీసుకున్న రైతుల నుంచి బకాయిల రికవరీ ప్రక్రియ కూడా జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జి జి సి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



**కోటవురట్ల (మనసులో మాట) ఫిబ్రవరి26:** కోటవురట్ల: విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య ఆరోగ్య సిబ్బంది సూచించారు. గురువారం కోటవురట్ల మండలం కొడవటిపూడి జడ్పీ హైస్కూల్లో రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు వైద్యారోగ్య సిబ్బంది ఐరన్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ రక్తహీనత అనేక వ్యాధులకు దారితీస్తుందని అన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు. విద్యార్థులు పరిశుభ్రత పాటించాలన్నారు. మలమూత్ర విసర్జనకు వెళ్లి వచ్చిన తర్వాత చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని అన్నారు. బజార్లో దొరికే జంక్ ఫుడ్స్ జోలికి వెళ్లవద్దన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అనారోగ్యంగా ఉంటే వెంటనే సమీపంలో గల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏఎన్ఎం మణి కుమారి పాల్గొన్నారు.

# 27న మారేపల్లి వెంకటేశ్వరస్వామి కళ్యాణం



**దేవరాపల్లి, ఫిబ్రవరి 26, మనసులో మాట :** మండలంలోని మారేపల్లి పాండవుల కొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ఈనెల 27న శుక్రవారం ఏకాదశి నాడు ఈ కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ కళ్యాణం సందర్భంగా అదేరోజు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కళ్యాణ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని వారు ఆకాంక్షించారు.

# దాలిగుమ్మడిలో కాసో ఆపరేషన్

## గంజాయి, నాటుసారాపై కఠిన చర్యలు - సీఐ సన్యాసినాయుడు.

## - గంజాయి మత్తు పదార్థాలు జోలికి పోవద్దు



**హుకుంపేట ఫిబ్రవరి 26 మనసులు మాట..** మండలంలోని హుకుంపేట పంచాయతీ దాలిగుమ్మడి గ్రామంలో గురువారం పోలీసులు కాసో ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి కారణంగా యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు.పాడేరు ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు గ్రామంలో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా గంజాయి పెడ్లర్లు, నాటుసారా తయారీదారులు, అమ్మకాలు చేసే వారిపై నిఘా పెట్టడంతో పాటు, గ్రామంలో బయట ప్రాంతాల నుంచి వచ్చి నివసిస్తున్న వ్యక్తుల వివరాలను సేకరించారు. తదనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి, గ్రామంలోకి కొత్తగా వచ్చే బయటి వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. గంజాయి రవాణా, వినియోగం, నాటుసారా తయారీ లేదా అమ్మకాలలో ఎవరైనా పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దాలిగుమ్మడి ఎంపీటీసీతో పాటు గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

# సచివాలయం సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందించాలి

## - సిబ్బంది నిర్లక్ష్యం, అవకతవకలు సహించేది లేదు సియ్యారి దొన్ను దొర





**హుకుంపేట ఫిబ్రవరి 26 మనసులో మాట..** గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలంటే సిబ్బంది బాధ్యతాయుతంగా, అంకితభావంతో పనిచేయాలని టీడీపీ అరకు నియోజకవర్గ ఇంచార్జి, విజయనగరం జోనల్1 ఏపీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర అన్నారు. హుకుంపేట మండలంలోని సంతారి పంచాయతీ సచివాలయంలో ఆయన గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని సిబ్బంది హాజరు పట్టిక, సమయపాలన, ప్రజలకు అందుతున్న సేవలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆయన సవివరంగా ఆరా తీశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ వంపూరు శిరీషను పథకాల అమలు వివరాలపై ప్రశ్నించి తెలుసుకున్నారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ మాత్రమే విధులు నిర్వహించడం, పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత ఉన్నా, అందుబాటులో ఉన్న సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా సియ్యారి దొన్ను దొర మాట్లాడుతూ, సిబ్బంది సకాలంలో విధులకు హాజరై ప్రజలకు సేవలు పూర్తిస్థాయిలో అందించాలని స్పష్టం చేశారు. సమయపాలన పాటించకపోవడం వల్ల ప్రజలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. సేవలందించే విషయంలో నిర్లక్ష్యం, అవకతవకలు చోటుచేసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో ప్రతి అర్హుడికి చేరేలా సచివాలయ సిబ్బంది చురుకుగా పనిచేయాలన్నారు. గ్రామసభలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు సేవ చేయడమే ప్రధాన లక్ష్యంగా సిబ్బంది అందరూ పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడే వడ్డాది వెంకన్న కళ్యాణం

## - మార్చి 4 వరకు ఉత్సవాలు







**బుచ్చియ్యపేట, ఫిబ్రవరి 26 (మనసులో మాట);** ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన వడ్డాది శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణం శుక్రవారం అత్యంత వి వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీదేవి, భూదేవి, అలివేలుమంగా సమేత వేంకటేశ్వర స్వామి వారికి శు క్రవారం రాత్రి 9 గంటలకు కళ్యాణం జరుగుతుంధి. స్వామి వారికి ప్రస్తుతం 153వ వార్షిక కళ్యాణ మహోత్సవాలు గురువారం ప్రారంభించి మార్చి 4వ తేదీ బుధవారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గురువారం రాత్రి స్వామి వారి దొంగపెల్లి, ధ్వజారోహణతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు మార్చి 4వ తేదీ పుష్పాంజలితో ముగుస్తాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు, మహోమాదికములు, తిరువీధి, కళ్యాణ మహోత్సవం, మార్చి1న తిరువీదోత్సవం, సదస్యం ,మార్చి 3వ తేదీ మంగళవారం నాగవల్లి చక్రస్నానం నిర్వహిస్తారు. ఈ ఏడాది నాగవల్లి రోజున చంద్రగ్రహణం ఉన్నందున స్వామివారి చక్రస్నానం ఉదయం 11 గంటల లోపు కొండపైనే ముగించి ఆలయాన్ని మూసివేయనున్నారు. మళ్లీ మరుసటి రోజు తెల్లవారుజామున మాత్రమే ఆలయ ద్వారాలు తెరుచుకోనున్నాయి. పురవీధుల్లో ఊరేగింపు, వసంతోత్సవం రద్దు చేశారు. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ వైకుంఠ ఏకాదశికి వడ్డాది గిరిజాంబ గిరిపై శ్రీదేవి,భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి కల్యాణ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

స్థలపురాణం.........


ఈఆలయానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. 154 ఏళ్ల క్రితం శ్రీనారాయణ భజ్ అనే యోగి వచ్చి వడ్డాదికి దక్షిణ దిశగా వెంకటేశ్వర స్వామి నెలకొల్ప పడతారని అది పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందుతుందని చెప్పి దేశసంచారం నిమిత్తం వెళ్లిపోయారు.యోగి వెళ్లిన మరుసటి ఏడాదే గిరిజాంబగిరికి ఉత్తర దిశగా ఉన్న విజయరామ రాజు పేటలో కాళ్ల వంశస్థులు బావిని తవ్వుతుండగా పది అడుగుల లోతులో వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి,భూదేవి విగ్రహాలు బయటపడ్డాయి. ఈవిషయాన్ని అప్పటి గ్రామపెద్ద దొండా భగవంతులయ్య దొరకు తెలియజేయడంతో విగ్రహాలను వడ్డాది గిరిజాంబగిరికి రప్పించి పురాణయుక్తంగా దేవాలయ నిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్ట చేయించారు.నాటి నుండి నేటి వరకు ప్రతి ఏటా స్వామికి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవాలయ నిర్వహణకు 60 ఎకరాల మాగాణి విరాళంగా ఇచ్చారు. 1970 దశకంలో ఆలయం దేవాదాయ శాఖ అధీనంలోకి వెళ్లింది. ఈస్థలానికి మహాభారత కాలం నాటి ఘటనలతో సంబంధం ఉన్నట్లుగా సింహాచలం దేవస్థానం ప్రచురణలలో పేర్కొన్నారు. మహాభారతంలో పాండవుల అజ్ఞాత వాసంలో విరాటరాజు పాలించిన మత్స్యదేశ రాజధాని అయిన విరాటపురమే నేటి వడ్డాది అని తెలుస్తోంది. పాండవులు గిరిజాంబగిరిని ఆనుకొని ఉన్న చెరువులో స్నానమాచరించి సంధ్యావందనం చేసేవారని,కనుకనే ఈచెరువును పాండవుల చెరువుగా పిలుస్తున్నారని తెలుస్తోంది.ధర్మ మూర్తులైన పాండవుల సంచరించిన ప్రాంతం కనుకనే వడ్డాది పరిసర గ్రామాలు సస్యశ్యామలమై పాడిపంటలతో తులతూగుతున్నాయని భక్తుల విశ్వాసం.

ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు....

ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వ్యవస్థాపక ధర్మకర్త దొండా కన్నబాబు, కార్యనిర్వహణాధికారి టి.ఎన్.ఎస్ శర్మ సంయుక్తంగా తెలిపారు.భక్తులు క్యూలైన్లో వెళ్లేందుకు బారికేడ్లు భారీగా,పోలీసు బందోబస్తు, వైద్య శిబిరము,త్రాగునీరు, ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశారు. కొండ వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోను, జంక్షన్లో స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలంకరణ,సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## 16వ బెటాలియన్ ఆర్ఎస్ఐ టీ వైకుంఠ రావు ఆధ్వర్యంలో

# రాష్ట్రంలో విపత్తులు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్







**మునగపాక, ఫిబ్రవరి 26, మనసులో మాట..** పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణపర్తి నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన దళం(ఏపీఎస్ డి ఆర్ఎఫ్)-16వ బెటాలియన్ విశాఖపట్నం వారు సిఎస్ఎస్ఆర్ మాక్ డ్రిల్లులి ను నిర్వహించడం జరిగింది. ఈ మాక్ డ్రిల్ లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజామణి ఉపాధ్యాయ బృందం మరియు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు విపత్తుల శాఖ నుంచి 16వ బెటాలియన్ ఆర్ ఎస్ ఐ టి.వైకుంఠరావుమరియు 22 మంది ఎస్ డి ఆర్ ఎఫ్ బృందం పాల్గొనడం జరిగింది. దీనిలో భాగంగా వివిధ రకాల విపత్తులు, (ప్రకృతి మరియు మానవ కారక విపత్తులు) అనగా వరదలు కరువు కాటకం, అగ్ని ప్రమాదాలు మరియు పారిశ్రామిక దుర్ఘటనలు వంటి వాటి సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలుమరియు సన్నద్ధత గురించి విద్యార్థులు అందరికీ వివరించి,చక్కగా మాక్ డ్రిల్ కూడా నిర్వహించి, జరిగింది. లైఫ్ జాకెట్స్ మరియు అగ్నిమాపక పరికరాల గురించి తెలియపరచడం వివిధ రకాల సూచనలు సలహాలు అందించడం జరిగింది.



# ముగిసిన వడ్డాది మోదకొండమ్మ పండగ ఉత్సవాలు

**బుచ్చియ్యపేట, ఫిబ్రవరి 26(మనసులో మాట);** వడ్డాది నాలుగు రోడ్ల కూడలిలో కొలువై ఉన్న మోదకొండమ్మ పండుగ గురువారంతో ముగిసింది. గత మంగళవారం నుండి అమ్మవారి పండుగను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీర, జాకెట్టు, పసుపు, కుంకుమ, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు పండుగ సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలు ఆలయ కమిటీ చైర్మన్ దొండా గిరిబాబు ఆధ్వర్యంలో జరిగాయి.

# గ్రామాల్లో వైద్య సేవ అందిస్తున్న వైద్యాధికారి డా. అచ్యుత్



**హుకుంపేట ఫిబ్రవరి 26 మనసులు మాట..** హుకుంపేట మండలంలోని ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బకూరు సచివాలయం గోప్పులపాలెం గ్రామంలో గురువారం 104 వాహనం ద్వారా వైద్య శిబిరం నిర్వహించి 110 మందికి వైద్య చికిత్స అందించారు. ఈ విషయాన్ని వైద్యాధికారి డా. అచ్యుత్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు సులభంగా అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం 104 వాహన సేవలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ సేవల ద్వారా సాధారణ జ్వరాలు, జలుబు, రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులకు చికిత్స అందించడంతో పాటు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలున్న వారిని మెరుగైన చికిత్స కోసం సమీప ఆసుపత్రులకు రిఫర్ చేసినట్లు చెప్పారు.

గ్రామస్తులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఆలస్యం చేయకుండా చికిత్స పొందాలని డా. అచ్యుత్ సూచించారు.

ఈ కార్యక్రమంలో విస్తీరణ అధికారి కె. మహేష్, సూపర్వైజర్ మోహనరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పోరాడి విజయం సాధించిన పిఎసిఎస్ ఉద్యోగులకు జేజేలు

## - సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి



**మునగపాక , ఫిబ్రవరి 26, మనసులో మాట..** మునగపాకసహకార సంఘాల ఉద్యోగుల ఈనెల 16 నుండి సమ్మె నిర్వహించి, దీక్షలు ర్యాలీలు ధర్నాలు చేసి ప్రభుత్వం స్పందించేలా పోరాడిన సహకార ఉద్యోగులకు సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ జై జై పలికారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం24.02.2026: రాష్ట్ర సహకార శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరియు ఉన్నత అధికారుల సమక్షంలో రాష్ట్ర జేఏసీ నాయకత్వం తో చర్చలు చేసి సమస్యలను పరిష్కరించారు. గ్రాట్యుటీ 4 లక్షలు ఇవ్వడానికి, ఐ ఆర్ 20% భీమా 5 లక్షలు చెల్లించడానికి ముఖ్యమైన వి రాష్ట్ర జేఏసీ తెలియజేశారు. మిగతా డిమాండ్స్ కూడా త్వరలో పరిష్కారం చూస్తామని, మంత్రి హామీ ఇవ్వడం జరిగింది.బుధవారం నుండి సమ్మె విరమించి యధావిధి గా పిఎసిఎస్ ఉద్యోగులువిధులకు హాజరు కావడం జరిగింది. ఇదే పోరాటస్ఫూర్తితో భవిష్యత్తులో సమస్యలు పరిష్కారానికి పోరాడాలని ఉద్యోగులకు గని శెట్టి తెలియజేశారు.



# ఓటరు మ్యాపింగ్ ను వేగవంతం చేయాలి

## - తహసిల్దార్ ఎం లక్ష్మి

**బుచ్చియ్యపేట, ఫిబ్రవరి 26(మనసులో మాట);** ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని బిఎల్ఓలను తహసిల్దార్ ఎం లక్ష్మి ఆదేశించారు. గురువారం వడ్డాది సచివాలయంలో బిఎల్ఓలతో ఆమె సమావేశం అయ్యారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఓటరు మ్యాపింగ్ నిర్వహణపై వారికి దిశా నిర్దేశం చేశారు. ఓటరు ప్రోజెని మ్యాపింగ్ మరింత వేగవంతం చేయాలని సూచించారు. 2002 వ సంవత్సర ఓటరు జాబితా వివరాలతో ప్రస్తుత వివరాలను సరి పోల్చి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు తప్పని సరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రక్రియను అమలు చేయాలన్నారు. రోజువారీగా మ్యాపింగ్ వివరాలను సమర్పించాలని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా ప్రోజెని మ్యాపింగ్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం వడ్డాదిలో రీ సర్వేపై రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. రీసర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. వీఆర్వోలు గణేష్, పావని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# భీమవరం పంచాయతీ కార్యదర్శి గైర్హాజరు

## - ఎంపీడీఓ అండదండలతో విధులకు డుమ్మా

## - గ్రామ ప్రజలు సర్పంచ్ ఆగ్రహం






**హుకుంపేట ఫిబ్రవరి 26 మనుసులో మాట..** ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే చేర్చాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ క్షేత్రస్థాయిలో అస్తవ్యస్తంగా మారుతోందని భీమవరం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హుకుంపేట మండలంలోని భీమవరం పంచాయతీ సచివాలయంలో సిబ్బంది ఉన్నప్పటికీ, పంచాయతీ కార్యదర్శి మాత్రం క్రమం తప్పకుండా విధులకు హాజరు కావడం లేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శితో పాటు డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తదితరులు కలిపి సుమారు పది మందికి పైగా సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలి. సర్వేలు తదితర పనుల నిమిత్తం బయటకు వెళ్లినా కనీసం ఇద్దరు ముగ్గురు సిబ్బంది కార్యాలయంలో ఉండి ప్రజల విన్నపాలను స్వీకరించాల్సి ఉంటుంది. కానీ భీమవరం సచివాలయంలో ప్రస్తుతం ఉపాధి హామీ (ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ) సిబ్బంది తప్ప మరెవరూ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గ్రామస్తులు నైని కొండబాబు, నైని రాజగోపాల్, బోయిని లచ్చన్న, నైని సింహాచలం మాట్లాడుతూ, సచివాలయానికి వచ్చినా పనులు కాక సమయం, డబ్బు వృథా అవుతోందని వాపోయారు. కనీసం ఒకరైనా సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) పర్యవేక్షణ లోపమేనని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఎంపీడీఓ నెలకు నిర్ణీత సంఖ్యలో సచివాలయాలపై ఆకస్మిక తనిఖీలు చేయాల్సి ఉండగా, గత ఆరు నెలలుగా అలాంటి తనిఖీలు జరగలేదని ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై భీమవరం సర్పంచ్ నైని సన్నీబాబు స్పందిస్తూ, పంచాయతీ కార్యదర్శి వారానికి కేవలం రెండు రోజులు మాత్రమే విధులకు వస్తున్నారని, మిగిలిన రోజుల హాజరును ఒకేసారి వేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని, సచివాలయాన్ని ఒక్కసారి కూడా పర్యవేక్షించలేదని విమర్శించారు. విధులను విస్మరించిన సిబ్బందిపై, నిర్లక్ష్యం వహించిన ఎంపీడీఓపై ఉన్నతాధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## అంచనాలకు మించి జనసేన పార్టీ

# క్రియాశీలక సభ్యత్వాలు చేపట్టాలి

## ఉత్తరాంధ్ర జిల్లాల జనసేన పార్టీ అధికార ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్



**మునగపాక, ఫిబ్రవరి 26, మనసులో మాట..** గతం కంటే భిన్నంగా రాష్ట్రంలోనే ఎలమంచిలి నియోజకవర్గంలో అంచనాలకు మించి జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల జనసేన పార్టీ అధికార ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ జన సైనికులకు పిలుపునిచ్చారు. మునగపాక పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం లాగిన్ చేశారు. ఈసారి సభ్యత నమోదు మూడు రకాలుగా ఉంటుందని, ఉజ్జమి సభ్యత్వం తీసుకున్న వారు, సాధక సభ్యత్వాలు నిర్వహించేవారు, ప్రదాత విరాళాలు ఇచ్చి సలహాలు సూచనలు పార్టీకి ఇచ్చే వారిని ఈ విధంగా పిలవడం జరుగుతుందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురాం, ప్రధాన కార్యదర్శి కాళ్ళ చంద్రమోహన్, జన సైనికులు బొడ్డేడ అప్పలనాయుడు, మొల్లేటి వెంకట భోగేశ్వరరావు, ఆడారి శ్రీకాంత్, ఏవి సత్యనారాయణ, సూరిశెట్టి అప్పలనాయుడు, పి మూర్తి, గొల్లవిల్లి త్రిమూర్తులు, కోయిలాడ లక్ష్మీనారాయణ, ఒంపోలు సర్పంచ గనీరెడ్డి సూరప్పారావు కారుకొండ కాశీ,వీర మహిళలు పాల్గొన్నారు.

మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక

# కోస్తాంధ్ర

| తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా |
| --- | --- | --- |
| గుంటూరు | ప్రకాశం | నెల్లూరు |


శుక్రవారం 27 జనవరి 2026




## కల్తీ పాల, కలుషిత జలాల సమస్యపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా

# సీఎం చంద్రబాబు సమీక్ష

**- జిల్లా యంత్రాంగానికి సీఎం స్పష్టమైన దిశా నిర్దేశం**






**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 26:** రాజమహేంద్రవరంలో 'కల్తీ పాలు, కలుషిత జలాల సమస్యపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎస్పీ డీ నరసింహ కిషోర్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్ఎంసీ, పశు సంవర్ధక శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం అమరావతి నుంచి తూర్పు గోదావరి, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ప్రజా ప్రతినిధులతో కల్తీ పాలు, కలుషిత జలాల పరిస్థితిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్షేత్ర స్థాయిలో ప్రస్తుత పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తత కలిగి ఉండాలన్నారు. సమస్యలను మూలం నుండే గుర్తించి, ఎటువంటి ఉదాసీనతకు తావు లేకుండా భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అందుకు అనుసరించి క్రియాశీలంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. డేటా విశ్లేషణకు సంబంధించి సేకరించిన సమాచారం సరైన విధంగా విశ్లేషించి, సమస్య పరిష్కార మార్గాలను రూపొందించాలన్నారు.

సిద్ధాంతాత్మకంగా కాకుండా ఆచరణ సాధ్యం అయ్యే విధంగా ఫలితాల మీద దృష్టి పెట్టాలన్నారు. స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ప్రకారం క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆడిట్ ఫలితాలు, ల్యాబ్ రిపోర్టులు క్షేత్ర స్థాయి పరిశీలనలతో సమ్మిళితం కలిగి ఉండాలన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే విధంగా అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, ఆ మేరకు స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉండేలా, నిరంతర పర్యవేక్షణ చెయ్యడం ముఖ్యం అన్నారు. శనివారం మరోసారి సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు.

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి జిల్లాలో కల్తీ పాల ఘటన వివరాలు తెలియజేస్తూ.. ఈ సమాచారం తెలిసిన వెంటనే తగిన చర్యలు చేపట్టడం ప్రారంభించామని తెలియజేశారు. ఘటన జరిగిన నేపథ్యంలో స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో ఒకే కుటుంబానికి చెందిన వృద్ధులు నలుగురు ఫిబ్రవరి 22న అడ్మిషన్ అయ్యారని తెలిపారు. బాధితులు అనూరియా (మూత్ర విసర్జన లేకపోవడం), వాంతులు, కడుపు నొప్పి, డయాలసిస్ అవసరమయ్యే తీవ్రమైన మూత్రపిండ వైఫల్యంతో చౌడేశ్వర నగర్, స్వరూప నగర్, లాలా చెరువు ప్రాంతాల నుండి వివిధ ఆసుపత్రుల్లో చేరారని తెలిపారు. ప్రాథమిక క్లినికల్ ఫలితాల ఆధారంగా, విషపూరిత పాల కారణంగా కిడ్నీ పనితీరు తగ్గినట్లు, సీరం క్రియేటినిన్ స్థాయిలు పెరగడం వల్ల తీవ్రత ఎక్కువ ఉంటుందని వైద్యులు సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. ఎపిడెమియోలాజీ పరిశీలనలో పాల వినియోగం, కేసుల మధ్య ప్రబలమైన సంబంధంగా ప్రాథమికంగా గుర్తించబడిందని, పరీక్షల వివరాలు వచ్చిన తర్వాత వాస్తవ కారణాలపై స్పష్టత వస్తుందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలియజేశారు. పాల సరఫరా నియంత్రణలో భాగంగా వరలక్ష్మి మిల్క్ డెయిరీ నరసాపురం (కోరుకొండ మండలం) ద్వారా సరఫరా నిలిపివేయడం జరిగిందన్నారు. పాల కల్తీకి సంబంధించి మొత్తం అడ్మిషన్లు 20 కాగా.. వారిలో 5 మరణాలు సంభవించాయని, 15 మంది చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. ఈ ఘటన తర్వాత పరిష్కార చర్యలుగా వేగవంతం చేయడం జరిగిందని, క్షేత్ర స్థాయిలో 9 వైద్య బృందాలు 110 గృహాలను సందర్శించి 315 రక్త నమూనాలను సేకరించామన్నారు. మరింత విస్తృత స్థాయిలో జిల్లాలో వనరుబుల్ ప్రాంతాలపై ప్రత్యేక విజిలెన్స్ కమిషనర్ రాహుల్ మీనా ఆధ్వర్యంలో 14 సర్వైవల్ బృందాల ద్వారా 957 కుటుంబాలను ప్రతి రోజూ స్క్రీనింగ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు "ప్రజల ప్రాణాలను కాపాడటం, వెంటనే వైద్య చర్యలు చేపట్టడం, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలను నివారించడం ప్రధాన లక్ష్యం"గా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయడం జరుగుతోందని తెలియజేశారు. రాజమహేంద్రవరం అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయని, అత్యాధునిక వైద్య సేవలు అందించే క్రమంలో విజయవాడ రెయిన్‌బో ఆసుపత్రి సహకారంతో బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే బాధితుల నష్ట పరిహారం చెల్లించడం, మెరుగైన వైద్య సేవలను భవిష్యత్తులో కూడా క్షేత్ర స్థాయిలో అమలు చేయడం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. కల్తీ పాలు ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే సదరు వెండర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించడం జరిగిందని ఎస్పీ డీ నరసింహ కిషోర్ తెలిపారు. వినియోగదారులు పాలు విషయంలో తేడా ఉన్న విషయం గుర్తించినట్టు తెలిపారు. ప్రస్తుతం వాస్తవ వివరాలు తెలుసుకునే దిశలో అవసరమైన అన్ని చర్యలు చేపట్టడం జరుగుతోందని ఎస్పీ నరసింహ కిశోర్ వెల్లడించారు.



# చిత్ర విచిత్రం 'చిత్రాడ' పాలన

**- బి.సి. కాలనీ లో పూర్తి రోడ్ల నిర్మాణానికి మోక్షం లేదు..**

**- ప్రైవేటు లేఅవుట్లలో నిర్మాణానికి నిధుల మంజూరి..**

**పిఠాపురం, ( మనసులో మాట) ఫిబ్రవరి 26:** ప్రభుత్వ ప్రాధాన్యతలు ఎటు వైపు వెళ్తున్నాయి? సామాన్య ప్రజలు నివసించే కాలనీల కంటే రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాలే ముఖ్యమా? అంటే పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలో జరుగుతున్న పనులు అవుననే సమాధానం ఇస్తున్నాయి. గ్రామంలోని బి.సి. కాలనీలో రోడ్లు అధ్వానంగా మారి ప్రజలు నరకయాతన పడుతుంటే, అధికారులు మాత్రం అవేమీ పట్టనట్లుగా ప్రైవేటు వ్యక్తుల లేఅవుట్లలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి..

**ప్రభుత్వ కాలనీలలో పాక్షిక అభివృద్ధి**

చిత్రాడలోని బి.సి. కాలనీలో పలు రోడ్లు రాళ్లు తేలి, గుంతలమయంగా మారి ప్రజలు నడవలేని స్థితిలో ఉన్నాయి. వర్షాకాలంలో ఈ ప్రాంతం బురదమయంగా మారి నరకాన్ని తలపిస్తోంది. స్థానిక ప్రజలు పలుమార్లు విన్నవించినా, ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ స్పందించలేదు. ప్రభుత్వ కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పన ప్రాధాన్యతగా ఉండాలని ఉపాధి హామీ పథక మార్గదర్శకాలు చెబుతున్నా, ఇక్కడ మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది.

**నియమ నిబంధనలు తుంగలో**

కొన్నేళ్ల క్రితం వేసిన గ్రీన్ సిటీ లేఅవుట్ లో నిబంధనల ప్రకారం రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి పంచాయతీకి అప్పగించాల్సిన బాధ్యత పూర్తిగా యజమానులదే. ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ లే అవుట్ నిబంధనలు (2002) ప్రకారం, మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్లాట్లు విక్రయించినందుకు సదరు యాజమాన్యంపై భారీ జరిమానా విధించి, ఆ నిధులను రికవరీ చేయాల్సి ఉంది. కానీ, ఆ దిశగా చర్యలు తీసుకోకుండా, పంచాయతీ నిధులను ప్రైవేటు వెంచర్లకు మళ్లించడం 'నిధుల దుర్వినియోగం' కిందకే వస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు.

**ప్రైవేటు లేఅవుట్‌పై 'నిధుల' ప్రేమ**

ఒకవైపు కాలనీల పరిస్థితి ఇలా ఉంటే, ప్రైవేటు వ్యక్తుల వెంచర్ లో ఇప్పుడు నూతన సిమెంట్ రోడ్ల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పంచాయతీరాజ్ నిధులతో ఇక్కడ సిమెంట్ రోడ్లు మంజూరు చేయడం గమనార్హం. కోట్లు విలువ చేసే ప్లాట్లు ఉన్న ప్రైవేటు లేఅవుట్లలో ప్రభుత్వం సొంత ఖర్చుతో రోడ్లు వేయడం వెనుక ఉన్న మర్మమేమిటో అధికారులే చెప్పాలని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధుల కేటాయింపులో వివక్ష చూపకుండా, తక్షణమే బి.సి. కాలనీలోని అన్ని అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయాలి. అలాగే, నిబంధనలు ఉల్లంఘించిన లేఅవుట్ యజమానుల నుండి జరిమానా వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలి. ప్రజా ధనాన్ని ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం వాడుతున్న అధికారులపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# అనూరియా బాధితులకు మంత్రి కందుల దుర్గేష్ మనో ధైర్యం

**- రాజమహేంద్రవరం కిమ్స్ ఆస్పత్రిలో బాధితులను పరామర్శించిన మంత్రి**

**- బాధితుల భుజం తట్టి, కరచాలనం చేసి అండగా ఉంటామని హామీ... సంతోషం వ్యక్తం చేసిన బాధితులు**

**- నిందితులపై కఠిన చర్యలు తప్పవు - బాధితులకు రూ. 10 లక్షల పరిహారం**

**- మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో చికిత్స**

**- రాజమహేంద్రవరంలోనే అధునాతన టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 26:** రాజమహేంద్రవరం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కల్తీ పాల ఘటన (అనూరియా) బాధితులను రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం స్వయంగా పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి దుర్గేష్.. వెంటిలేటర్లపై ఉన్న వారికి ధైర్యం చెప్పారు. కన్నీరుమున్నీరవుతున్న బాధిత కుటుంబాలను ఓదార్చి, బాధితుల భుజం తట్టి, కరచాలనం చేసి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మీడియాతో మాట్లాడుతూ కీలక అంశాలను వెల్లడించారు.

**బాధితులకు భరోసా - మెరుగైన వైద్యం..**

"ఈ ఘటన అత్యంత హృదయవిదారకం. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులతో సహా మొత్తం 15 మంది ఈ ప్రభావానికి లోనయ్యారు. ప్రస్తుతం 8 మంది బాధితులు చికిత్స పొందుతుండగా, అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ కోలుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా బాధితులకు రూ. 10 లక్షల పరిహారం ప్రకటించారు. వైద్యానికి అయ్యే ప్రతి పైసా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపినట్లు" మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

**ప్రత్యేక వైద్య బృందం - 'ఫోమి ఫీజోల్' డ్రగ్..**

డాక్టర్ సుధాకర్ నేతృత్వంలో కిమ్స్ ఆస్పత్రిలో బాధితులకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. ఈ విభాగంలో నిపుణుడైన డాక్టర్ రవిరాజా పర్యవేక్షణలో బాధితులకు చికిత్స అందిస్తున్నామని అన్నారు. ఇటువంటి సమస్యలకు సమర్థవంతంగా పనిచేసే 'ఫోమి ఫీజోల్' అనే డ్రగ్ వాడకం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఎంతో చొరవ చూపి ఈ మెడిసిన్ అందుబాటులోకి తెప్పించారని మంత్రి దుర్గేష్ కొనియాడారు.

**కల్తీ రాయుళ్లకు మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరిక..**

కల్తీకి కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరినీ వదిలే ప్రసక్తి లేదు. ఇప్పటికే నమూనాలు సేకరించాం, నివేదికలు రాగానే బాధ్యులపై ఉక్కుపాదం మోపుతాం. వ్యాపారస్తులు ప్రజల ఆరోగ్యంతో ఆటలాడకూడదు, నిర్దేశిత ప్రమాణాలను పాటించాల్సిందే. నిబంధనలు అతిక్రమిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని మంత్రి దుర్గేష్ హెచ్చరించారు.

**భవిష్యత్తు ప్రణాళిక..**

విశాఖలో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందడం బాధాకరం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తోంది. పరీక్షల నిమిత్తం వేరే రాష్ట్రాలకు వెళ్లకుండా, రాజమహేంద్రవరంలోనే అత్యాధునిక టెస్టింగ్ సెంటర్ నెలకొల్పాలన్న విజ్ఞప్తిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్తానని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వ్యాఖ్యానించారు. ప్రజలు కూడా ఆహారం, పాలు, నీరు విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సురక్షితమైన ఆహారాన్ని తీసుకోవాలని మంత్రి దుర్గేష్ సూచించారు. జిల్లా యంత్రాంగం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోందని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.



# మార్చి 14న జాతీయ లోక్ అదాలత్

**- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా..**

**- జాతీయ న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 26:** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా మార్చి 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించ బడనున్నట్లు జాతీయ న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు తదితర అంశాలకు సంబంధించిన వివాదాలను వేగవంతంగా, సఖ్యతా పూర్వకంగా పరిష్కరించు కోవచ్చునని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ ద్వారా ముగించుకోవాలని ఆమె సూచించారు.

# టెన్త్ విద్యార్థులు.. శ్రద్ధగా రివిజన్ చేసుకోవాలి

**- డీవైఈఓ దిలీప్ కుమార్**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 26:** టెన్త్ పరీక్షలకు ఇక రెండు వారాలే సమయం ఉందని, ప్రణాళికా బద్ధంగా రివిజన్ చేసుకోవాలని కొవ్వూరు డివిజన్ డీవైఈఓ బీ దిలీప్ కుమార్ విద్యార్థులకు హితవు పలికారు. చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పది విద్యార్థుల ప్రత్యేక తరగతులను, రివిజన్ టెస్టుల ఫలితాలను సమగ్రంగా పరిశీలించి సూచనలు చేశారు. ప్రాథమిక స్థాయిలో అమలవుతున్న జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక స్థాయిలో "గ్యారంటీడ్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (జీఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని, 75 రోజుల ప్రణాళిక అన్ని పాఠశాలల్లోనూ అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పీ విజయ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అల్లా ఆశీసులు అందరిపై ఉండాలి

**- రాయల్ మసీదులో ఇఫ్తార్ విందుకు హాజరైన సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 26:** ఆ అల్లా ఆశీసులు అందరిపై ఉండాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ఆకాంక్షించారు. స్థానిక మెయిన్ రోడ్డులో వన్ టౌన్ పోలీసు స్టేషన్ పక్కన ఉన్న రాయల్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, అల్ సమి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహమ్మద్ అబ్దుల్లా, మసీదు కమిటీ సభ్యులు తదితరులతో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అక్కడ జరిగిన ముస్లింల మతపరమైన ప్రార్థనల్లో పాల్గొని అనంతరం ఇఫ్తార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల అభివృద్ధి కేవలం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. అన్ని మతాలను ఏకం చేసేదే ఈ పవిత్రమైన ఇఫ్తార్ విందు అని అన్నారు. ఈ పవిత్ర మాసంలో ఉపవాసం, ప్రార్థనలు మనల్ని ఆత్మ విశ్వాసం, కరుణ, సోదరత్వం వైపు నడిపిస్తాయన్నారు. రంజాన్ మనకు బోధించే సత్యం ఏమిటంటే... మనం అందరూ ఒకే దేవుని సృష్టులం, భగవంతుని మార్గంలో ఐక్యంగా నడవాలని సూచిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఈ సోదరత్వాన్ని పెంచుతోందని, మతం, కులం, మతపరమైన విభేదాలను మరచి.. పేదలు, రైతులు, యువత, మహిళల అభివృద్ధికి కృషి చేస్తుస్తోందన్నారు. ఈ రంజాన్ రాష్ట్రంలో శాంతి, సమృద్ధి, ఐక్యతను తీసుకువస్తుందని నమ్ముతున్నామన్నారు. తన సోదరులైన ముస్లిం మైనారిటీలంతా ఆరోగ్యం, సుఖశాంతులతో జీవించాలని ఆ అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. కాగా నగరంలోని పలు మసీదులు, షాదీ ఖానాల అభివృద్ధికి తమ భవానీ చారిటబుల్ ట్రస్టు తరపున నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్టు తెలిపారు. నగరంలోని మసీదులు, షాదీ ఖానాలకు, ముస్లిం బరియల్ కు ఇప్పటికే కమిటీలు నియమించినట్టు తెలిపారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తామని స్పష్టం చేశారు. అన్ని విషయాల్లోనూ ముస్లింలతో కలిసి ముందుకు నడుస్తామని, వారికి అండగా ఉంటామన్నారు. మత సామరస్యాన్ని కాపాడటమే కాకుండా అన్ని విధాలుగా ముస్లిం మైనారిటీలను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముస్లింల అభివృద్ధికి కృషి చేసింది ఒక్క తెలుగుదేశం మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, అధిక సంఖ్యలో ముస్లింలు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు డిప్యూటీ మేయర్ గా కర్రి శ్రీనివాసరావు ఏకగ్రీవ ఎన్నిక

**డిప్యూటీ మేయర్ గా ఎన్నికైన కర్రీ శ్రీనివాసరావుకు అధికారికంగా ధృవపత్రాన్ని అందించిన ఇన్ఛార్జి జాయింట్ కలెక్టర్, ప్రత్యేక అధికారి వి.విశ్వేశ్వరరావు...**



**ఏలూరు, ఫిబ్రవరి 26(మనసులో మాట)..** స్థానిక ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన డిప్యూటీ మేయర్ ఎన్నికను రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు మేరకు డిఆర్ఓ, ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ ప్రత్యేక అధికారి వి.విశ్వేశ్వరరావు ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. ఏలూరు డిప్యూటీ మేయర్ గా కర్రీ శ్రీనివాసరావును 30 వ వార్డు కార్పొరేటర్ పప్పు ఉమా మహేశ్వరరావు ప్రతిపాదించగా 28వ వార్డు కార్పొరేటర్ తంగిరాల అరుణ బలపరచడం జరిగింది. ఇతర కార్పొరేటర్లు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయని కారణంగా ఏలూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ గా కర్రీ శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డిఆర్ఓ, ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ ప్రత్యేక అధికారి వి.విశ్వేశ్వరరావు ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి ), నగర మేయర్ షేక్ నూర్జహాన్ కౌన్సిల్ కార్పొరేట్ సభ్యులు సమక్షంలో డిప్యూటీ మేయర్ గా ఎన్నికైన కర్రీ శ్రీనివాసరావుకు అధికారికంగా ధృవపత్రాన్ని అందజేశారు.

గతంలో డిప్యూటీ మేయర్లు గా పప్పు ఉమామహేశ్వ రరావు, కర్రి శ్రీనివాస రావులను చెరి సగం రోజులు చేయాలనేది ఒప్పందమన్నారు. ఈ మేరకు ఉమామహేశ్వర రావు పదవీ కాలం పూర్తయిన నేపథ్యంలో ఆయన తన పదవికి రాజీనామా చేయడం వలన నేడు డిప్యూటీ మేయర్ గా కర్రీ శ్రీనివాసరావు ఎన్నిక జరిగింది.

ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ ఏలూరు అభివృద్ధిలో నూతనంగా ఎన్నికైన డిప్యూటీ మేయర్ కర్రీ శ్రీనివాసరావు అభినందిస్తూ పార్టీలకు అతీతంగా పనిచేస్తూ ఏలూరు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ ఏకగ్రీవంగా నూతనంగా ఎన్నికైన కర్రీ శ్రీనివాసరావును అభినందించారు. డిప్యూటీ మేయరుగా శ్రీనివాసరావు ఏలూరు నగరపాలక సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

నూతనంగా ఎన్నికైన డిప్యూటీ మేయర్ కర్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. నాపై ఎంతో నమ్మకం ఉంచి ఎన్నుకున్న నగరపాలక సంస్థ కౌన్సిల్ కార్పొరేట్ సభ్యులందరికీ, స్థానిక శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) నగర మేయర్ షేక్ నూర్జహాన్ కు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.



## ఏపీ ఆర్ సెట్ లో చిలుకూరికి 14 వ ర్యాంకు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 26:** ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ నిర్వహించిన రీ చర్చ్ సెట్లో కడియం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు రాష్ట్ర వ్యాప్తంగా 14వ ర్యాంకు సాధించారు. రాష్ట్రంలో 17 విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పీహెచ్డీ సీట్లు భర్తీ చేసేందుకు 2025 నవంబర్లో ఏపీఆర్ సెట్ నిర్వహించారు. అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిబ్రవరి నెలలో మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి నేతృత్వంలో పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఈ పరీక్షలు నిర్వహించి బుధవారం రాత్రి ఫలితాలు వెల్లడించింది. అత్యుత్తమ మార్కులు సాధించిన శ్రీనివాసరావు తెలుగు విభాగంలో 14 ర్యాంకు కైవసం చేసుకున్నారు. చిలుకూరి ప్రస్తుతం పందలపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

### బిజెపి ఫ్లోర్ లీడర్ ఎమ్మెల్సీ సోము వీర్రాజు పై


## వైసీపీ దాడి సిగ్గుచేటు

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం



**కొత్తపేట మనసులో మాట ఫిబ్రవరి 26..** బిజెపి ఫ్లోర్ లీడర్ సోము వీర్రాజు పై వైసీపీ ఎమ్మెల్సీలు దాడులు సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సబ్యులు పాలూరిసత్యానందం ఖండించారు.
సీనియర్ సభ్యుడిపై ఇలాదాడులకు దిగడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధమని విమర్శించారు. సభలో మహిళా మంత్రులు అని కూడా చూడకుండా వైసీపీ సభ్యులు ప్రవర్తించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
రాయలసీమ ఎత్తిపోతల పథకంపై చర్చ సందర్భంగా మైకు తీసుకొని మాట్లాడే సమయంలో ప్రశ్న అడగకుండా అడ్డుకునేందుకు మైకు లాక్కొనడానికి ప్రయత్నించి సోముపై వైసీపీ ఎమ్మెల్సీలు చేసిన దాడి ప్రజలు చూస్తున్నారు.ప్రజలు మీపార్టీకి చమరగీతం పాడిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు మీతీరు మార్చుకోలేదని అన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రశ్నించే గొంతును అడ్డు కుంటే చూస్తూ ఊరుకోమని మానాయకుడుకి తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## పైప్ లైన్ లీకేజీలలో సేద తీరుతున్న గ్రామ సింహం



**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 26..** ప్రజల ప్రాణాల మీద వచ్చాక అధికారి స్పందించే కన్నా రాకుండా ముందే చర్యలు తీసుకుంటే బాగుంటుందని తూరంగి మాజీ ఎంపిటిసి పితాని వెంకట రాము పత్రిక ముఖంగా డిమాండ్ చేసారు. కాకినాడ రూరల్ తూరంగి గ్రామం లోని బుల్లబ్బాయి రెడ్డి నగర్ నుండి గ్రామంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు పంపింగ్ జరిగేతప్పుడు నీరు వృధాగా బయటకు పోతుంది. ఈ నీటిలో గ్రామ సింహాలు (కుక్కలు)లే కాకుండా ఇతర కార్యక్రమాలకు కూడా ఈ నీరు ఉపయోగపడుతుంది. ఇలాంటి కలుషితమైన నీటిని పంపిణీ చేయడం వలన ఏదైనా హానికర రసాయనం కానీ కలిస్తే ప్రజల ఆరోగ్యాలకు ఎవరు బాధ్యత వహిస్తారు.? ఇలాంటి అత్యవసర పనులను ఆలస్యం చేస్తే గ్రామ ప్రజలు అనారోగ్యం పాలై అనేక ఇబ్బందులు ఎదురయ్య పరిస్థితి ఏర్పడుతుందని గ్రాస్తులు ఆందోళన చెందుతున్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తక్షణం స్పందించి పైపులైన్ల మరమ్మత్తులు చేసి గ్రామ ప్రజలకు మంచినీటి సౌకర్యం అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## పెండింగ్లో ఉన్న కుటుంబ సర్వేను 28 కి పూర్తి చేయాలి - కలెక్టర్



**అమలాపురం(మనసులో మాట) ఫిబ్రవరి 26:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏకీకృత కుటుంబ సర్వే లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 96,150 కుటుంబాల సర్వేను ఈ నెల 28 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించా రు. గురువారం ఆయన జిల్లాలోని జిల్లా స్థాయి అధికారులు ఎంపీడీవోలు డివిల్ డి ఓ లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వ హించి ఏకీకృత కుటుంబ సర్వే, అక్షర ఆంధ్ర, మార్చి ఒకటో తేదీ ఆదివారం నేపథ్యంలో ముందు రోజైన ఈనెల 28 న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ జిల్లా అధికారులు ఎంపీడీవోలు సమన్వయం చేసుకొని క్లస్టర్ మ్యాపింగ్ లో ఉన్న సిబ్బందిని సక్ర మంగా వినియోగించుకొని ఏకీకృత కుటుంబ సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీల పరిధిలోని అన్ని రకాల కార్యదర్శులను విలేజ్ ఆర్గనైజేషన్ విఆర్వోలను ఈ సర్వే ప్రక్రియలో భాగ స్వా ములను చేస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరు కోవాలన్నారు. సిబ్బంది తక్కువగా ఉన్న మం డలాల్లో పక్క మండలాల సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. అంగ న్వాడీలు మహిళా పోలీసులు వెల్ఫేర్ అసిస్టెంట్లు ఏఎన్ఎంలు వ్యవ సాయ ఉద్యాన సహాయ కులను ఈ సర్వే ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమాలపై సమీక్షిస్తూ జిల్లా వ్యాప్తంగా నమోదైన 53,092 మంది వయో జనుల విద్య నేర్పడానికి 5,340 మంది వాలంటీర్లను నియ మించడం జరిగిందన్నారు. ప్రిలిమినరీ పరీక్ష ఈనెల 28 న నిర్వ హించాల్సిందిగా అనివార్య కారణాల మూ లంగా మా ర్చి 4వ తేదీకి మార్చడం జరి గిందన్నారు. వయోజనులకు మొత్తంగా గరిష్టంగా 100 గంటలు విద్యాబోధన చేయాల్సిండగా వీటిలో 15 గంటలు వీడియో తరగతులు నేర్పించాల్సి ఉందన్నారు. ఫైనల్ పరీక్షలు మార్చి 15 నిర్వ హించే లోపుగా పనిగంటల లక్ష్యాలు మేరకు విద్యా బోధన 45 గంటల పాటు భౌతికంగా పాఠ్యాంశాలు డిజిటల్ గా 15 గంటల పాటు తరగతులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యా బోధనలో వెనుకంజలో ఉన్నవారు ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్దేశిత కాల వ్యవధినాటికి కోర్స్ పూర్తి చేయాలన్నారు. విద్యా స్త్రీ సంక్షేమం శాఖలు పరీక్షా కేంద్రాలు కేటాయింపులో వయోజన విద్య నోడల్ అధికారి వారికి పూర్తిగా సహకరించాలన్నారు. అదే విధంగా డిఆర్డిఏ మెప్మా డ్రామా క్షేత్రస్థాయి సిబ్బంది వాలం టీర్లుగా నియమించడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రాథమిక పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా గుర్తించాలన్నారు. ఇన్విజిలేటర్లుగా అంగన్వాడి సిబ్బందిని గ్రామ ఆర్గనైజేషన్ సిబ్బందిని ఎంపిక చేయాల న్నారు. 53 వేల 92 మంది నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సా ధించేలా సమిష్టి సమన్వ యం వహించాలని రానున్న మార్చి నెల ఒకటో తేదీ ఆదివారం సెలవు దినం కావున ఈనెల 28 వ తేదీనే ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ బ్యాంకుల నుండి నిధులు విత్డ్రా చేసి 28 వ తేదీ శనివారం పం పిణీ చేయాలని ఆ దిశ గా బ్యాంకర్ల సమన్వ యంతో క్షేత్రస్థాయి సిబ్బంది పటి ష్టమైన చర్యలను గైకొనా లన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సామర్లకోట పాల కేంద్రాల్లో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

**సామర్లకోట (మనసులో మాట) ఫిబ్రవరి 26;** కాకినాడ జిల్లా సామర్లకోట పాల కేంద్రాల్లో గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమండ్రిలో కల్తీ పాలు కారణంగా ప్రమాదం సంభవించడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు కాకినాడ ఫుడ్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ అధికారులు పట్టణ పరిధికి చెందిన పలు పాల కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. పాల కేంద్రాల నుండి పాల శాంపిల్స్ సేకరించారు. కాకినాడ జిల్లాలో పశువు సంపద తగ్గిపోయి, పాల ఉత్పత్తి పడిపోయినప్పటికీ సామర్లకోటలో మాత్రం పుట్టగొడుగులను తలపించేలా పాల కేంద్రాలు పోటాపోటీగా ఏర్పాటు అవుతూనే ఉన్నాయి. పట్టణ పరిధిలోని పలు పాల కేంద్రాలను ఫుడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ సుబ్బారావు ఆధ్వర్యంలో అధికారులు సందర్శించి పరిశీలన చేపట్టారు. కేవలం పాల శాంపిల్స్ని మాత్రమే సేకరించి, బాదంపాలు, పన్నీరు, ఇతర పాల ఉత్పత్తులు అమ్మకాలు సాగిస్తుండగా వాటిని శాంపిల్స్ సేకరించకపోవడం విచిత్రం. పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టవలసి ఉండగా తనిఖీలు మాత్రమే నిర్వర్తించినట్లు పట్టణ పరిధిలో సర్వత్తులు అవరోపిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు సామర్లకోట పెద్దాపురం తో సహా కాకినాడ జిల్లాలో పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ సుబ్బారావు తెలిపారు.

## రైతుల అదనపు ఆదాయానికి పాడీ పరిశ్రమ తోడ్పాటు



**కాజులూరు (మనసులో మాట) ఫిబ్రవరి 26..** రైతులు ఆర్థిక అభివృద్ధికి పాడి పరిశ్రమ తోడ్పటు నందిస్తుందని కాకినాడ జిల్లా పశు సంవర్ధక శాఖ జె డి ఏ డాక్టర్ కొలా కృష్ణమూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రమైన కాజులూరు పశు సమర్ధిక శాఖ ఆధ్వర్యంలో బస్సు వైద్యశాల ప్రాంగణంలో లేగదోడల ప్రదర్శన నిర్వహించారు ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా స్థాయి బస్సు సమర్ధిక శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జె డి ఏ డాక్టర్ కొలా కృష్ణమూర్తి సూచనలతో రైతుల అదనపు ఆదాయానికి పాడి పరిశ్రమ బాట వేస్తుందన్నారు.
రైతుల ఆర్థిక స్థిరత్వానికి పంటలతో పాటు పాడి పరిశ్రమ కూడా బలమైన ఆధారం అవుతుందని కాకినాడ జెడిఎ డాక్టర్ కొలా కృష్ణమూర్తి పేర్కొన్నారు. పాడి పరిశ్రమ ద్వారా ప్రతిరోజూ నగదు ప్రవాహం లభిస్తుందని, రైతులు పాల ఉత్పత్తితో పాటు లేగ దూడల పెంపకంపై దృష్టి సారిస్తే అదనపు ఆదాయం పొందవచ్చని ఆయన అన్నారు. రైతులు ఆధునిక పద్ధతుల్లో పశు సంవర్ధకాన్ని అభివృద్ధి చేసుకోవాలని, మంచి జాతి దూడలను ఎంపిక చేసుకుని పెంపకం చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పశు సంవర్ధక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.
ప్రత్యేకంగా "గోకులం" కార్యక్రమం ద్వారా రైతులకు నాణ్యమైన పశువుల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మంచి లేగ దూడల పెంపకం ద్వారా భవిష్యత్తులో అధిక పాలు ఉత్పత్తి చేసే ఆవులను తయారు చేసుకోవచ్చని వివరించారు. పశువుల పోషణ, టీకాలు, ఆరోగ్య పరిరక్షణ అంశాల్లో శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఉత్తమ లేగ దూడలను పెంచిన రైతులకు బహుమతులు అందజేశారు. ఈ బహుమతులు రైతుల్లో పోటీ భావన పెంచి, నాణ్యమైన పశుసంవర్ధకానికి దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.
రైతులు పంటలతో పాటు పాడి పరిశ్రమను అనుబంధ వృత్తిగా చేపట్టడం ద్వారా ఆదాయ వనరులు విస్తరించుకోవచ్చని, తద్వారా కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని జెడిఎ డాక్టర్ కొల్లా కృష్ణమూర్తి తెలిపారు. ఈ లేగదూడల ప్రదర్శనలో 54 లేగ దూడలు ప్రదర్శించగా ఉత్తమమైన లేగ దూడల యజమానులకు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ డిబిఆర్ అంబేద్కర్, డి యల్ డి ఎ డి డి కాంతారావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సిహెచ్ శ్రీరామ్ , వెటర్నరీ వైద్యాధికారులు సుదీర్ , కళ్యాణి, జాన్ పాల్ , స్థానిక సహకార సంఘ అధ్యక్షుడు యాళ్ల వెంకటరమణ మాజీ ఎంపీపీ కృష్ణారావు నీటి సంఘం అధ్యక్షుడు యాళ్ళ సత్యనారాయణ ఆత్మ డైరెక్టర్ వెలుగుబండ్ల శ్రీనివాసరావు కూటమి నాయకులు యాళ్ళ రవి , చోడిశెట్టి శ్రీనివాస్ పశుసంవర్ధక శాఖ సిబ్బంది పెద్ద ఎత్తున పాడి రైతులు పాల్గొన్నారు.

## ఆత్రేయపురం వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి



**కొత్తపేట మనసులో మాట ఫిబ్రవరి 26..** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసిపి అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి గురువారం ఆత్రేయపురం గ్రామంలో అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించిన వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో పాల్గొని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో భక్తులు గోవింద మాలలు ధరించి గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపారు.ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ, వెంకటేశ్వర స్వామి వారి కృపతో ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఇలాంటి బ్రహ్మోత్సవాలు భక్తి, సంప్రదాయాలు, సామాజిక ఐక్యతను మరింత బలపరుస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిలువు రామకృష్ణంరాజు, గాగ్రాజ్ రామకృష్ణంరాజు, చిలుకూరు నాగరాజు,గ్రామ నాయకులు, కార్యకర్తలు, తైదలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించటం లేదు..

### - రాజమండ్రి కల్తీ పాలు ఘటనపై బీసీవై పార్టీ ఆందోళన
### - బాధితులను పరామర్శించిన నేతలు - ప్రభుత్వానికి నేరుగా సవాల్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 26:** రాజమహేంద్రవరం కల్తీ పాలు ఘటన అత్యంత విషాదకరమని, ఈ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించటం లేదని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు అత్తిలి రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఆదేశాల మేరకు రాష్ట్ర పీఏసీ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్, జిల్లా, నగర కమిటీ సభ్యులు రాజమండ్రి నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కల్తీ పాలు బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా బీసీ వై పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యులు అత్తిలి రాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాలు నాణ్యతపై సమగ్ర తనిఖీలు చేపట్టకపోవడం వల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడిందన్నారు. మరో పీఏసీ సభ్యులు వడ్డి మల్లికార్జున ప్రసాద్ మాట్లాడుతూ రాజమండ్రి ఘటన తర్వాత కూడా ప్రత్యేక తనిఖీలు చేపట్టకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.
ప్రభుత్వానికి ప్రజల తరపున తమ పార్టీ పలు ప్రశ్నలు సంధిస్తోందని, సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పాలు నాణ్యతతో ఉన్నాయని ప్రభుత్వం ధైర్యంగా ప్రకటించగలదా? అని ప్రశ్నించారు. ప్రజా ఆరోగ్యంపై ఇప్పటి వరకు సమగ్ర నివేదిక ఎందుకు విడుదల కాలేదన్నారు.
రాజమండ్రి ఘటన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు.
**బీసీ వై పార్టీ డిమాండ్లు..**
రాష్ట్ర వ్యాప్తంగా పాల డైరీలు, చిల్లింగ్ ప్లాంట్లపై తక్షణమే స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. ప్రతి జిల్లాలో స్పెషల్ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ (ఎస్ఎఫ్ఎస్టీ) ఏర్పాటు చేయాలన్నారు. కల్తీకి పాల్పడిన వారిపై హత్య కేసులు నమోదు చేయాలని, కల్తీ పాలు వల్ల ప్రాణాలు కోల్పోతే రూ. 50 లక్షల నష్ట పరిహారం ప్రకటించాలన్నారు.
ప్రజల ప్రాణాలతో ఆడుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని బీసీ వై పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కన్వీనర్ వనుము శ్రీనివాస్ అధ్వర్యంలో రాష్ట్ర పీఏసీ కమిటీ సభ్యులు అత్తిలి రాజు, వడ్డి మల్లికార్జున ప్రసాద్, రాష్ట్ర డిప్యూటీ కమిటీ సభ్యుడు మట్ట ఈరబాబు, గౌడ్ మహిళా రాష్ట్ర కోకన్వీనర్ నాగేశ్వరి శ్రీ , కాకినాడ జిల్లా కన్వీనర్ రాయుడు నాగేశ్వరరావు పశ్చిమ గోదావరి జిల్లా కోకన్వీనర్ శివరాం, జిల్లా యూత్ కన్వీనర్ నీలపాల సాయి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

### వాడపల్లి ఆలయ నిత్య అన్నదాన పథకానికి,

## రూ. 5 లక్షలు విరాళం



**కొత్తపేట మనసులో మాట ఫిబ్రవరి 26.** కోనసీమ తిరుమల గా పేరుగాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదాన పథకానికి విజయవాడ, ప్రసాదంపాడు, చెందిన వెంకట దుర్గా స్టీల్స్, గంధం రాజేష్ కుమార్, దుర్గాదేవి, దంపతులు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు కు అందజేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం, చేయించారు. అర్చకులు ఆలయ విశిష్టత తెలిపి, వేదశీర్వచనం, తీర్థప్రసాదాలు స్వామి, చిత్రపటాన్ని అందజేశారు.

## అలయన్స్ శరవణ పబ్లిక్ పరీక్షల విద్యార్థులకు ప్రోత్సాహం



**కాకినాడ (మనసులో మాట ) ఫిబ్రవరి 26..** అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో కాకినాడలోని ఏఎంజీ స్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల దృష్ట్యా పరీక్షల రైటింగ్ ప్యాడ్లు, పెన్నులు పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు యాళ్ళ రత్నారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చందన సోబ్బవరపు విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం అందించారు. ఏపిజె అబ్దుల్ కలాం జీవితాన్ని ఉదాహరణగా చూపిస్తూ కష్టపడి పనిచేస్తే, క్రమశిక్షణతో ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని వివరించారు.క్లబ్ ఉపాధ్యక్షులు యడవిల్లి మురలీధర్ పరీక్షల భయాన్ని ఎలా అధిగమించాలో వివిధ ఉదాహరణలతో వివరించి విద్యార్థులను ఉత్తేజపరిచారు. క్లబ్ వ్యవస్థాపకుడు దిలీప్ కుమార్ సధనాని మాట్లాడుతూ ఇవి చిన్న కానుకలే అయినప్పటికీ వాటితో పాటు మా ఆశీర్వాదాలు, శుభాకాంక్షలు ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్యమైన మెట్టు అని, కష్టపడి చదివి ధైర్యంగా, నమ్మకంతో పరీక్షలు రాయాలని సూచించారు. కొవ్వూరి మునిరెడ్డి, ఆర్ రవిశంకర్ పట్నాయక్, సతీష్ నంబూరి విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరి మనోహర్ మలాది, శ్రీలక్ష్మి, పి విజయలక్ష్మి, మృణాల్ వర్మ మలాది, నంబూరి సత్యదేవి, ఉపాధ్యాయులు కె శ్రీను, ఎం సునిధి, జె కమల కుమారి, ఎన్ సుబ్రహ్మణ్యం, పి మధు బాబు కార్యక్రమానికి సహకరించారు.

## ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

### - వడ్లమూడి ప్రకాష్



**రాజోలు ఫిబ్రవరి 26 మనసులోమాట :** ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ వడ్లమూడి ప్రకాష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోన సీమ రాజోలు మండలం కడలి గ్రామంలో ఉన్న శ్రీమతి కాదంబరి సుందరమ్మ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల హై స్కూల్ ప్లస్ మహిళా కళాశాల నందు ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కడలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ ప్రసార కార్యక్రమం గురువారం జరిగింది. రాబోయే విద్యా సంవత్సరం కడలి మహిళా కళాశాలలో చదివేందుకు వడ్లమూడి శ్రీ లక్ష్మీ జ్యోతి మొదటి అడ్మిషన్ ఇవ్వడం జరిగింది. బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపిసి గ్రూపులు, తెలుగు ఇంగ్లీష్ మీడియం సీట్లు ఉన్నాయని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సెన్సస్2027కు డిజిటల్ శిక్షణకు శ్రీకారం

## - మూడు రోజుల శిక్షణ తరగతులు - రెండు దశల్లో జనాభా గణన.. 4,752 మంది సిబ్బంది అవసరం

## - యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, పెంఛన్ల పంపిణీపై జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ సమీక్ష






**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 26:** నేటి నుంచి నగర పాలక సంస్థలో నిర్వహణ

జిల్లాలో 2027 జనాభా గణన నిర్వహణకు సంబంధించి అధికారులకు మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ వై మేఘస్వరూప్ తెలిపారు. గురువారం బొమ్మూరు కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ నెల 27, 28, మార్చి 1 తేదీలలో రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ శిక్షణ జరగనుందని వెల్లడించారు. జనాభా గణనను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్న నేపథ్యంలో, సంబంధిత అధికారులకు డిజిటల్ అప్లికేషన్లపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

**రెండు దశల్లో జనాభా గణన..**

2027 జనాభా గణనను రెండు దశల్లో చేపడతామని తెలిపారు. మొదటి దశలో ఏప్రిల్ 2026 నుంచి సెప్టెంబరు 2026 వరకు హౌస్ లిస్టింగ్, గృహ లెక్కలు నిర్వహిస్తామని, రెండో దశలో ఫిబ్రవరి 2027లో జనాభా ఎన్యూమరేషన్ చేపడతామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా, పట్టణాల్లో వార్డును యూనిట్‌గా పరిగణించి గణన నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో 306 రెవెన్యూ గ్రామాలు, 132 వార్డులు కలిపి మొత్తం 438 యూనిట్లలో జనాభా గణన జరగనుందని చెప్పారు. జిల్లా సెన్సస్ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 25 చార్జీలు ఖరారు చేసినట్లు తెలిపారు. వీటిలో ఒక మున్సిపల్ కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలు, 21 గ్రామీణ మండలాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 2027 అంచనాల ప్రకారం 2,726 హెచ్‌ఎల్‌బీలు, పట్టణాల్లో 1,106 హెచ్‌ఎల్‌బీలు ఉండనున్నట్లు తెలిపారు.

**4,752 మంది సిబ్బంది అవసరం..**

జిల్లాలో 3,682 మంది ఎన్యుమరేటర్లు, 368 మంది రిజర్వ్‌తో కలిపి మొత్తం 4,050 మంది ఎన్యుమరేటర్లు అవసరమవుతారని తెలిపారు. అలాగే 638 మంది సూపర్వైజర్లు, 64 మంది రిజర్వ్‌తో కలిపి 702 మంది సూపర్ వైజర్లు అవసరమని చెప్పారు. మొత్తం 4,752 మంది సిబ్బంది అవసరమని వివరించారు. జిల్లాలో క్లిష్ట ప్రాంతాలు లేవని స్పష్టం చేశారు. అయితే రాజమహేంద్రవరం లాలా చెరువులోని గెయిల్ కార్యాలయం, ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ప్రాంతాలను ప్రత్యేక చార్జీలుగా గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సంబంధిత అధికారులను చార్జ్ అధికారులుగా నియమించినట్లు చెప్పారు.

**డిజిటల్ విధానంలో నిర్వహణ..**

సెన్సస్2027 నిర్వహణకు సీఎంఎంఎస్ వెబ్ ఆధారిత వేదికను వినియోగించనున్నట్లు తెలిపారు. హెచ్‌ఎల్‌బీ క్రియేటర్ యాప్ ద్వారా ప్రతి హెచ్‌ఎల్‌బీకి జియోట్యాగింగ్ చేసి సరిహద్దులు గుర్తించనున్నట్లు చెప్పారు. హెచ్‌లో యాప్ ద్వారా ఎన్యుమరేటర్లు గృహలెక్కింపు, గృహ వివరాల సేకరణను డిజిటల్‌గా నమోదు చేయగా, సూపర్ వైజర్లు పురోగతిని పర్యవేక్షించి డేటా నాణ్యతను నిర్ధారిస్తారని వివరించారు.

**ఇతర అంశాలపై సమీక్ష**

డీడీఓ ఖాతాల్లో ఉన్న అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వెంటనే క్లెయిమ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ట్రెజరీ అధికారి, లీడ్ బ్యాంక్ మేనేజర్ సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలను రీఓపెన్ కాకుండా సమగ్రంగా పరిష్కరించాలని, పరిష్కారం సాధ్యం కానప్పుడు స్పష్టమైన కారణాలతో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. హెచ్‌ఓడీలు ఎండార్స్‌మెంట్‌లను పరిశీలించాలని ఆదేశించారు. జీఎస్ డబ్ల్యూఎస్ సేవలు, అన్నా క్యాంటీన్లలో ఆహార నాణ్యత, పారిశుధ్యం, పెన్షన్ల పంపిణీ, చెత్త సేకరణ, మ్యుటేషన్లు తదితర ప్రజా సేవలపై సానుకూల ప్రజాభిప్రాయాన్ని మెరుగుపరచాలని సూచించారు.

**యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పూర్తి చేయాలి..**

జిల్లాలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను వారం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం 81 శాతం పూర్తైందని తెలిపారు. రాజమండ్రి రూరల్, నల్లజర్ల, దేవరపల్లి, తాళ్లపూడి, ఉండ్రాజవరం, రాజానగరం మండలాల్లో ప్రత్యేక కార్యాచరణతో 100 శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో లెర్నర్స్ రిజిస్ట్రేషన్ లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. మండపేట, రాజమండ్రి రూరల్, దేవరపల్లి మండలాల్లో నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. మార్చి 1 ఆదివారం కావున ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను ఈ నెల 28న పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 27న బ్యాంకుల నుంచి నగదు ఉప సంహరణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న పట్టాదారు పాసు పుస్తకాలను గ్రామ సభల ద్వారా పరిశీలించి, ఎటువంటి పొరపాట్లు లేకుండా పంపిణీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి టీ సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే భాస్కర్ రెడ్డి, ఎంఆర్ఆర్ ప్రేమ్ కుమార్, సీపీఓ ఎల్ అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.



### ఐబీసీ జిల్లా అధ్యక్షులుగా


# జాన్ ప్రసాద్ నియామకం

**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 26..** ఇండిపెండెంట్ బిషప్స్ కౌన్సిల్ ఇండియా కాకినాడ జిల్లా అధ్యక్షులుగా బిషప్ డా.జి.జాన్ ప్రసాద్ ఎంపికయ్యారు. ఇండిపెండెంట్ బిషప్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జాతీయ సమావేశం గురువారం జరిగింది. ఐసిఎఫ్ జాతీయ అధ్యక్షులు బిషప్ డా జార్జ్ శ్రీమంతుల ఆధ్వర్యంలో జాతీయ సేవారత్న జనావళి సంస్థల డైరెక్టర్ రెవ డా మందపల్లి శ్యామ్ నేతృత్వంలో కెవీపీఎఫ్ గౌరవ చైర్మన్ బిషప్ డా జి జాన్ ప్రసాద్ ని ఇండిపెండెంట్ బిషప్స్ కౌన్సిల్ కాకినాడ జిల్లా ప్రెసిడెంట్ గా ఎంపికయ్యారు.జాన్ ప్రసాద్ నియామకం పట్ల కెవీపీఎఫ్ కమిటీ, దైవజనులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో పాస్టర్ జాన్ ప్రసాద్,ఉపాధ్యక్షుడు వి.విజయకుమార్, సెక్రటరీ మట్టపర్తి శ్రీనివాస్ గిడియన్, వి.జోసెఫ్ అంద్రూస్,ఎ స్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

# రావులపాలెంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు



**కొత్తపేట మనసులో మాట ఫిబ్రవరి 26..** ఇటీవల రాజమండ్రిలో కల్తీ పాలు సేవించి కొందరు మృతిచెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోనసీమ జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టారు. కోనసీమ జిల్లా ఆహార భద్రత అధికారి (ఫుడ్ ఇన్స్పెక్టర్) యేపూరి రామయ్య ఆధ్వర్యంలో రావులపాలెం పట్టణంలోని పలు పాల కేంద్రాలు, మిల్క్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాలు నిల్వ విధానం, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. పలు కేంద్రాల నుంచి పాలు శాంపిళ్లు సేకరించి ప్రయోగశాలకు పంపించినట్లు అధికారులు తెలిపారు. ల్యాబ్ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నమూనాల్లో విషపదార్థాలు లేదా కల్తీ పదార్థాలు ఉన్నట్లు తేలితే సంబంధిత అమ్మందారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు నాణ్యమైన పాలను మాత్రమే వినియోగించాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆహార భద్రతాధికారులు సూచించారు. ఇటీవలి ఘటనల నేపథ్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లో తనిఖీలు కొనసాగనున్నట్లు తెలిపారు.




# పాత మిత్రుడికి ఒడిస్సా గవర్నర్ హరిబాబు ఫోన్

**అమలాపురం (మనసులోమాట) ఫిబ్రవరి26:** పదవులు వస్తాయి.. పోతాయి.. కానీ పాత మిత్రులను, తోటి కార్యకర్తలను గుర్తుంచుకునే గుణం కొందరికే ఉంటుంది. ఒడిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు సరిగ్గా అదే బాటలో నడిచారు. ఈ నెల 28, మార్చి 1వ తేదీల్లో అమలాపురం కిమ్స్ ప్రాంగనంలో జరగనున్న ప్రపంచ తెలుగు సభల మహోత్సవంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. అమలాపురం వస్తున్న సందర్భంగా, పూర్వపు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు కి స్వయంగా ఆయన ఫోన్ చేసి పలకరించడంతో మోకా సుబ్బారావు ఆనందానికి అవదులు లేవు. ఒక రాష్ట్రానికి గవర్నర్ స్వయంగా తనకు పోన్ చేసి అమలాపురం వస్తున్నాను ఆరోజు అందుబాటులో ఉండాలి అని గవర్నర్ కోరడంతో సుబ్బారావు ఆశ్చర్యంతో పాటు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. నిజమైన నాయకత్వానికి, ఆత్మీయతకు నిదర్శనం ఇదేకదా అని పలువురు గవర్నర్ హరిబాబుని మెచ్చుకుంటున్నారు.

# నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు

**కాకినాడ (మనసులో మాట )ఫిబ్రవరి 26..** పదోతరగతి ఆపై ఉత్తీర్ణులైన అయిన విద్యార్థులకు ప్రముఖ కేంద్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన సంస్థ ద్వారా యూఏఈ దుబాయ్ లో మంచి జీతంతో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని దీనికి మార్చి 1, వ తేదీన కాకినాడ నాగార్జున ఫెర్టిలైజర్స్ రోడ్డులో గల ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశామని నిర్వాహకుడు రత్నంరాజు గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఇంకా వివరాలకు 9666577668.ఫోన్ చేయాలని తెలిపారు.

# చిత్రాడలో చురుగ్గా జనసేన సభ్యత్వ నమోదు ..



పిఠాపురం, ( మనసులో మాట) ఫిబ్రవరి 26: చిత్రాడ గ్రామంలో 11వ వార్డు ఇంచార్జ్ పిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురికి నూతన సభ్యత్వాలు అందించి, పాత వాటిని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు "ఉద్యమి, సాధక్, ప్రదాత"లుగా కదలాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం కోసం ప్రతి జనసైనికుడు బాధ్యతగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### లఘు చిత్రాల నిర్వహణలో రాజోలు వాసి

# కోటేశ్వరరావుకు బెస్ట్ ఫిలిం మేకర్ అవార్డు



**రాజోలు ఫిబ్రవరి 26 మనసులో మాట:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు పట్టణానికి చెందిన రచయిత బుడితి కోటేశ్వరరావు బెస్ట్ ఫిలిం మేకర్ అవార్డును అందుకు న్నారు. హైదరాబాదులోని లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "గ్లోబల్ ఇండీ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ఇండియా" (జి.ఐ.ఎఫ్.ఎఫ్.ఐ) మరియు "దాశరథి థియేటర్" సంయుక్త నిర్వహణలో ఈ అవార్డును అందుకున్నారు. దేశ విదేశాల నుంచి ఎంపిక కాబడిన వివిధ షార్ట్ ఫిలిమ్/ ఫీచర్ ఫిలిమ్ మేకర్స్ కు అభినందన సత్కారాలతో పాటు "బెస్ట్ ఫిలిం మేకర్" అవార్డులను తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖుల చేతుల మీదుగా అందించారు. తెలుగు సినీ దర్శకుడు రామ్ రావుపల్లి సభ నిర్వహణలో అవార్డులు అందుకున్నారు. వీరిలో తెలుగు వారు 22 మంది విజేతలకు ప్రసిద్ధ తెలుగు సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, వి ఎన్ ఆదిత్య, చంద్ర మహేష్, రాజా వన్నంరెడ్డి, సినీ రచయిత నివాస్, దూరదర్శన్ స్టార్ యాంకర్ విజయ దుర్గ, నటుడు రచయిత సాధనాల వెంకటస్వామి నాయుడు తదితరులు సమక్షంలో ఈ అవార్డులను తీసుకున్నారు.
ఈ అవార్డుల్లో 600 పైగా లఘు చిత్రాలు కాంపిటీషన్కు వచ్చాయి. వీటిలో 34 లఘు చిత్రాలను ఎంపిక చేశారు. రాజోలు గ్రామానికి చెందిన బుడితి కోటేశ్వరరావు రచించిన ఓటుకు నోటు, నీదేం కులం రా అనే లఘు చిత్రాల్లో ఓటుకు నోటు ఉత్తమ లఘు చిత్రంగా ఎంపికైంది. ఈ లఘు చిత్రానికి అవార్డు తీసుకున్నానని, సభా నిర్వహణలో దాశరథి థియేటర్ కార్యదర్శి బీడీఎల్ సత్యనారాయణ ఎంతగానో సహకరించారని కోటేశ్వరరావు తెలిపారు.

### శ్రీ సంపత్ విజయ్ వినాయక దేవస్థానంలో

# వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



**కాకినాడ (మనసులో మా ఫిబ్రవరి 26 ..** దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయం ఆవరణలో గల శ్రీ సంపత్ విజయ్ వినాయక దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. శ్రీ సంపత్ విజయ్ గణపతి దేవస్థానం ప్రాంగణంలో ధ్వజస్తంభ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది.

యంత్ర స్థాపన, దేవాలయ బలి, శిఖర కలశాభిషేకం పూజల అనంతరం ఆలయానికి వేలాదిగా హాజరైన భక్తుల కోలాహలం మధ్య వేదపండితుల మంత్రోచ్చారణలతో 30 అడుగుల ధ్వజ స్తంభాన్ని పైకి లేపి ప్రతిష్ఠించారు. దేవాదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ డి.ఎల్. వి రమేష్,డిఇఓ కే. నాగేశ్వరరావు,డిఇఓ ఎస్. సుబ్బారావు, కాకినాడ జిల్లా ఆలయ తనిఖీ అధికారి ఫణేంద్ర కుమార్ ఈవో ఇ.ఇ శ్రీనివాసరావు, ఆలయ ప్రధాన అర్చకులు జోగయ్య శాస్త్రి,ప్రసాద్ , దాతలు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ రమేష్ మాట్లాడుతూ2005 లో దేవాదాయ ధర్మాదాయ శాఖ సిబ్బంది ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. మూడేళ్లుగా ప్రతి బుధవారం భక్తులకు అన్నదానం చేపట్టడం జరుగుతోందని తెలిపారు. మునుగుంట అచ్యుత రామయ్య ట్రస్ట్ కు ప్రతి నెల అద్దె చెల్లించడం జరుగుతుందన్నారు.
ఈ ఆవరణలో దేవాదాయ ధర్మదాయశాఖ, తనిఖీ అధికారి కార్యాలయం తో పాటు పలు కార్యాలయాలు ఉన్నాయని తెలిపారు. వినాయకుడు ఆశీర్వాదంతో ధ్వజస్తంభాన్ని విజయవంతంగా ప్రతిష్టించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ ఉదయ్ కుమార్, ఈవో వి. శ్రీనివాస రామచంద్రరావు,
ఆర్. రాజేశ్వరరావు, సంగీతం ఎన్. సత్యనారాయణ, సోమరాజు వేణు, శ్రీనివాస్,శివ,ఎం.ఏవీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు

# ముస్లిం మైనారిటీలకు అండగా కూటమి ప్రభుత్వం

## - రహమత్ నగర్ మసీదులో ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 26:** ముస్లిం మైనారిటీలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని, అలాగే ఆ అల్లా ఆశీసులు అందరిపై ఉండాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక రహమత్ నగర్ మసీదులో గురువారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. జనసేన పార్టీ రాజమండ్రి ఇన్‌ఛార్జ్ అత్తి సత్యనారాయణ, అల్ సమి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహమ్మద్ అబ్దుల్లా, మసీదు కమిటీ సభ్యులు తదితరులతో కలసి ఇఫ్తార్ విందు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల అభివృద్ధి కేవలం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. అన్ని మతాలను ఏకం చేసేదే ఈ పవిత్రమైన ఇఫ్తార్ విందు అని అన్నారు. కాగా నగరంలోని పలు మసీదులు, షాదీ ఖానాల అభివృద్ధికి తమ భవానీ చారిటబుల్ ట్రస్టు తరపున నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్టు తెలిపారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, అధిక సంఖ్యలో ముస్లింలు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కుష్టు రోగులకు నిర్వహించిన మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ



**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 26..** మూవ్ మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్, కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో అధ్యక్షులు ఎండి హలీమ్ నాయకత్వములో హిందూ స్మశానవాటిక కు సమీపంలో నివాసముంటున్న 50 మంది కుష్ఠ రోగుల గాయాలకు గురువారం డ్రెస్సింగ్ కార్యక్రమం నిర్వహించారు . ప్రతీ నెల 15 రోజులకు ఒక సారి జరుగు డ్రెస్సింగ్ కార్యక్రమం లోపలువురు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నకు ఎంపీజే ఎగ్జిక్యూటివ్ మెంబెర్ రిటైర్డ్ గజెట్టెడ్ హెడ్మాస్టర్ షేక్ నూరుద్దీన్ 2500 రూపాయలు సభ్యురాలు షేక్ ఖైరున్నిసా 500 రూపాయలు డ్రెస్సింగ్ మెటీరియల్ మరియు స్నాక్స్ కొరకు ఆర్థిక సహాయం చేశారు. డ్రెస్సింగ్ అనంతరము లెప్రసి పేషెంట్స్ కు స్నాక్స్ రూపములో బన్నులు, అరటి పండ్లు పంపిణి చేయడం జరిగినది. కార్యక్రమం చివరిలో లెప్రసి పేషెంట్ ల సంఘ అధ్యక్షులు నరసింహ మూర్తి మాట్లాడుతూ ఎంపీజే సంస్థ సభ్యులు నెలకు రెండు సార్లు తమ కాలని లో ఉన్న రోగులకు డ్రెస్సింగ్ చేసి పౌష్టిక ఆహారమైన స్నాక్స్ పంపిణి చేయడం చాలా అభినందనీయ మని కొనియాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు హలీమ్, సెక్రటరీ షబ్బీర్ , గౌరవ సభ్యులు దౌలానా బాషా, షాకీర్, ఖైరున్నిసా, పావని, అల్లాహ్ బాషా, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శస్త్ర చికిత్స వైద్య శిబిరం



**కిర్లంపూడి (మనసులో మాట) ఫిబ్రవరి 26..** కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడిలో శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం నందు పరమహంస యోగానంద వేమగిరి ఆసుపత్రి ప్రముఖ వైద్యుల బృందం కిర్లంపూడి పరిసర గ్రామాల నుండి తరలివచ్చిన వారికి నేత్ర పరీక్షలు నిర్వహించారు.రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఆపరేషన్ అవసరం ఉన్నవారిని వేమగిరి ఆసుపత్రికి తీసుకువెళ్లి ఆపరేషన్ అనంతరం వారి స్వగ్రామాలకు పంపిస్తామన్నారు.ఈ శిబిరం నందు సత్యసాయి సేవా సమితి సభ్యులు భోజనం ఏర్పాట్లతో పాటు ప్రత్యేక సేవలు అందించారు.శ్రీ సత్యసాయి సేవా సమితి సేవలను పలువురు ప్రశంసించారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## ఒక రోజు ముందుగానే 2026 మార్చి నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

- లబ్ధిదారులకు ఈ నెల 28న ఇంటి వద్దే పింఛను సొమ్ము..
- జిల్లాలో 2.68 లక్షల మందికి రూ.117.02 కోట్ల పింఛను సొమ్ము పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు..
- తొలిరోజే నూరు శాతం పింఛన్ల పంపిణీకి అధికారులు కృషి చేయాలి.
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్.

**కాకినాడ( మనసులో మాట) ఫిబ్రవరి 26..** 2026 మార్చి నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణి కార్యక్రమాన్ని ఒకరోజు ముందుగానే ఫిబ్రవరి 28న నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సామాజిక భద్రత కింద జిల్లాలో ఎన్టీఆర్ భరోసా 2026 మార్చి నెల 1వ తేదీ ఆదివారం కారణంగా అవ్వ తాతలకు, దివ్యాంగులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇతర పింఛనుదారులకు ఒకరోజు ముందుగానే ఫిబ్రవరి 28న సొమ్ము పంపిణీ చేసేందుకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో 2026 మార్చి నెలకు సంబంధించి కాకినాడ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద 2,68,958 మందికి రూ.117.02 కోట్లు పంపిణీకి సర్వం సిద్ధం చేశామన్నారు. ఇందుకు క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసామన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శనివారం ఉదయం 6.30 గంటల నుంచే సచివాలయం సిబ్బంది పింఛను దారులకు తమ ఇంటి వద్దనే సొమ్ము అందజేయడం జరుగుతుందన్నారు. తొలి రోజే నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

జిల్లాలో మండలాల వారీగా పింఛను దారులు వివరాలు.. గండేపల్లి మండలం 8,278 పింఛనుదారులకు రూ. 3.63 కోట్లు,

గొల్లప్రోలు మండలం 7,544 ఫింఛనుదారులకు రూ.3.28 కోట్లు, గొల్లప్రోలు అర్బన్ 2,826 ఫింఛనుదారులకు రూ.1.21 కోట్లు,జగ్గంపేట మండలం 11,874 పింఛనుదారులకు రూ.5.23 కోట్లు, కాజులూరు మండలం 9,756 పింఛనుదారులకు రూ. 4.22 కోట్లు, కాకినాడ రూరల్ 18091 పింఛను దారులకు రూ. 7.79 కోట్లు, కాకినాడ అర్బన్ 29053 పింఛను దారులకు రూ. 12.66 కోట్లు, కరప మండలం 11,138 పింఛను దారులకు రూ. 4.81 కోట్లు, కిర్లంపూడి మండలం 10,922 ఫింఛనుదారులకు రూ. 4.87 కోట్లు,

కోటనందూరు 7,594 పింఛను దారులకు రూ.3.32కోట్లు,కొత్తపల్లి 12,333 పింఛను దారులకు రూ. 5.24 కోట్లు, పెదపూడి మండలం 10263 పింఛనుదారులకు రూ. 4.37 కోట్లు, పెద్దాపురం 11,430పింఛను దారులకు రూ.4.92 కోట్లు,పెద్దాపురం అర్బన్ 5,967 పింఛను దారులకు రూ .2.60 కోట్లు, పిఠాపురం 10,871పింఛను దారులకు రూ. 4.65 కోట్లు,పిఠాపురం అర్బన్ 5,566 ఫింఛనుదారులకు రూ. 2.41 కోట్లు,ప్రత్తిపాడు 11,371 పింఛను దారులకు రూ. 5.00 కోట్లు, రౌతులపూడి 7,835 పింఛను దారులకు రూ.3.43 కోట్లు,

సామర్లకోట మండలం 11,471 పింఛను దారులకు రూ.4.92 కోట్లు, సామర్లకోట అర్బన్ 6,203 పింఛను దారులకు రూ.2.70 కోట్లు, శంఖవరం 7,447 పింఛను దారులకు రూ.3.22కోట్లు,

తాళ్ళరేవు 11,321 పింఛను దారులకు రూ.4.92 కోట్లు, తొండంగి మండలం 12,281 ఫింఛను దారులకు రూ.5.42 కోట్లు, తుని మండలం 12097 పింఛను దారులకు రూ. 5.28 కోట్లు,తుని అర్బన్ 5,240 పింఛను దారులకు రూ.2.32కోట్లు,ఏలేశ్వరం మండలం 6,550 పింఛను దారులకు రూ.2.89 కోట్లు,ఏలేశ్వరం అర్బన్ 3,636 పింఛను దారులకు రూ. 1.58 కోట్లు

జిల్లావ్యాప్తంగా 2,68,958 పింఛను దారులకు రూ. 117.02 కోట్లు, ఫిబ్రవరి 28వ తేదీన పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ వివరించారు.

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ సకాలంలో పంపిణీ పూర్తి చేసేలా అధికారులు.. కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని పింఛన్ల పంపిణీ విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

## 28న మెడికల్ మాఫియా పై డ్రగ్ కంట్రోల్ కార్యాలయాలు వద్ద ధర్నాలు

-మార్చి ఒకటి నుండి 15వ తేదీ వరకు గడప గడపకూ సీపీఐ

-ఇళ్ల స్థలాల జాప్యంపై మార్చి 24న ఆందోళనలు

-స్థానిక ఎన్నికల ముందే రాష్ట్రంలో జనగణనలో కులగణన చేపట్టాలి

-ప్రెస్ మీట్ లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు పిలుపు




**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 26:** రాష్ట్రంలో మెడికల్ మాఫియాను సమూలంగా అరికట్టాలని డిమాండు చేస్తూ ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా బల్క్ డ్రగ్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు తెలిపారు. గురువారం ఉదయం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రులలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు సదుపాయాలు కల్పించాలన్నారు. డ్రగ్ కంట్రోల్ విభాగంలో అవినీతిని అరికట్టాలని, ప్రజారోగ్యాన్ని కాపాడాలని, బోగస్ మెడిసిన్స్ నివారించాలని డిమాండు చేస్తూ రేపు (శనివారం) ఆందోళన చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజానీకం పెద్ద ఎత్తున హాజరు కావాలని మధు పిలుపు నిచ్చారు. సాధారణ జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్ళు నొప్పులు, తలనొప్పి వీటికి అసలు మందులే అవసరం లేదని కొంతమంది శాస్త్రవేత్తలు చెబుతున్నారని..కానీ మనిషి భయం వల్ల త్వరగా కోలుకోవాలని తాపత్రయం వల్ల మందులు మింగడం ప్రారంభించారన్నారు. ఇది బడా కార్పొరేట్ వ్యక్తులు ప్రజల అవసరాలను, వారి మానసిక భయాన్ని ఉపయోగించుకుని అనవసరమైన మందులను ప్రజలకు అమ్ముతున్నారని మధు అన్నారు. మనుషులకు రోగాలు వస్తే రోగాన్ని నయం చేయాల్సిన మందులే మరో కొత్త రోగాన్ని తెచ్చిపెడతాయని ఆయన అన్నారు. నకిలీ మందులు తయారీ కంపెనీలు కోట్ల రూపాయలు ఆదాయం తెచ్చిపెడితే వీటిని మింగిన రోగులకు మాత్రం ఎక్కడా లేని కష్టాలు వచ్చి మానసికంగా శారీరకంగా బలహీనం చేస్తున్నారని మధు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నకిలీ మందుల తయారీ వెనుక ఒక పెద్ద మెడికల్ మాఫియా ఉందని.. ఇది అందరికీ తెలిసిన బహిరంగ సత్యమే అని మధు తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి అనేది మనిషి ప్రాథమిక హక్కులని కానీ నేడు ఆ హక్కులను పాలకులు నిర్వీర్యం చేస్తూ విద్యా వైద్యాన్ని పూర్తిగా వ్యాపార సరుకుగా మార్చి వేశారని మధు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచం మొత్తంపై చూసుకుంటే ఫార్మసిటికల్ కంపెనీలు మన దేశంలోనే ఎక్కువ ఉన్నాయని గుర్తు చేశారు. నకిలీ మందులు వాడటం వల్ల మన శరీరంలో సహజంగా ఆహారం ద్వారా తయారయ్యే రోగ నిరోధక శక్తిని మన శరీరం పూర్తిగా కోల్పోతుందని, తద్వారా రోగం నయమైన మనిషి పూర్తిగా ఆరోగ్యవంతంగా కోల్పోవడానికి చాలా రోజులు పడుతుందని మధు తెలిపారు. నకిలీ మందులు తయారీలో ప్రపంచంలోనే ఇండియా మొదటి స్థానంలో ఉందని ఈ నకిలీ మందుల తయారీ కూడా ముఖ్యంగా ఉత్తర రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్ ఢిల్లీ ఉత్తరాఖండ్ ఉత్తరప్రదేశ్లో జరుగుతోందని అనేక నివేదికాలు చెబుతున్నాయని మధు తెలిపారు. ఇంత విచ్చలవిడిగా ఒక వైపు డ్రగ్స్ మరోవైపు నకిలీ మందులు తో మెడికల్ మాఫియా రెచ్చిపోతుంటే మన రాష్ట్రంలో ఉన్న ఔషధ డ్రగ్స్ నియంత్రణ అధికారులు అవినీతి ఊబిలో కూరుకుపోయి ఉన్నారని మధు ఆరోపించారు. మెడికల్ మాఫియాపై ఉక్కు పాదం మోపే వరకు సీపీఐ దశల వారీ పోరాటాలు నిర్వహిస్తుందని మధు తెలిపారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కొరకు పోరాటానికి మార్చి ఒకటవ తేదీ నుండి 15వ తేదీ వరకు సీపీఐ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఆయా వార్డులలో ప్రజల సమస్యలు తెలుసుకుని తద్వారా స్థానిక సంస్థలపై పెద్ద ఎత్తున కార్యచరణ చేపడతామని మధు తెలిపారు. గత ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చి నేటికీ రెండు సంవత్సరాల పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకూ దీనిపై కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టలేదని మధు విమర్శించారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీన పరచాలని, పేదలందరికీ ఇళ్ళు ఇచ్చేంతవరకు అద్దె ఇళ్లల్లో ఉండే వారికి ఇంటి అద్దెను ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రామ స్థాయి నుంచి ఆందోళన చేపడుతామన్నారు. మార్చి 24న పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని మధు ప్రకటించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పేరు వీబీ రాంజీగా మార్పు చేసి సవరణలు తీసుకురావడానికి నిరసిస్తూ సీపీఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన పల్లెబాట నిర్వహిస్తామని మధు పిలుపునిచ్చారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల ముందే జనగణలో కులగణన చేపట్టి బీసీలకు స్థానిక సంస్థల 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బీసీ సంఘాలను కలుపుకుని అన్ని జిల్లాల్లో సదస్సులు, సమావేశాలు, చర్చా గోష్టులు జరుపుతామని మధు అన్నారు. ఈ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున బీసీ లు పాల్గొవాలని మధు పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రేఖ భాస్కరావు మాట్లాడుతూ రాజమండ్రిలో పాల కల్తీ మరణాలు బాధాకరం అన్నారు. పాలే కాదు..తాగే మంచి నీరు, మంచి నూనె చివరిగా గాలి కూడా కలుషితం అవుతుందని అన్నారు. మెడికల్ మాఫియాపై సీపీఐ తో పాటు ఇతర రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని, అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేయడం లేదని..లడ్డూ మీద రాజకీయ డైవర్షన్ చేస్తున్నారని మండిపడ్డారు. పలు ప్రజా సమస్యలపై భవిష్యత్తులో ఈ జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కే రాంబాబు, నగర కార్యదర్శి వీ కొండలరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ఎన్ వీ ప్రసాద్, అల్లం వెంకటేశ్వరావు, చింతలపూడి సునీల్, పీ లావణ్య, పీ త్రిమూర్తులు, కే శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధికి విద్య అత్యంత ప్రాముఖ్యమైనది - కలెక్టర్



**అమలాపురం(మనసులో మాట) ఫిబ్రవరి 26 :** సమాజ అభివృద్ధికి విద్య అత్యంత ముఖ్యమైన సాధనమని,ఎస్సీ విద్యార్థులు ఉన్నత విద్యా రంగాలలో, ముఖ్యంగా యూపీఎస్సీ వంటి ప్రతిష్టాత్మక పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసు కుంటుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు.. గురువారం స్థానిక కలెక్ట రేట్ నందు ఎస్సీ కార్పొరేషన్ వారు అందించిన ల్యాప్టాప్ లను ఆన్లైన్ యూ పీఎస్సీ కోర్సు చేస్తున్న గిడ్డి యాస్విని, చెలిమి ఆకాష్ ,మార్తా స్వర్ణల కు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉచితంగా అందజేశారు. అంబేద్కర్ స్టడీ సెంటర్ యూపీఎస్సీ ప్రిలిమ్స్ కోచింగ్ 2026 కు సంబంధించి ఆన్లైన్ కోచింగ్ కొరకు ఎస్సీ కార్పొరేషన్ నుండి అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసంగిస్తూ ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడే విధంగా ఉన్నత శిఖరాలు అధిరోహిం చాలని సూచించారు.

యూపీఎస్సీ ఆన్లైన్ కోర్సులను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన సాంకేతిక వసతులు అందు బాటులో ఉండటం ఎంతో అవసరమన్నారు. ఎస్సీ కార్పొరేష న్ ద్వారా అర్హత కలిగిన ఎస్సీ విద్యార్థులకు ఉచిత ల్యాప్టా ప్‌లను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమం మీ విద్యాభ్యాసానికి బలమైన పునాది వేస్తుందనే నమ్మ కం ఉందన్నారు.ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించబడిన ఈ లాప్‌టాప్‌లు మీరు యూపీఎస్సీ ఆన్‌లైన్ కోర్సు లను సమర్థవంతంగా పూర్తి చేయడానికి మీకు అందుబాటు లోకి వచ్చాయన్నారు.ప్రభుత్వం యొక్క సామాజిక న్యాయం, విద్యా అభివృద్ధి కార్యక్రమాలలో ముఖ్య మైన అంశంగా భావించి ఎస్సీఎస్టీ విద్యార్థుల అభివృద్ధికి ప్రగతికి ముందడుగు వేస్తోంద న్నారు. ఈ లాప్‌టాప్‌లు మీకు డిజిటల్ విద్యా సాధనాలను అందించి, యూపీఎస్సీ వంటి జాతీయ పరీక్షలకు సిద్ధం కావడానికి సహాయపడ తాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మీ కలలను సాకారం చేసుకోవా లన్నారు. విద్య మాత్రమే మీ భవిష్యత్తును సమూలంగా మార్చగలదన్నారు ఈ ల్యాప్టా ప్‌లను సద్విని యోగం చేసు కొని యూపీఎస్సీ కోర్సులను పూర్తి చేసి, దేశ సేవకు సిద్ధమ వ్వాలని ఆకాంక్షిం చారు. మీ లక్ష్యసాధనలో జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ మీకు తోడుగా ఉంటుం దన్నారు.మీ కృషి, పట్టు దల, క్రమశిక్షణ మీ విజయానికి సోపానాలు మార్గదర్శకాలు అవుతాయన్నారు. భవిష్యత్తులో మీరు ఉన్నత పదవులను అధిరో హించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరుకుంటున్నాన న్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.టి.ఐ జిల్లా కోఆర్డినేషన్ కమిటీ డిఎల్‌సిసి సభ్యుడిగా కోడి కిషోర్ నియామకం

- మదర్ తెరిసా సేవా సమితి వ్యవస్థాపకులు వుందుర్తి సుబ్బారావు కిషోర్ కి సత్కారం



**అనపర్తి (మనసులో మాట) ఫిబ్రవరి 26:** పత్రికా ప్రతినిధిగా సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న ప్రముఖ సామాజిక వేత్త, మంచి మనిషి, రాజానగరం మండలానికి చెందిన కోడి తాతారావు అలియాస్ కిషోర్ ను 2026-2027 సంవత్సరమునకు గాను, ఆర్టిఐ జిల్లా కోఆర్డినేషన్ కమిటీ (డి ఎల్ సి సి) సభ్యునిగా, ఎంపిక చేసిన తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ శ్రీమతి చేకూరి కీర్తి కి మదర్ తెరిసా సేవా సమితి తరపున వ్యవస్థాపకులు ఉందుర్తి సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు. గౌరవ జిల్లా కలెక్టర్ కోఆర్డినేషన్ ఆఫీసర్ గాను, జిల్లా రెవెన్యూ అధికారి నోడల్ అధికారి గాను మరో ఇద్దరు నామినేటెడ్ సభ్యులు గల డీఎల్సీసీ కి సామాజిక స్పృహ కలిగిన కిషోర్ ని ఎంపిక చేయడం మంచి పరిణామం అని అన్నారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ దాదాపు మూడు దశాబ్దాలుగా ఎస్సీ ,బీసీ, మైనార్టీ వర్గాలకు విశేషమైన సేవలు అందిస్తున్న కోడి కిషోర్ భవిష్యత్తులో, మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. డి ఎల్ సి సి సభ్యునిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా రంగంపేట మండలంలో పర్యటించిన కోడి కిషోర్ని మదర్ తెరిసా సేవాసమితి ప్రతినిధులు వడిశలేరు గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసి చిరు సత్కారాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సేవాసమితి వ్యవస్థాపకులు ఉందుర్తి సుబ్బారావు కిషోర్ సేవలను కొనియాడారు. భవిష్యత్తులో పేద బలహీన వర్గాల వారికి మరియు సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మదర్ తెరిసా సేవా సమితి అధ్యక్షురాలు శ్రీమతి కొల్లి సంధ్యా నీలిమ సేవాసమితి ప్రతినిధులు పల్లెటి రాజేశ్వరరావు, బత్తిన తాతారావు, కోరుమిల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



## తరగతి గదిలో చెప్పే పాఠ్యాంశాలు నిజ జీవితంలో అలవర్చుకునేలా ఉండాలి

- ఎంఈఓ మనోహరం

**రాజోలు ఫిబ్రవరి 26 మనసులోమాట:** తరగతి గదిలో చెప్పే పాఠ్యాంశాలు నిజ జీవితానికి అలవర్చుకునేలా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి నల్లి మనోహర్ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ మరియు బయాలజికల్ సైన్స్ భోధించే ఉపాధ్యాయులకు టీచర్ ప్రొఫెషియెన్సీ డెవలప్మెంట్ పై ఓరియెంటేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి నల్లి మనోహరం మాట్లాడుతూ విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం కలిగించాలంటే తరగతి గదిలో మనం చెప్పే పాఠ్యంశాలు వారి నిజ జీవితానికి అలవరచుకునేలా ఉండాలని అన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్స్ కె.ఆర్.ఎస్ పద్మావతి మరియు మామిడిశెట్టి గోపాలకృష్ణ లు ఈ ఓరియెంటేషన్ లో భాగంగా విద్యార్థులకు ప్రతి విషయం అన్వేషణ పద్దతిలో బోధించాలన్నారు. శాస్త్రీయ పరిజ్ఞానం అనేది బట్టి పడితే వచ్చేది కాదని, చేయడం ద్వారా అభ్యాసన అనే దానిపై ఆధారపడి ఉంటుందని అందుకే బట్టి పద్ధతిని పూర్తిగా విడనాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దొంగ జానకిరామయ్య తదితరులు పాల్గున్నారు.

## ఏలేశ్వరం మండలం రెవిన్యూ ఉద్యోగుల జె ఏ సి ఎన్నిక ఏకగ్రీవం..

- చైర్మన్ గా తాసిల్దార్ కే. కుశరాజు



**ఏలేశ్వరం (మనసులో మాట) ఫిబ్రవరి 26..** అమరావతి రెవిన్యూ ఉద్యోగుల జేఏసీ ఏలేశ్వరం మండలం కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకోవడం జరిగింది.ఇందులో చైర్మన్ గా తహసీల్దార్ కే . కుశరాజు ని, కో చైర్మన్ గా సీనియర్ సహాయకులు ఆర్ ఐ . పొన్నాలు, కన్వీనర్ గా వి ఆర్ ఓ ఆ. తిరుమలరావు, సెక్రటరీ జనరల్ సర్వేయర్ శ చరణ్, ట్రజరర్ గా వి ఆర్ ఓ రొంగలి శ్రీనివాస్ ని, మిగిలిన వైస్ చైర్మన్ లు గా శంకర్ కే మణికంఠ కే సత్యనారాయణ కే సత్య రావు.జాయింట్ సెక్రెటరీగా కె అనిల్ పి రమేష్ పోస్ట్ లను ఎన్నిక కాగా మిగతా వారు వి ఆర్ ఓలు వి ఎస్ , వి ఆర్ ఓ , కార్యాలయం సిబ్బంది ని ప్రణాళిక బద్ధంగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అందరికి ఏలేశ్వరం మండలం తరుపున చైర్మన్ కె కుశరాజుకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి శుభాభినందనలు తెలిపారు.

## అభివృద్ధి ధ్యేయం గా కూటమి ప్రభుత్వంలో సీసీ రోడ్లు పనులు ప్రారంభించిన టిడిపి నాయకులు



**కోటనందూరు (మనసులో మాట) ఫిబ్రవరి 26..** తుని నియోజకవర్గం కోటనందూరు మండలం ఎమ్మెల్యే దత్తత గ్రామమైన అల్లిపూడి గ్రామంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి ధ్యేయంగా గ్రామాభివృద్ధికి ప్రభుత్వ ఏర్పడిన 20 నెలల కాలంలో రెండో విడతగా సుమారు 60 లక్షలు రూపాయలు విడుదల తెలియజేశారు . అనంతరం సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ,తుని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అంకంరెడ్డి బుల్లిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో ,మా గ్రామ అభివృద్ధికి రాష్ట్ర సీనియర్ నాయకులు యనమల రామకృష్ణుడు ఎమ్మెల్యే యనమల దివ్య రానున్న రోజుల్లో ,మరింత అభివృద్ధికి సహకరిస్తారని మా ఊరంతా నీకు రుణపడి ఉంటారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా అధికార ప్రతినిధి గాడి రాజబాబు మరియు కోటనందూరు మండలం టిడిపి పార్టీ అధ్యక్షుడు పోతల సూరిబాబు ,ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెలగా వెంకట కృష్ణారావు,గుడివాడ అప్పలనాయుడు అల్లిపూడి గ్రామ పార్టీ అధ్యక్షుడు ,అంకంరెడ్డి గోపి ,శంకుస్థాపనపనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ,సామినేడు కృష్ణార్జున అల్లిపూడి నాయకులు చింతకాయల కొండబాబు ,రుత్తల సత్య సీతయ్య,చింతకాయల సురేష్ కుమార్ చింతకాయల వెంకటరమణ ,చిటికెల సత్యనారాయణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మాజీ సర్పంచ్ అన్నందేవుల మృతి

- సంతాపం తెలిపిన పలువురు ప్రముఖులు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 26:** కడియం మండలం మాధవరాయుడుపాలెం మాజీ సర్పంచ్ అన్నందేవుల వెంకటస్వామి (84) గురువారం ఆయన స్వగ్రామంలో తుదిశ్వాస విడిచారు. ఈయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మాధవరాయుడుపాలెం గ్రామానికి ఈయన రెండు సార్లు ఉప సర్పంచ్ గా పనిచేశారు. అయితే 2001లో అప్పటి సర్పంచ్ అన్నందేవుల విజయ ఎంపీటీసీగా పోటీ చేసి ఎంపీపీ పదవిని చేపట్టారు. దీంతో ఆమె సర్పంచ్ పదవికి రాజీనామా చేయడంతో వెంకటస్వామి కొంత కాలంపాటు సర్పంచ్ గా కొనసాగారు. ఈయనకు కుమారుడు నరేంద్రతో పాటు బీజే యశోద, బీజే హేమ అనే కుమార్తెలు ఉన్నారు. వెంకటస్వామి మృతికి రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, సర్పంచ్ అన్నందేవుల చంటి సంతాపం వ్యక్తం చేశారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




## కాకినాడ జేఎన్టీయూకే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గా పద్మరా

**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 26..** జేఎన్టీయూకే పరిధిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకినాడ (యూసీఈకే) కు సంబంధించి ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కే. ప్రసాద్ పరిపాలనాపరమైన ఉత్తర్వులు జారీ చేశారు. ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కే. ప్రసాద్ ఆదేశాల మేరకు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ కె. పద్మరాజుని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకినాడ (యూసీఈకే) ప్రిన్సిపాల్గా నియమించారు. అదేవిధంగా, ఇప్పటి వరకు యూసీఈకే ప్రిన్సిపాల్గా విధులు నిర్వహిస్తున్న మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. మోహన్ రావుని ప్రిన్సిపాల్ బాధ్యతల నుండి రిలీవ్ చేశారు.

ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయ అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, పరిపాలనా సమర్థత సాధనలో కొత్త ప్రిన్సిపాల్ సమర్థంగా బాధ్యతలు నిర్వహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, ప్రొఫెసర్ ఎన్. మోహన్ రావు ప్రిన్సిపాల్గా ఉన్న సమయంలో చేసిన సేవలను అభినందించారు.

## కాశీ పీఠాధిపతులు శివ నాగేంద్ర సరస్వతి మండపేట రాక



**మండపేట (మనసులో మాట )ఫిబ్రవరి 26..** వారణాసి కి చెందిన ప్రముఖ కాశీ పీఠాధిపతులు శ్రీ శివ నాగేంద్ర సరస్వతి స్వామీజీ మార్చి 1 న మండపేట విచ్చేస్తున్నట్లు మండపేట 15 వ వార్డు కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. మార్చి 1 నుండి 5 వరకు మండపేట ధర్మ గుండం చెరువు వద్ద గల శ్రీ రాజరాజేశ్వరి పీఠం ( తమ నివాసం ) వద్ద ఉంటారని తెలిపారు. 5 రోజులు పాటు స్వామి వారు మండపేట లోనే ఉంటూ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. మార్చి 1 ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కలువపువ్వు సెంటర్ నుండి ఊరేగింపుగా స్వామి వారిని పీఠానికి తీసుకు వెళతామని చెప్పారు. స్వామి వారు అమ్మ వారి మహానుగ్రహం కలిగిన మహోన్నతులని పేర్కొన్నారు. అమ్మ వారి భక్తులు, కుల మతాలకు అతీతంగా పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారి ఊరేగింపును విజయవంతం చేయాలని శ్రీనివాస్ కోరారు.

## మెప్మా కార్యకలాపాలపై పీడీ సమీక్ష..



**పిఠాపురం,( మనసులో మాట) ఫిబ్రవరి 26:** పిఠాపురం పురపాలక సంఘం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) కార్యాలయంలో గురువారం కాకినాడ జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. కనకరాజు రిసోర్స్ పర్సన్స్ తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మెప్మా ద్వారా అమలవుతున్న వివిధ పథకాలు, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించి, ఆర్పీలకు తగు సూచనలు చేశారు.

అనంతరం, పట్టణంలో వాసవి మహిళా మండలి (విజయవాడ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సోలార్ పివి టెక్నీషియన్' శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అభ్యర్థులకు అందుతున్న శిక్షణ తీరును పరిశీలించి, మహిళలు సాంకేతిక రంగాల్లో నైపుణ్యం సాధించి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జీవనోపాధుల నిపుణులు రవిశంకర్, సిటీ మిషన్ మేనేజర్ కె. వెంకటలక్ష్మి, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, స్వయం ఉపాధి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు..

## 2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డిఅమరావతి నుండి సమీక్ష



**అమలాపురం (మనసులోమాట) ఫిబ్రవరి 26:** 2027 సంవత్సరంలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై అమరావతి నుండి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో మంత్రులు కందుల దుర్గేష్, బి.సి. జనార్దన్ రెడ్డి,పి. నారాయణ, నిమ్మల రామానాయుడు, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవి కుమార్, మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ఆరు జిల్లాల జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.
మహా కుంభమేళా తరహాలో 2027 గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. 2027 జూన్ 26 నుండి జులై 7 వరకు జరిగే ఈ పుష్కరాలకు సుమారు 8 నుండి 10 కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ప్రధాన పుష్కర దినాల్లో (తొలి రోజు, వీకెండ్లు, అమావాస్య) దాదాపు కోటి మంది భక్తులు రానున్నారని, మొత్తం 2.25 కోట్ల మంది పవిత్ర స్నానం చేయనున్నారని అంచనా.

పుష్కరాల నిర్వహణ కోసం మొత్తం 4516 మీటర్ల మేర 373 ఘాట్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఉన్న 234 ఘాట్ల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టనున్నారు. జిల్లాల వారీగా తూర్పు గోదావరి జిల్లాలో 102, పశ్చిమ గోదావరిలో 40, కోనసీమలో 175, ఏలూరులో 36, కాకినాడలో 5, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
రాష్ట్రంలో మొదటి గోదావరి పుష్కర ఘాట్ పోలవరం జిల్లాలోని గుండాల వద్ద, చివరి ఘాట్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది, బలుసుతిప్ప వద్ద ఏర్పాటు చేయనున్నారు. అలాగే కాకినాడలో గోవలంక ఘాట్, వెస్ట్ గోదావరిలో నర్సాపురం ఘాట్ ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ వెల్లడించింది. భక్తుల సౌకర్యార్థం పిండప్రదాన ఘాట్లు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, విద్యుత్, వైద్య సదుపాయాలు, భద్రత తదితర అంశాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు. సాధారణ ధరలకే టెంట్ సిటీలు మరియు హోమ్ స్టేలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 105 ఘాట్లు ఉన్నాయని, అదనంగా 70 ఘాట్లు అవసరమని కేబినెట్ సబ్ కమిటీ కి వివరించారు. భక్తుల రద్దీ దృష్ట్యా అవసరమైన మేరకు మరిన్ని ఘాట్లు ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. నదీతీర ప్రాంతాలైన కోటిపల్లి, వాడపల్లి, అప్పనపల్లి, అంతర్వేది, మురమళ్ళ, కుండలేశ్వరం దేవాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అన్ని శాఖలతో సమన్వయం చేసి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## వాచ్ డాగ్ కమిటీ సమీక్ష సమావేశం



**కాజులూరు (మనసులో మాట) ఫిబ్రవరి 26..** వాచ్ డాగ్ కమిటీ సమీక్ష సమావేశం కీలక అంశాలపై చర్చించిందనీ తాహసిల్దార్ జి రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. బుధవారం తాహసిల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ అధ్యక్షతన వాచ్ డాగ్ కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కమిటీ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యంగా ప్రభుత్వ చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న వారిని గుర్తించడం, వారి పరిస్థితులను అర్థం చేసుకోవడం, చట్టబద్ధమైన పరిష్కారాలను అందించడం వంటి విషయాలు ప్రాధాన్యంగా నిలిచాయన్నారు
గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు నీటి వనరులుగా మాత్రమే కాకుండా జీవనాధారంగా కూడా నిలుస్తాయనీ కాలక్రమేణా కొంతమంది కుటుంబాలు ప్రభుత్వ భూములు, చెరువు పరిధిలో నివాసాలు ఏర్పరుచుకోవడం జరిగిందన్నారు. పేదరికం, భూమి లభ్యతలో కొరత, నివాస హక్కులపై అవగాహన లేకపోవడం వంటి కారణాలు దీనికి దోహదపడ్డాయన్నారు. అయితే, ఇది పర్యావరణ సమతౌల్యాన్ని, నీటి నిల్వ సామర్థ్యాన్ని ప్రభావితం చేసే ప్రమాదం కూడా కలిగిస్తుందన్నారు.

వాచ్ డాగ్ కమిటీ సమీక్షలో మూడు ముఖ్యాంశాలు ప్రస్తావించబడ్డాయనీ
సర్వే నిర్వహణ: ప్రభుత్వ చెరువులలో నివసిస్తున్న వారిని ఖచ్చితంగా గుర్తించడం,
సామాజిక విశ్లేషణ, అక్కడ నివసించే కుటుంబాల ఆర్థిక, సామాజిక పరిస్థితులపై వివరమైన అధ్యయనం చేయాలన్నారు. చట్టపరమైన చర్యలు & పునరావాసం: అక్రమ ఆక్రమణలపై చట్టబద్ధ చర్యలు తీసుకోవడంతో పాటు వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో చక్రపాణిరావు విద్యుత్ శాఖ ఏఈ వీర్రెడ్డి రెవిన్యూ ఇన్స్పెక్టర్ వేగేశ్వరరావు మండల ఇన్చార్జి సర్వేయర్ గోపి ఇరిగేషన్ ఏ ఈ ప్రవీణ్ డ్రైనేజీ ఏఈ సుబ్బారావు పాల్గొన్నారు.

## ఏలేశ్వరం అప్పన్నపాలెం వారధి నిర్మాణానికి పచ్చ జెండా

### - స్థానిక నేతలతో కలిసి పరిశీలించిన చీఫ్ ఇంజనీర్ కె.విజయ కుమారి పరిశీలన





**ఏలేశ్వరం (మనసులో మాట ) ఫిబ్రవరి 26..** కాకినాడ జిల్లా ఏలేశ్వరం – జగ్గంపేట నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోందని కూటమి నాయకుల అభిప్రాయ పడ్డారు. అప్పన్న పాలెం వంతెనను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ చీఫ్ ఇంజనీర్ కె.విజయ కుమారి గురువారం స్థానిక నాయకులు అలమండ చలమయ్య, బొద్దిరెడ్డి గోపి, మూది నారాయణస్వామిలతో కలిసి పరిశీలించారు.
స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలించి వంతెన నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.
ఎన్ఆర్ఈజీఎస్, పీఎంజీఎస్వై, నాబార్డ్ వంటి పథకాలతో పంచాయతీరాజ్ శాఖలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు.

ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారుతున్నాయని. ఇందులో భాగంగానే, ప్రత్తిపాడు నియోజక వర్గం లోని ఏలేశ్వరం , జగ్గంపేట ప్రధాన అనుసంధాన వంతెన(అప్పన్నపాలెం వంతెన) సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంద ని తెలిపారు.

గర్భిణీలు, వృద్ధులు మరియు చిన్నపిల్లలు పడుతున్న ఇబ్బందులను గమనించిన పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ విజయ కుమారి దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఏలేరు రిజర్వాయర్ నుండి వచ్చే భారీ డిశ్చార్జ్ను తట్టుకునేలా 7.5 మీటర్ల వెడల్పుతో అత్యాధునిక టూ-లేన్ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి డిజైన్ సిద్ధమైందని అన్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే 18 కోట్లతో డీపీఆర్ (డీ పీ ఆర్ ) సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల నిరంతర ఫాలో అప్తో ఈ పనులు వేగవంతం అయ్యాయి.

సాయిల్ ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే సెంటర్ పాయింట్నే నిర్మాణానికి ఎంచుకున్నారు. వచ్చే ఒకటిన్నర ఏళ్లలో ఈ వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా యంత్రాంగం కసరత్తు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం చొరవతో ఏజెన్సీ ఏరియాలో అడవి తల్లి బాట లాంటి కార్యక్రమాలతో పాటు ఈ వంతెన నిర్మాణం కూడా త్వరితగతిన పూర్తి కానుందని. ఈ సందర్భగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎండగుడి నాగబాబు, కోణాల వెంకటరమణ,పెంద్ర శ్రీను, మామిడి లలిత, రాయుడు చిన్న, సామంతుల గోపి, వాగు రాజేష్ తదితర కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## భక్తుల కోలాహలం మధ్య శ్రీశ్రీశ్రీ కాశి వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట





**కాకినాడ (మనసులో మాట )ఫిబ్రవరి 26..** ప్రముఖ వ్యాపారవేత్త జనసేన పార్టీ సీనియర్ నాయకులు చిన్ననాటి నుండే ఆధ్యాత్మిక చింతన కలిగిన చిక్కాల వీర వెంకట సత్యనారాయణ (దొరబాబు) చిక్కాల సుబ్రహ్మణ్యేశ్వర రావు (సుబ్బారావు ) అన్నదమ్ములు ఇరువురు గతంలో తమ సొంత గ్రామమైన సిరిపురం గ్రామంలో సాయిబాబా గుడి అలాగే గ్రామ దేవతల గుడి కూడా నిర్మించారు. ఇపుడు కాకినాడ కరప మండలం, కోరిపెళ్ళ గ్రామంలో నిర్మించిన ఆలయంలో శ్రీశ్రీశ్రీ కాశి వరాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం వేల సంఖ్యలో వచ్చిన భక్తుల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి విగ్రహ ప్రతిష్టను తిలకించి దొరబాబు ఏర్పాటుచేసిన అన్న ప్రసాదాన్ని స్వీకరించి వారాహి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా దొరబాబు,సుబ్బారావులు మాట్లాడుతూ తాము తలపెట్టిన ఈ కార్యక్రమంలో తమతో పాటు పాల్గొని తమకు తోడ్పాటు అందించిన తన స్నేహితులు బంధువులకు కృతజ్ఞతలు తెలిపారు అలాగే అమ్మవారి ఆశీస్సులు కూడా వారికి కలగాలని ఆలయ అభివృద్ధికి ఎప్పుడు తాను ముందు ఉండి అభివృద్ధి చేస్తామని అన్నారు. అలాగే త్వరలో తాము నిర్మించిన ఈ అమ్మవారి ఆలయానికి తమ నాయకుడు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వచ్చి ఆ అమ్మవారి ఆశీస్సులు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, రాజకీయాలకతీతంగా నాయకులు భక్తులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఈ కార్యక్రమంలో తమకు సహకరించిన పోలీస్ అధికారులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## స్టాండింగ్ కమిటీ సమ్మావేశంలో పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి

**అమలాపురం( మనసులోమాట) ఫిబ్రవరి 26:** ఢిల్లీలో జరిగిన కార్మిక, జౌళీ నైపుణ్యాభివృద్ధి పార్లమెంటరీ కమిటీ సమావేశంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి పాల్గొన్నారు. ఈ సమావేశంలో 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ, జౌళీ మంత్రిత్వ శాఖ మరియు కార్మిక , ఉపాధి మంత్రిత్వ శాఖల గ్రాంట్ల డిమాండ్లను కమిటీ పరిశీలించిందన్నారు. ప్రతిపాదిత బడ్జెట్ కేటాయింపులు, పథకం వారీగా వ్యయం, నిధుల వినియోగ ధోరణులు మరియు ముఖ్య కార్యక్రమాల కింద భౌతిక పురోగతి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగిందన్నారు. కేటాయించిన నిధులు ఉపాధి, జీవనోపాధి ,పారిశ్రామిక అభివృద్ధిపై ఫలితాలను ఇవ్వడానికి, ఫలితాల ఆధారిత బడ్జెటింగ్, ఆర్థిక క్రమశిక్షణ మరియు నిధుల సమర్థ వినియోగం అత్యంత అవసరమని కమిటీ ప్రధానంగా ఆవశ్యకతను వెల్లడించిందని ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.

## కనకాల పేటలో రైతులకు లింగాకర్షక బుట్టలు పంపిణీ



**యానాం (మనసులో మాట) ఫిబ్రవరి 26:..** కొబ్బరి పంటకు తీవ్ర నష్టం చేకూర్చే కొమ్ము పురుగు, ఎర్ర ముట్టు పురుగుల నివారణకు వినియోగించే లింగాకర్షక బుట్టలను గురువారం పంపిణీ చేశారు. యానాం వ్యవసాయ శాఖ ఆత్మ కార్యక్రమంలో భాగంగా కనకాల పేటలో డిప్యూటీ డైరెక్టర్ చిక్కాల జోగి రాజు ఆద్వర్యంలో పలువురు రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కనకాలపేట రైతులు కవల కోటేశ్వరరావు, పోలిశెట్టి రామకృష్ణ, పోలిశెట్టి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. ఏరియా ఫీల్డ్ మేన్ ఐ కే ఖాన్, ఆత్మ బి టీ ఏం రూప, ఆత్మ ఎటిఎం చినబాబు మొదలగు సిబ్బంది క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.

## బిక్కవోలు దేవాలయాలను సందర్శించిన ఆర్టీఐ కమిషనర్ చక్రవర్తి



**ఆనపర్తి (మనసులో మాట) ఫిబ్రవరి 26:** రాష్ట్ర సమాచార హక్కు కమీషర్ వి ఎస్. కె. చక్రవర్తి బిక్కవోలులోని ప్రముఖ దేవాలయాలను సందర్శించారు. కుటుంబసమేతంగా దేవాలయాలకు విచ్చేసిన కమీషనర్ చక్రవర్తికి ఆలయ మర్యాదలతో స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన శ్రీ గోలింగేశ్వర కుమార సుబ్రహ్మణ్యేశ్వర శ్రీ లక్ష్మీ గణపతి స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి వేదాశీర్వచనం పొందారు. అనంతరం బిక్కవోలు వాస్తవ్యుడయిన కమీషనర్ చక్రవర్తిని ఇంఛార్జి తహసీల్దార్ సత్యకృష్ణ, ఎస్సై రవిచంద్ర, కూటమి నేతలు పాలచర్ల శివప్రసాద చౌదరి, రావాడ నాగు, గొర్రెల త్రిమూర్తులు, చాగంటి సాయిబాబా రెడ్డి, పలువురు చక్రవర్తి మిత్రులు మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఘనంగా శ్రీ విద్యరేణ్యాశ్రమము వార్షికోత్సవ మహోత్సవం



**గండేపల్లి. మనసులో మాట. ఫిబ్రవరి 26.** మండల కేంద్రమైన గండేపల్లి గ్రామంలో వేంచేసియున్న గాయత్రీ మాత సన్నిధిలో శ్రీ విద్యరేణ్యాశ్రమము 21వ వార్షికోత్సవ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది.గురువారం ఉదయం 6 గంటలకు గ్రామంలో తిరువీధి మహోత్సవం లో భాగంగా పుష్ప పల్లకి, రథోత్సవం, వేదస్వస్తి, నాదస్వరం కోలాటం,మేళాలు తప్పిడి గుళ్ళు, తో పాటు వివిధ వేషధారణలతో గండేపల్లి గ్రామం అంతా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రసాద్ వరణ్య మాట్లాడుతూ.ప్రతిరోజు ఉదయం 5 గంటలకు గాయత్రి నిత్య హోమం, ఉదయం 6 గంటలకు అర్చన, హారతి, ఉదయం 8 గంటల నుండి విష్ణు అర్చన నీరాజనం మంత్ర పుష్పాలు కార్యక్రమాలు నిర్వహిస్తామని ఐదు రోజుల తో పాటు శ్రీ విద్యరేణ్యాశ్రమము వార్షికోత్సలు లో భాగంగా గాయత్రి మాత కు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు ఐదు రోజులపాటు నిర్వహించి ఆఖరి రోజున అనగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున విశేష అన్న వితరణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మురారి గ్రామానికి చెందిన ఆశ్రమ భక్తులు అదే విధంగా ఇతర గ్రామాల నుంచి మహిళా భక్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కోటనందూరు పోలీస్ స్టేషన్ పరిధిలో

## మహిళ మిస్సింగ్ కేసు నమోదు

**- ఎస్సై రామకృష్ణ**

**కోటనందూరు (మనసులో మాట) ఫిబ్రవరి 26..** కోటనందూరు మండలం బొడ్డవరం గ్రామానికి చెందిన అదారి రామారావు (వయస్సు: 77 సంవత్సరాలు) తమ మనవరాలు అదారి జయశ్రీ వెంకట సత్య సాయి రేణుక (వయస్సు: 21 సంవత్సరాలు )గల్లంతైన విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు వివరాల ప్రకారం, రేణుక ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసి ప్రస్తుతం విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఆమె వివాహం 07-03-2026 న జరగాల్సి ఉండగా, వివాహ ఏర్పాట్ల కోసం 23-02-2026 న విశాఖపట్నం నుండి స్వగ్రామమైన బొడ్డవరానికి వచ్చారు. 24-02-2026 సాయంత్రం సుమారు 5.00 గంటల సమయంలో, వివాహానికి కొనుగోలు చేసిన సుమారు 5 తులాల బంగారు ఆభరణాలు, 14 తులాల వెండి వస్తువులు మరియు సుమారు రూ.50,000 నగదు తీసుకుని ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుండి ఆమె మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. కుటుంబ సభ్యులు బంధువులు మరియు స్నేహితుల వద్ద విచారణ చేసినప్పటికీ ఎటువంటి సమాచారం లభించలేదు. ఈ విషయమై కోటనందూరు పోలీస్ స్టేషన్‌లో మహిళ గల్లంతు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు సంబంధిత ప్రాంతాల్లో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.ఎవరైనా రేణుక గురించి సమాచారం తెలిసిన పక్షంలో, దయచేసి సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా కోటనందూరు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించగలరు.

## పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

**శాసనసభలో కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు**



**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 26..** పారిశ్రామిక రంగంలో అభివృద్ధి మరియు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు గురువారం శాసనసభలో ప్రశ్నోత్తర సమయంలో ప్రస్తావించారు.

శాసనసభలో కొండబాబు మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాల, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి ధ్యేయంగా ప్రపంచ దేశాల నుండి పెట్టుబడులను ఆకర్షించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, 20 లక్షల ఉద్యోగాల యువతకు అందించేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, పారిశ్రామిక అభివృద్ధి కొరకు మెట్ట ప్రాంతాలు మరియు సముద్ర తీర ప్రాంతాల నందు భూములను పారిశ్రామిక రంగాలకు కేటాయించి నూతన పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేయడం జరుగుతుందని, మెట్ట ప్రాంతాల నందు భూములను నమ్ముకుని జీవనం సాగిస్తూ పారిశ్రామిక అభివృద్ధి కొరకు, తమ పిల్లల ఉద్యోగ అవకాశాల కొరకు భూములను అందజేసిన స్థానిక రైతులకు మరియు రైతు కూలీలకు, మరియు అదేవిధంగా సముద్రం తీర ప్రాంతాల నందు ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల వలన సముద్రంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకార కుటుంబాలకు మరియు స్థానిక ప్రజలకు తీవ్ర నష్టం ఏర్పడుతున్నా పారిశ్రామిక అభివృద్ధి కొరకు స్థానిక యువత ఉద్యోగ అవకాశాల కొరకు పరిశ్రమలు ఏర్పాటుకు సహకరించడం జరుగుతుందని, కానీ పారిశ్రామిక వర్గాలు పరిశ్రమలు ఏర్పాటు చేయకముందు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి, పరిశ్రమలు పూర్తిగా ఏర్పడిన తర్వాత స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా మోసం చేస్తున్నారని, పరిశ్రమల్లో ఉద్యోగుల కొరకు పారిశ్రామిక వర్గాలు ప్రైవేట్ ఏజెన్సీలను నియమించుకొని వాటి ద్వారా ఇతర రాష్ట్రాల నుండి యువతను తీసుకువచ్చి అతి తక్కువ జీతాలకు నియమించుకొని శ్రమ దోపిడీ చేస్తున్నారని, కాబట్టి మెట్ట ప్రాంతాలు మరియు సముద్ర తీర ప్రాంతాలు నందు పరిశ్రమల ఏర్పాటు వలన నష్టపోయిన స్థానిక యువతకే ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని శాసనసభలో కొండబాబు స్పీకర్ ను కోరారు. స్పీకర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు వల్ల నష్టపోతున్న స్థానిక ప్రజలకు యువతుకే ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

# 26 వేలు వేతనం కోరుతూ అంగన్వాడీల పోరుబాట

**- మార్చి 2 వ తేదీన చలో విజయవాడకు పిలుపు**



**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 26..** అంగన్వాడీలకు కనీస వేతనం 26,000 చెల్లించాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలని కోరుతూ ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ కార్యాలయం వద్ద మూడు రోజుల రిలే నిరాహార దీక్షలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏరుబండి చంద్రావతి, జిల్లా కోశాధికారి రామలక్ష్మి మాట్లాడుతూ

గత 7 ఏళ్ల నుండి అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదని, ధరలు వందల రేట్లు పెరిగాయని తక్షణం అంగన్వాడీలకు కనీస వేతనం 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయాకి 7వేలు, టీచర్కు 11500 చెల్లిస్తూ, ప్రభుత్వ వెబ్సైట్లో ప్రభుత్వ ఉద్యోగులుగా అంగన్వాడీలను నమోదు చేయడంవల్ల ఇచ్చే సంక్షేమ పథకాలు అన్నిటిని తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణా, పాండిచ్చేరి రాష్ట్రాలవలె పి.ఆర్.సిని అంగన్వాడీలకు కూటమి ప్రభుత్వం వర్తింపచేయలని డిమాండ్ చేశారు. అంగన్వాడి సెంటరు పిల్లలకు ఆట, పాటలతో విద్య అందించే అవకాశం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ ఆర్ ఎస్ తీసుకువచ్చి పని ఒత్తిడి పెంచిందన్నారు. ఐ సి డి ఎస్ నిధులు తగ్గిస్తుంటే, కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సింది పోయి, లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు ప్రయత్నించడాన్ని మానుకోవాలని కోరారు. 2019లో నిర్ణయించిన మెనూ చార్జీలను నేటి ధరలకు అనుగుణంగా పెంచాలని, పెండింగులో పెట్టిన 168 సూపర్వైజర్ పోస్టులను తక్షణం భర్తీచేయలని, బాలింతలకు ఇచ్చే బియ్యం, పప్పు, ఆయిల్ క్వాంటిటిని పెంచాలని కోరారు. సిఐటియు వర్కింగ్ కమిటీ సభ్యులు మెడిశెట్టి వెంకట రమణ సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపచేశారు.

ఈ దీక్షలకు ఎస్ ఎఫ్ ఐ నగర నాయకుకు సత్యం, సంజయ్, సిఐటియు వర్కింగ్ కమిటీ సభ్యులు టి.రాజా మద్దతు తెలియజేసారు. మిరియాల రాజేశ్వరి, టి నాగమణి, ఎస్తేరు రాణి, రమణమ్మ, జ్యోతి, విజయ, పద్మావతి, సత్యవతి, వెంకటలక్ష్మి, కుమారి, సూర్యకళ, మంగాలక్ష్మి తదితరులు దీక్షలతో పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై వైసీపీ ఎమ్మెల్సీల దురుసు ప్రవర్తన సిగ్గుచేటు

**-తూర్పు గోదావరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 26:** ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్ సోము వీర్రాజుపై గురువారం వైసీపీ ఎమ్మెల్సీ లు ఇజ్రాయిల్, విక్రాంత్, రమేష్ యాదవ్ దురుసు ప్రవర్తన పట్ల తూర్పు గోదావరి జిల్లా బీజేపీ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఎమ్మెల్సీల చర్యలను ఖండించారు. శాసన మండలి చైర్మన్ మోషెన్ రాజు అనుమతి మేరకు ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడే ప్రయత్నం చేస్తున్న సమయంలో వైసీపీ ఎమ్మెల్సీలు దురుసుగా వ్యవహరించిన తీరు క్షమించరానిదన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై దాడి చేసేందుకు మీదకు రావటాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని అన్నారు. సోము వీర్రాజు బీజేపీ తరుపున 48 సంత్సరాల నుంచి రాజకీయ క్షేత్రంలో పని చేస్తున్నారని, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా, రెండు పర్యాయాలు ఎమ్మెల్సీ గా, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యునిగా పని చేశారన్నారు. అలాంటి సీనియర్ నాయకుడిపై అకారణంగా దురుసుగా ప్రవర్తించడం వైసీపీ ఎమ్మెల్సీలకు తగదని.. వెంటనే ఆ ముగ్గురు ఎమ్మెల్సీలు సోము వీర్రాజుకి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పిక్కి నాగేంద్ర డిమాండు చేశారు. వైసీపీ అధినేత జగన్ ఈ ఘటనపై స్పందించి ఆ ముగ్గురు ఎమ్మెల్సీలను మందలించాలన్నారు. క్షమాపణలు చెప్పని పక్షంలో బీజేపీ నాయకుల ప్రతిస్పందనకు వైసీపీ బాధ్యత వహించాల్సివస్తుందని పిక్కి నాగేంద్ర ఘాటుగా హెచ్చరించారు.

ప్రణాళిక ప్రకారం దాడి..

ఇలాగే వైసీపీ ఎమ్మెల్సీలు వ్యవహరిస్తే వారికి తగిన బుద్ధి చెబుతామని ఏపీ బీజేపీ మండిపడింది. ఒక ప్రణాళిక ప్రకారం సోము వీర్రాజు పైకి దూసుకు వచ్చినట్టుగా కనపడుతోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ కి ప్రజలు ఇప్పుటికే బుద్ధి చెప్పారన్నారు. ప్రజా సమస్యలు సోము వీర్రాజు ప్రస్తావించడం ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ కి నచ్చకే సోము వీర్రాజు పైకి పోడియం వద్ద వైసీపీ ఎమ్మెల్సీ లు దూసుకువచ్చారని, ఇది వారి రాక్షస మనస్తత్వాన్ని తెలియజేస్తోందని దయాకర్ రెడ్డి తన దైన శైలిలో వైసీపీ పై విమర్శలు చేశారు. వైసీపీ కి ప్రతిదాడులు ఎలా ఉంటాయో రుచి చూపించడం బీజేపీ నిమిషాలు మీద చేయగలదని, బీజేపీ ప్రజాస్వామ్య పద్ధతిలో ఉంటుందని దయాకర్ రెడ్డి అన్నారు.

# జిల్లాలో పాలు నాణ్యత పై అనుమానాలు..

- రాజమండ్రి ఘటనతో ఉలిక్కిపడుతున్న జనం.. - ప్రజల ఆరోగ్యం ప్రశ్నార్థకం..
- నగరంలో పెరుగుతున్న కల్తీ వస్తువులు.. - చాపకింద నీరులా మారిన అధికారుల చర్యలు..
- పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న కల్తీ మాఫియా.. - తనిఖీల్లో అధికార యంత్రాంగం పూర్తి నిర్లక్ష్యం
- ఆర్టీసీ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు ధ్వజం




**ఏలూరు, ఫిబ్రవరి 26(మనసులో మాట)..** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పాలు పాల పదార్థాల కల్తీ యదేచ్ఛగా కొనసాగుతుందని ఆర్టీసి జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. ఇటీవలే రాజమండ్రిలో కల్తీ పాలు పలువురి ప్రాణాలు తీసిన నేపథ్యంలో ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఆయన మాట్లాడుతూ తనిఖీ అధికారులు నిర్లక్ష్య వైఖరి మూలంగానే ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ కల్తీ పాలను తయారు చేస్తున్నారన్నారు. ఇది యదార్థమైన విషయం.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎంతో విలువలతో కూడిన పరిపాలనను అందిస్తుంటే కొన్నిచోట్ల అధికారుల నిర్లక్ష్యం క్లుప్తంగా కనిపిస్తుంది.. ప్రజలు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు అహర్నిశలు కృషి చేస్తుంటే కొంతమంది దుర్మార్గపు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి కల్తీలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదం జరిగితేనే మీరు స్పందిస్తారా అని ప్రశ్నించారు.తనిఖీ అధికారులు మీరు గమనించుకోవాలి ప్రభుత్వం దగ్గర జీతాలు తీసుకుంటూ ఇప్పుడు చేస్తున్న నిర్లక్ష్య ధోరణిని విడనాడాలన్నారు.. ప్రతి డిపార్ట్మెంట్ లోనూ తనిఖీ అధికారులు తనిఖీని చేపట్టాలన్నారు.. ప్రస్తుతం వారు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం లేదన్నారు.

ప్రజల అవసరాలకు తగినట్లు పాల ఉత్పత్తి లేక పోగా విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు అక్రమార్జన కోసం, కల్తీ కి పాల్పడుతున్నారన్నారు. వీటివల్ల ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉన్న, అధికారులు మాత్రం మొక్కుబడి తనిఖీలతో ఉదాసీనంగా వ్యవహరిస్తూ ఉన్నారని, అధిక లాభాల కోసం ఒకప్పుడు రైతులు పాడి పశువులను పోషిస్తూ పాల వ్యాపారం చేసేవారు. ప్రస్తుతం ఉపాధి మార్గంగా మార్చుకున్న కొందరు దళారులు ఈ వ్యాపారంలోకి వస్తున్నారు. పట్టణాలు నగరాల్లో కాస్త స్థలం ఉంటే చాలు షెడ్డు నిర్మించి, గేదెల ఫారం పెట్టి, వ్యాపారం ప్రారంభిస్తున్నారు. నీళ్ల కలపని పాలు అంటూ ప్రచారం చేస్తూ, లీటర్కు 100 పైగా విక్రయిస్తున్నారు.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇదే తరహాలో ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున వ్యాపారాలు వెలుస్తున్నాయి. ఇంత జరుగుతున్న పశుసంవర్ధక, ఆహార నియంత్రణ శాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. కొందరు పశుపోషకులు పేరుతో సైకిళ్ళు మోటార్ సైకిల్ లపై దాదాపు పది నుంచి 15 కిలోమీటర్ల ప్రయాణించి పాలు సరఫరా చేస్తున్నారు.ఇందుకు గ్రామాల్లో పాలు సేకరించి అక్కడే ప్రాసెసింగ్ చేస్తున్నారు.వెన్న గ్రేడింగ్ ప్రకారం ధర నిర్ణయిస్తున్నారు.. ఇందుకోసం అసలైన రైతు నుంచి సేకరించిన అధిక లాభాల కోసం వివిధ ప్రక్రియల పేరుతో రసాయనాలు కలిపి విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.కొందరు చిరు వ్యాపారులు ఎలాంటి బ్రాండ్లు లేకుండా పాలు పెరుగు నెయ్యి తదితర ఉత్పత్తులను విక్రయిస్తున్నారు.ఆయా ఉత్పత్తులు నాణ్యంగా ఉండటానికి అవసరమైన జాగ్రత్తలను తీసుకోవడం లేదు.ప్రజలకు నాసిరకం పాల ఉత్పత్తులు అంటగడుతున్నారు. పల్లెల్లో పాడి ప్రాంతం నుంచి పాలు కనుగోలు చేసి, సమీప పట్టణాల్లో విక్రయించే చిరు వ్యాపారులు మార్గమధ్యలో కాలువల్లోని నీటిని కలిపేస్తున్న ఉదాంతాలు చాలానే ఉన్నాయన్నారు. వారు కలిపే నీళ్లు శుభ్రంగా లేకపోతే, ఆయా పాలను వినియోగించిన వారు, అనారోగ్యాల బారిన పడే ముప్పు ఉంది.కొందరు రైతుల కృత్రిమ పద్ధతుల్లో పాల దిగుబడిని పెంచేందుకు పశువులకు నిషేధిత యాక్సిటోసిన్ ఇంజక్షన్లు ఇస్తున్నట్లు తెలుస్తుందన్నారు.కొందరు ఔషధ వ్యాపారులు వీటిని గుట్టుగా విక్రయిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పాలు తాగిన వారికి హార్మోన్ల సంబంధిత అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.కొందరు పాలలో నీళ్ల కలుపుతున్నారు.చిక్కదనం కోసం, గంజిపొడిని కలుపుతున్నారని ఆరోపించారు.అధికారులు ఇలాంటి వాటిపై నిఘా పెట్టారా లేక రూపాయి కారి ఒప్పందం వల్ల అటువైపు కన్నెత్తి చూడట్లేదా అనే విమర్శింశారు.. ఏలూరు నగర పరిధిలో ప్రతి చిన్న బండి వ్యాపారస్తుల నుండి కిరాణా షాపు వరకు కార్ఖానాలో తయారు చేస్తున్న తిరుబండారాలు నగరంలో కొన్నిచోట్ల చిరుతిళ్లు తయారు చేసే వ్యాపారస్తులు, అనేక రసాయనాలు వాడుతూ, నాణ్యత లేకుండా తయారు చేస్తూ, వాటిని వ్యాపారులకు విక్రయిస్తున్నారు.నగరంలోని స్వీట్ హోమ్ యాజమాన్యం కూడా ఇదే తరహా రసాయనాలు వాడుతూ, వివిధ రకాల స్వీట్ల పేరుతో ప్రజల ఆరోగ్యానికి హానికరంగా వ్యవహరిస్తూ, వారి వ్యాపారమే ముఖ్యమనే విధంగా సంబంధిత అధికారులకు నెలకు పంపించాల్సిన మామూలు పంపిస్తే చాలు అని, వారు ఎటువంటి తినుబండారాలు అమ్మిన అధికారాలు మాత్రం పట్టించుకోరని ఆరోపించారు.. సంబంధిత అధికారులు ఒక్కరోజు వారి విధులను సక్రమంగా నిర్వర్తిస్తే, ఏలూరు నగరంలోను కల్తీ మాఫియా పై ఉక్కు పాదం మోపవచ్చని, ఎప్పటికప్పుడు నిఘా పెట్టి, కల్తి మాఫీయాకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి, కల్తీ తినుబండారాలు వ్యక్రయిస్తున్న ప్రతి ఒక్కరిపై చర్య తీసుకోవాలని ఆయన కోరారు.కల్తీ వ్యాపారం చేస్తున్న వారిపై చట్టపర్యమైన, తీవ్ర చర్యలతో పాటు జైలు జీవితం కూడా గడపవలసి వస్తుందన్నారు.. దీన్ని జనసేన పార్టీ నుండి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.. ఇప్పటికైనా తనిఖీ అధికారులు మేల్కొవాలని, మామూలుకు ఆశపడి, ప్రజల జీవితాలతో, ప్రజల ప్రాణాలతో ఆటలాడొద్దని ఈ సందర్భంగా హెచ్చరించారు.



## జనసేన పార్టీ సభ్యత్వ కార్యక్రమాలు ప్రారంభించిన మేడిశెట్టి సూర్యకిరణ్

**రౌతులపూడి, (మనసులో మాట)ఫిబ్రవరి 26:** మండలంలోని రౌతులపూడి గ్రామంలో స్థానిక జనసేన పార్టీ దిమ్మ దగ్గర ఏర్పాటుచేసిన జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి సభ్యత్వాన్ని రౌతులపూడి మండల ప్రధాన కార్యదర్శి షేక్ సలీం తీసుకున్నారు. ఈ సందర్భంగా మేడిశెట్టి సూర్యకిరణ మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే దృష్టిలో పెట్టుకుని ఈ సభ్యత్వ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని దీని ద్వారా జన సైనికుల కుటుంబాలకి ఆసరా అవుతుందని ప్రతి ఒక్కరూ దీన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూర్యకిరణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో తుని జోన్ ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం, జనసేన పార్టీ శంఖవరం మండలం అధ్యక్షుడు గాబు సుభాష్, శృంగవరం ఎంపీటీసీ గాది రాజబాబు, జనసేన పార్టీ రౌతులపూడి మండల ఉపాధ్యక్షుడు జై గంట, కత్తిపూడి బుచ్చి సీతమ్మ సత్రం నెంబర్ ప్రకృతి సతీష్, రౌతులపూడి మండల జనసేనకులు షేక్ షరీఫ్, పల్ల శ్రీను, పి వినోద్, ఎన్. నాగ సత్యనారాయణ, కర్రీ గంగాధర్, కీర్తి నాగు, మరియు రౌతులపూడి మండల జనసైనికులు పాల్గొన్నారు.

## మండలంలో పలువురిని పరామర్శించిన పోతుల



**గండేపల్లి (మనసులో మాట) ఫిబ్రవరి 26..** గండేపల్లి మండలం లో పలువురిని పరామర్శించిన రాష్ట్ర కమ్మ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహన్ రావు. ముందుగా గండేపల్లి మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన మాజీ జడ్పిటిసి యర్రంశెట్టి బాబ్జి తండ్రి యర్రంశెట్టి నారాయణరావు ఇటీవలే మరణించడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన అయినవిల్లి బుల్లయ్య కుమారుడు నాగేంద్ర ఇటీవలే మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు. ఆయన వెంట సర్పంచ్ లు శిలా మంతుల వీరబాబు మరియు మాజీ సర్పంచ్ పైన్నీ వెంకటేశ్వరరావు, ఉప్పలపాడు సర్పంచ్ అడబాల రామాంజనేయులు, తాళ్లూరువెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ దాపర్తి సీతారామయ్య , సుబ్బయ్యమ్మ పేట మాజీ సర్పంచ్ బొండా శ్రీనుబాబు, తాళ్లూరు విద్య కమిటీ చైర్మన్ జె సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్

- చెక్కుల పంపిణీ చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్
- 20 నెలల్లో 5.5 కోట్ల సహాయం.. ఎంపీ పుట్టా మహేష్ కుమార్
- ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్.
- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్న ఎంపీ
- 41 లక్షలకు పైగా విలువైన చెక్కులు పంపిణీ.
- నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పని చేస్తున్నాం






**ఏలూరు, ఫిబ్రవరి 26(మనసులో మాట)..** ఏలూరు పార్లమెంటు పరిధిలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చెప్పారు.గురువారం ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయంలో జవీ=ఖీ చెక్కులు పంపిణీ చేసి, ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంటు అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. తాను ఎంపీ అయిన తర్వాత ఈ 20 నెలల కాలంలో.. ఆరోగ్యం బాగాలేదని చెబుతూ, వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం కోరుతూ తన వద్దకు వచ్చిన 600 మందికి పైగా లబ్దిదారులకు 5.5 కోట్ల విలువైన జవీ=ఖీ చెక్కులు అందించటం జరిగిందని తెలిపారు. ఈరోజు ఒక్కరోజే 53 మంది లబ్ధిదారులకు 41,40,368 విలువైన జవీ=ఖీ చెక్కులు అందించటం జరిగిందన్నారు.

గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థలాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిసి ఏలూరు పార్లమెంట్ పరిధిలో 56 స్మశానవాటికలకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. అలాగే, రోడ్లు, రైళ్లు, ఆర్వోబీలు, కొత్త ప్రాజెక్టులు తేవటం, విద్యార్థుల భవిష్యత్తు కోసం౼ూ× ల్యాబులు ఏర్పాటు చేయటం, ఆసుపత్రులకు కొత్త పరికరాలు, అంబులెన్స్ సర్వీసులు ఏర్పాటు చేయటం వంటి పనులు చేస్తున్నామన్నారు. గ్రీవెన్స్ కోసం భారీగా తరలివచ్చిన ప్రజలతో బుధవారం ఎంపీ కార్యాలయం కిక్కిరిసిపోయింది. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్న ఎంపీ సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం | చిత్తూరు | కడప
శుక్రవారం 27 జనవరి 2026


# పిఆర్‌సి కమిషన్ ను వెంటనే ప్రకటించాలి

## - ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ బి. కే. ముత్యాలప్ప డిమాండ్




**ధర్మవరం ఫిబ్రవరి 26 (మనసులో మాట)..** పి ఆర్ సి కమిషన్ వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ బి కే ముత్యాలప్ప డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం ఈనెల 26,27 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తాలూకా కేంద్రాల వద్ద ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ధర్మవరం తాలూకా కేంద్రం దగ్గర ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు.

గత ప్రభుత్వం వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా రివర్స్ పిఆర్సి తో ఉద్యోగులను ఉపాధ్యాయులను మోసం చేసిందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తూ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లను వంచన చేస్తుందన్నారు. అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు పై ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని ప్రతిపక్ష నాయకుడి హోదాలో చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా నేడు ముఖ్యమంత్రి హోదాలో సిపిఎస్ రద్దు పై మాట్లాడకపోవడం సిగ్గుచేటు అని, సిపిఎస్ ఉద్యోగులను దగా చేయడమే అవుతుంది అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జులై 2023 నుండి 12వ పిఆర్సి అమలు కావలసి ఉండగా గడువు ముగిసి 30 నెలల దాటిన నేటికీ కనీసం పిఆర్సి కమిషన్ను కూడా నియమించకపోవడం శోచనీయం అని తెలిపారు. కావున వెంటనే 12వ పిఆర్సి కమిషన్ను నియమించి 30 శాతము మధ్యంతర భృతి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధరల ఇండెక్స్ ప్రకారం ఆరు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే దామాషా ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కరువు భత్యాన్ని విడుదల చేయాలి అని, ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లను ప్రజల్లో భాగంగా చూడాలని పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు బలరాముడు, రవీంద్ర రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు మెమో నంబర్ 57 ప్రకారం పాత పెన్షన్ వర్తింపజేయాలని, టెట్ నుండి ఇన్ సర్వీస్ టీచర్లను మినహాయించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించాలని, నెలవారి పదోన్నతులు పునరుద్ధరించాలని, ఈ హెచ్ ఎస్ అన్ని రకాల ఆస్పత్రులలో అన్ని రకాల వ్యాధులకు వర్తింపజేయాలని, కారుణ్య నియామకాలలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని, 2025లో బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ఈ హెచ్ ఎస్ వర్తింపజేయాలని, అన్ని రకాల బకాయిలు వెంటనే చెల్లించాలని, పదవీ విరమణ ప్రయోజనాలు కూడా వెంటనే చెల్లించాలని, పిఎఫ్ , ఏపీ జి ఎల్ ఐ పేమెంట్ల విషయంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ వాసుకుమార్ రవికుమార్, సంగీత, క్రిష్ణవేణి, ప్ర త్యేక ఆహ్వానితులు శంకరనారాయణ, హేమంత్ కుమార్ సీనియర్ నాయకులు బయన్న, నాగప్ప, శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు యాపుల భారాన్ని తగ్గించి బోధనకే పరిమితం చేయాలని, కేజీబీవీ టీచర్లకు ఎం టి ఎస్ వర్తింపచేయాలని, పి.ఎస్ హెచ్ఎం పోస్టులను ఎస్ జి టి లకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించి ఖాళీలను భర్తీ చేయాలని, మున్సిపల్ పాఠశాలల వ ర్య వే క్ష ణ కు వ ు ు ని సి ప ల్ ఉపాధ్యాయులనే ఎం ఈ వో లు గా నియమించాలని, పెన్సిలర్లకు 70 సంవత్సరాలకు 10 శాతం 75 సంవత్సరాలకు 15 శాతము అడిషనల్ క్వాంటం పెన్షన్ పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అధ్యక్షులు శంకరనారాయణ, ధర్మవరం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివానంద, ఈశ్వరయ్య, పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపి, అంజినాయక్, రామగిరి మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులు, హరి, సి. కే. పల్లి మండల శాఖ అధ్యక్షులు దుర్గ ప్రసాద్, బత్తలపల్లి మండల శాఖ అధ్యక్షులు గోపాల్, కనగానపల్లి అధ్యక్షులు చంద్రశేఖర్, జగదీష్, తిప్పన్న, కుమార్ వందమంది ఏపీటీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు. ధర్నా అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.



## పదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం

పలమనేరు ఫిబ్రవరి 26 ( మనసులో మాట): గంగవరం మండలంలోని కీలపట్ల గ్రామంలో ఉన్న ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం 10వ తరగతి వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ... పదవ తరగతి విద్యార్థులు బాగా చదువుకొని అత్యధిక మార్కులు సాధించాలని తెలిపారు. ఇప్పటినుండి చదువుపై ఏకాగ్రత తో చదువుపై దృష్టి పెట్టాలన్నారు. అందరూ బాగా చదువుకొని పాఠశాలకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు పి తులసీనాథం నాయుడుకు పదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి శాలవాకప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మమ్మురంగా 'ఉద్యమి' సభ్యత్వ నమోదు ప్రారంభం



**ధర్మవరం ఫిబ్రవరి 26 (మనసులో మాట)..** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు హిందూపురం పార్లమెంట్ పరిధిలో జనసేన పార్టీ 'ఉద్యమి' పేరుతో ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మమ్మురంగా ప్రారంభించినట్లు పార్లమెంట్ ఇన్‌చార్జి షేక్ రియాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు.

గురువారం ధర్మవరం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీని అభివృద్ధి పథంలో నడిపించాలనే లక్ష్యంతో రాష్ట్ర అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రియాశీలక సభ్యత్వాల నమోదు కోసం 'ఉద్యమి' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి పిలుపు మేరకు దాదాపు 50 లక్షల సభ్యత్వాలను నమోదు చేయాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ సంకల్పంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని నాయకులు కోరారు.



## ఆర్డీవో, ఎంపీడీవో, డీఎస్పీలు బదిలీ

### వెంటనే రిలీవ్ కావాలని హైకోర్టు ఆదేశాలు

**ధర్మవరం ఫిబ్రవరి 26 (మనసులో మాట)** ఆర్డీవో మహేష్ ను, ఎంపీడీవో సాయి మనోహర్, డి.ఎస్.పి హేమంత్ కుమార్ ను వెంటనే రిలీవ్ చేయాలని కోరుతూ బదిలీ వేటు హైకోర్టు వేసింది. వివరాలకు వెళితే రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రావడం జరిగిందని, అమరావతి లోని జిఏడీలో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డీఎస్పీ మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో రిపోర్ట్ చేసుకోవాలని పోలీస్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ముగ్గురు అధికారులు 2018 గ్రూప్ వన్ నోటిఫికేషన్ ద్వారా పోస్టర్లకు ఎంపిక కావడం జరిగింది. ఉద్యోగ ఎంపిక విషయంలో కొన్ని అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఎంపికైన అభ్యర్థులను షిట్ విచారణ నిమిత్తం కీలక పోస్టుల నుంచి అప్రధాన్య పోస్టులకు మార్చాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. మొత్తం మీద ధర్మవరంలో ముగ్గురు అధికారులు బదిలీ కావడంపై తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ముగ్గురు అధికారులు తమదైన శైలిలో అటు ప్రజలకు న్యాయాన్ని చేకూరుస్తూ, మంచి గుర్తింపు కూడా పొందారు.

## ఏపీఎంఐపీలో ఆటోమేషన్ పథకం

### - రైతులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం



**ధర్మవరం , ఫిబ్రవరి 26 (మనసులో మాట)..** ధర్మవరం నియోజకవర్గం లోని బత్తలపల్లి మండలం సంజీవపురం గ్రామంలో ఏపీఎంఐపీలో ఆటోమేషన్ పథకం గురించి రైతులకు రైతు సేవ కేంద్రం సిబ్బందికి అవగాహన కార్యక్రమం సంజీవపురం గ్రామంలో జరిగింది.

ఆటోమేషన్ పథకం ద్వారా డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను ఉపయోగించి పంటలకు నీరు వృధా కాకుండా అందించవచ్చు. ఈ పథకంలో మోటర్ కంట్రోల్స్, కంట్రోల్ వాల్స్, వాల్స్ ప్రభుత్వం రాయితీ మీద అందిస్తుంది. చిన్న, సన్నకారు రైతులకు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 55% సబ్సిడీ, ఇతర రైతులకు 45% సబ్సిడీ తో ఈ పథకం ద్వారా రైతులు పంట కనుగుణంగా పన్నీరు వృధా కాకుండా ఎంత సమయానికి ఎంత నీరు ఇవ్వాలో ఎక్కడ నుంచైనా అందించవచ్చు. ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీ చంద్రశేఖర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీసీ ధనుంజయ్, ఎంఐఓ శివశంకర్, రైతు సేవ కేంద్రం సిబ్బంది, ప్రతినిధులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## నియమ నిబంధనల ప్రకారమే ప్రైవేట్ ఆసుపత్రులు నడుపుకోవాలి

### - డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ భాగ్యలక్ష్మి.



**ధర్మవరం ఫిబ్రవరి 26 (మనసులో మాట)..** ప్రభుత్వ నియమ నిబంధనలు ప్రకారమే ప్రైవేట్ ఆసుపత్రులు నడుపుకోవాలని డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు వారి కార్యాలయంలో పట్టణంలోని ప్రైవేట్ డాక్టర్స్ తో సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ , జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఆదేశానుసారము సమావేశం నిర్వహించి పలు విషయాలను తెలియజేశారు. ముఖ్యంగా ప్రైవేట్ హాస్పిటల్స్ కు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ఉండాలి, అలాగే అనుమతి ఉండాలి, హాస్పిటల్స్ లో పనిచేయుచున్న డాక్టర్లు క్వాలిఫికేషన్ బట్టి వారు సేవలు అందించాలని, క్వాలిఫికేషన్ లేని సేవలను అందించకూడదని తెలియజేశారు. అలాగే పిసి పిఎన్డిటి యాక్ట్ ప్రకారం స్కానింగ్ సెంటర్లను నడుపుకోవాలని సూచించారు. అలాగే హాస్పిటల్స్ నందు ల్యాబ్ లకు కూడా అనుమతి తీసుకుని క్వాలిఫైడ్ ల్యాబ్ టెక్నీషియన్స్ను పెట్టుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి హాస్పిటల్ పరిశుభ్రంగా ఉంచుకొని పట్టణ ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి పాల్గొన్నారు. తదుపరి ప్రవేట్ డాక్టర్స్ అందరూ కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ భాగ్యలక్ష్మి అభినందన శుభాకాంక్షలు తెలిపారు.

## ధర్మవరం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద బీఎస్పీ ఆందోళన

- పీడీ ప్రమీల అవినీతి అక్రమాలపై అలుపెరగని పోరాటం
- తప్పుడు పత్రాలతో ఫిర్యాదులను మూసివేయడంపై సాకే వినయ్ కుమార్ ఆగ్రహాశీ
- ధర్మవరం బీఎస్పీ ఇంచార్జ్ సాకే వినయ్ కుమార్ సంచలన ఆరోపణలు
- ఐసీడీఎస్ పీడీ ప్రమీలపై అవినీతి ఆరోపణలు నెల రోజులుగా పోరాటం
- ఆర్జేడీ రోహిణి విచారణపై స్పష్టత లేదు బీఎస్పీ ఆరోపణ - గ్రీవెన్స్ క్లోజ్‌పై వివాదం, తప్పుడు నమోదు చేశారని ఆరోపణ
- మా సంతకాలు లేకుండా రికార్డులు సృష్టించారు.. బీఎస్పీ నేతల ఆగ్రహం - అవినీతి ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణకు డిమాండ్



ధర్మవరం ఫిబ్రవరి 26 (మనసులో మాట) శ్రీ సత్యసాయి జిల్లా మహిళా అభివృద్ధి , శిశు సంక్షేమ శాఖలో జరుగుతున్న అవినీతి బయటపడే వరకు పోరాటం కొనసాగుతుందని ధర్మవరం నియోజకవర్గ బాధ్యులు సాకే వినయ్ కుమార్ తెలిపారు. ధర్మవరం ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఎస్సీ జన సంఘం రాష్ట్ర బాధ్యులు మాల్యావంతం రామ్ ప్రసాద్ మాట్లాడుతూ పీడీ ప్రమీలపై పోషకాహార పంపిణీ బిల్లుల వ్యవహారాల్లో అవినీతి జరుగుతున్నట్లు ఇప్పటికే డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ , విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సరైన విచారణ జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 17న తాను కేవలం పుట్టపర్తి కార్యాలయానికే వెళ్లినప్పటికీ, సీకేపల్లి, హిందూపురం, ఓబులదేవరచెరువు మరియు ధర్మవరం ప్రాంతాలను కూడా సందర్శించినట్లు అధికారులు తప్పుడు రికార్డులు సృష్టించారని ఆరోపించారు. అంతేకాకుండా, ఫిర్యాదుదారుడైన తన అనుమతి లేకుండానే పి జి ఆర్ ఎస్ వ్యవస్థలో ఫిర్యాదును వెనక్కి తీసుకున్నట్లు నమోదు చేసి కేసును మూసివేయడం ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధమని తీవ్రంగావిమర్శించారు. ఈ సందర్భంగా మాల్యావంతం రామ్ ప్రసాద్ మాట్లాడుతూ, విచారణ లేకుండానే తప్పుడు రికార్డులతో క్లీన్ చిట్ ఇవ్వుకోవడం అంగీకారయోగ్యం కాదని, బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా దళిత, బహుజన సంఘాలతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ స్వతంత్ర థర్డ్ పార్టీ విచారణ జరిపించి నిజానిజాలు బయటపెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు విజయ్ కుమార్, గణేష్ మరియు ఎస్సీ జన సంఘం నాయకులు శీను, గణేష్, నరేంద్ర పాల్గొన్నారు.

## రైల్వేటేషన్, పరిసర ప్రాంతాలలో తనిఖీలు చేసిన టూటౌన్ సీఐ రెడ్డప్ప.



ధర్మవరం ఫిబ్రవరి 26 (మనసులో మాట) పట్టణములోని రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాలలో రాత్రి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా అనుమానితులను మొబైల్ స్కానింగ్ డివైస్ ద్వారా వారి యొక్క వేలిముద్రలతో తనిఖీ చేయడం జరిగిందని వారు తెలిపారు. దీనివలన ఎవరైనా గతంలో నేరాలలో పాల్గొనడం జరిగి ఉంటే వారిని ఈ యొక్క డివైస్ ద్వారా నేరస్థులుగా గుర్తించే అవకాశం ఉందని తెలిపారు. ఇది నిరంతరము జరుగుతుందని తెలిపారు. అప్రమత్తమైన వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని వారు సూచించారు.

## వైసీపీ తప్పులను వైఎస్సార్‌తో ముడిపెట్టడం సరికాదు

### - కాంగ్రెస్ నాయకుడు తుంపర్తి పరమేష్



ధర్మవరం ఫిబ్రవరి 26 (మనసులో మాట) వైసీపీ తప్పులను వైయస్సార్ తో ముడి పెట్టడం సరికాదు అని కాంగ్రెస్ నాయకుడు తుంపర్తి పరమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ అత్తమీద కోపం దుత్తమీద చూపినట్లుంది కూటమి తీరు ఇలా ఉందని, తిరుమల పవిత్రతపై పాపం వైసీపీ చేస్తే ,వైఎస్సార్‌కు చుట్టడం చంద్రబాబుకి భావ్యం కాదు అని తెలిపారు. చంద్రబాబు ఆరోపణలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలి అని, వైఎస్సార్‌కు చంద్రబాబు క్షమాణలు చెప్పాలి అని డిమాండ్ చేశారు. వైఎస్సార్ ఏడు కొండలను రెండు కొండలను చేయాలని ఏనాడూ అనుకోలేదు అని వైఎస్సార్‌ది సంక్షేమ పాలనైతే .. వైసీపీది దోచుకుతిన్న పాలన అని వారు విమర్శించారు. వైసీపీ అరాచకాలతో వైఎస్సార్‌కు సంబంధం లేదు అని వారు స్పష్టం చేశారు. వైసీపీ పార్టీలో వైఎస్సార్ లేరు అని, రాజశేఖర్ రెడ్డి ముమ్మాటికి కాంగ్రెస్ మనిషి అని తెలిపారు. మాట్లాడే పద్ధతి మార్చుకోవాలని ఉచిత సలహా ఇచ్చారు.

## రేపు ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం

**పలమనేరు ఫిబ్రవరి 26( మనసులో మాట) :** పలమనేరు పట్టణ ప్రజలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయిరాం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి మరియు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించబడుతుంది. బెంగళూరు నుండి వచ్చే ప్రత్యేక వైద్య నిపుణులు క్యాన్సర్, గుండె, షుగర్ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. ఈ సదవకాశాన్ని పట్టణ రూరల్ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరం సాయిరాం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో జరుగుతుందన్నారు.




## వృధాగా పోతున్న నీరు- పట్టించుకోని అధికారులు



పలమనేరు ఫిబ్రవరి 26( మనసులో మాట) : రూరల్ మండలంలోని జగమర్ల గ్రామంలో వృధాగా పైప్ లైన్ లీకేజీ కావడంతో గ్రామంలో ప్రధాన రహదారి గుండా నీరంతా వృధాగా వెళ్ళిపోతుంది. అధికారులకు తెలిపిన పట్టించుకోవడంలేదని అక్కడ ప్రజలు తెలిపారు. ఏది ఏమైనాప్పటికీ గ్రామంలో వేసవికాలం దృష్ట్యా ఇలా పైప్ లైన్ లో నీరు వృధాగా పోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా గ్రామానికి ప్రధాన రహదారి పై నీరు ప్రవహించడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ సచివాలయ సిబ్బంది కూడా అధికారుల దృష్టికి తేవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వృధాగా పోతున్న నీటిని వెంటనే పైప్ లైన్ కు మరమ్మత్తులు చేసి నీటిని అరికట్టాలని జగమర్ల గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
శుక్రవారం 27 ఫిబ్రవరి 2026


# కుమ్మెర ఘటనపై ఎన్‌హెచ్ఆర్‌సీ సీరియస్

**పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

**నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం**

**కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు**

**బాధితులకు న్యాయం చేయాలని స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** నాగర్‌కర్నూల్‌లో జరిగిన కుల వివక్ష దాడి , పోలీసుల నిర్లక్ష్యంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. ఘటనపై నాలుగు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. న్యాయవాది వినోద్ హిందుస్థానీ దాఖలు చేసిన ఫిర్యాదుపై స్పందిం చిన కమిషన్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీకి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై తీసుకున్న చర్యల నివేదికను నాలుగు వారాల్లోగా సమర్పించాలని ఆదేశించింది. ఈనెల 18న కుమ్మెర మల్లన్న స్వామి జాతర సందర్భంగా చిలుకేశ్వరం చంద్రకళ కుటుంబాన్ని ఆలయంలోకి ప్రవేశాన్ని నిరాకరించడంతో పాటు రెండు నెలల పసికందును ఉద్దేశపూర్వకంగా తొక్కడంతో ఆ శిశువు మరణించింది. నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులు నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుపడుతూ న్యాయవాది కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులు నాగర్‌కర్నూల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లినప్పుడు, నిందితులకు ఉన్న రాజకీయ పలుకుబడి కారణంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి అధికారులు నిరాకరించారని ఆరోపించారు. పోలీసులు రాజ్యాంగ రక్షణలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను సైతం ఉల్లంఘించారని కమిషన్ గుర్తించిందన్నారు. నిందితులను అరెస్టు చేయడం, విధి నిర్వహణలో విఫలమైన పోలీసు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, బాధితులకు రక్షణతో పాటు పరిహారం అందించాలని కమిషన్ పేర్కొందని వివరించారు.. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయం జరిగే ప్రక్రియలో రాజకీయ పలుకుబడి అడ్డంకి కాకూడదని నిర్ధారించడానికి కమిషన్ జోక్యం ఒక కీలక ముందడుగు అన్ని వినోద్ హిందుస్థానీ పేర్కొన్నారు

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు




- మొత్తం 45మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీడీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది. పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్‌ను నియమించారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా దాన కిషోర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీధర్‌ను నియమించారు. ఎండోమెంట్స్ కమిషనర్‌గా హనుమంతరావుకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ శాఖ సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్‌ను నియమించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రాను నియమించారు. విజయేంద్ర - మహబూబ్‌నగర్ కలెక్టర్ పదవి నుంచి సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా నియామకం అయ్యారు. అద్వైత్ కుమార్ సింగ్ - మహబూబాబాద్ నుంచి ఢిల్లీ తెలంగాణ భవన్ సమన్వయ శాఖకు బదిలీ అయ్యారు. సిక్తా పట్నాయక్ - నారాయణపేట్ నుంచి ఆర్థిక శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సందీప్ కుమార్ ఝా - జనగాం కలెక్టర్‌గా నియామకం అయ్యారు. ముష్రఫ్ అలీ ఫారూఖీ - టీఎస్‌జీపీడీసీఎల్ సీఎండీగా నియామకం అయ్యారు. జితేష్ వి.పాటిల్ - టీఎస్‌జీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్నేహ శబరీష్ - మహబూబాబాద్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. గరిమా అగర్వాల్- రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియామకం జరిగింది. ప్రతిమ సింగ్ - మెదక్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అనికేత్ - భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ,చాహత్ బజ్పాయి - హనుమకొండ కలెక్టర్‌గా,ఖుష్బూ గుప్తా - మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా , పమేలా సత్పతి - లేబర్ కమిషనర్‌గా, అనురాగ్ జయంతి - యాదాద్రి కలెక్టర్‌గా ,ప్రదీప్ జైన్ - నారాయణపేట్ కలెక్టర్‌గా నియామకం జరిగింది.



## భారతీయ విద్యాభవన్ తరహాలో

# సర్కారు స్కూళ్లు

**ప్రైవేట్ స్కూళ్ల ఫీజులకు కళ్లెం వేసేలా చర్యలు**

- మౌలిక వసతులతో పాటు..బ్రేక్‌ఫాస్ట్
- విజయ డెయిరీ ద్వారా పాల సరఫరా
- రవాణా కోసం ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం
- సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదు-పాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు. గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌పైన సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశానికి సీఎం సల హాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు క కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మాని యా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి హాజరయ్యా రు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో తప్పనిసరిగా పాలు అందజేయాలని నిర్దేశిరచారు. ఇందుకోసం విజయా డైరీ నుంచి పాలు సేకరించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీని వినియోగించాలని దిశానిర్దేశర చేశారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కొక మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో ట్రాన్స్‌పోర్ట్‌తో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటు పైన అధ్యాయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దుతో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలని హుకుం జారీ చేశారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ని ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# పేదలే ఇందిరమ్మ ప్రభుత్వ పేటెంట్




- వెలుగుమట్లలో ఇళ్లు కూలగొట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- ఆధారాలు చూపిన మంత్రి పొంగులేటి
- కేటీఆర్‌కు మంత్రుల స్ట్రాంగ్ కౌంటర్


**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను రాష్ట్ర మంత్రులు తీవ్రంగా ఖండించారు. "పేదలే ఇందిరమ్మ ప్రభుత్వ పేటెంట్" అని, బాధితులకు ఇళ్ల స్థలాలు మరియు ఇళ్లు ఇచ్చే పూర్తి బాధ్యత తమ ప్రభుత్వానిదేనని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 2023 జూలై 15న వెలుగుమట్లలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే పేదల ఇళ్లను కూలగొట్టించిందని, ఆ సంఘటనకు సంబంధించిన ఫోటోలను ప్రదర్శిస్తూ నిలదీశారు. అప్పట్లో ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు హైకోర్టు ఉత్తర్వుల మేరకు జరిగిన అక్రమ నిర్మాణాల తొలగింపుపై మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారం అర్హులైన ప్రతి పేదవాడికి ఇంటి స్థలం, ఇల్లు కచ్చితంగా ఇస్తామని ఆయన భరోసా ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్షల కోట్ల అవినీతిపై కూడా మంత్రులు నిప్పులు చెరిగారు. కమీషన్ల కోసమే ప్రాజెక్టును తప్పుగా నిర్మించి రాష్ట్ర సంపదను సముద్రం పాలు చేశారని, కాళేశ్వరం అవినీతి సొమ్ముతోనే బీఆర్ఎస్ దేశంలోనే అత్యంత ధనిక ప్రాంతీయ పార్టీగా మారిందని విమర్శించారు. కేసీఆర్ తన పాలనలో దోచుకున్న సొమ్ముతో పేదలకు ఇళ్లు కట్టించి పాప పరిహారం చేసుకోవాలని ఎద్దేవా చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చినా కేంద్రం స్పందించకపోవడాన్ని బట్టి చూస్తే బీజేపీ-బీఆర్ఎస్ మధ్య ఉన్న రహస్య ఒప్పందం అర్థమవుతోందని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరై, నిర్మాణాత్మకమైన సలహాలు ఇవ్వాలని, గత ప్రభుత్వంలాగా తాము గొంతు నొక్కబోమని, ప్రతిపక్షానికి మాట్లాడే పూర్తి అవకాశం ఇస్తామని మంత్రులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత మీదే

- ఆకలినైనా సహిస్తారు కానీ ఆధిపత్యాన్ని కాదు..
- తెలంగాణ ప్రజల మనస్తత్వాన్ని గుర్తుంచుకోవాలి
- గ్రూప్-1, 2 అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ, ఆధిపత్యాన్ని సహించబోరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి గ్రూప్ 1 పరీక్షలను నిర్వహించి.. నియామక పత్రాలు అందిం చామన్నారు. గ్రూప్ 1, 2 ఉద్యోగుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలను అమ్ముకున్నామని కోర్టుల్లో లీగల్ లిటిగేషన్ పెట్టారని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క తప్పు కూడా చేయలేదని అన్నారు. బాగా చదువుకున్న వాళ్లను టీజీపీఎస్సీలో నియమించాం. అన్ని జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించాం. మీరంతా శిక్షణ పూర్తి చేసుకొని ఉద్యోగాల్లో చేరుతున్నారు. ప్రభుత్వం మిమ్మల్నే రాష్ట్ర ప్రతినిధులుగా భావిస్తోంది. మీ ద్వారానే ప్రభుత్వ పథకాలు అమలవుతాయి. మేం ఎన్ని పాలసీలు చేసినా.. దాని అమల్లో మీరే చాలా ముఖ్యం. బాధ్యతాయుతమైన పదవుల్లో చేరుతున్నారు. ఉద్యోగవిరమణ రోజు వరకు ఇదే స్ఫూర్తితో పని చేయాలి' అని దిశానిర్దేశర చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులతోపాటు శిక్షణ పూర్తి చేసుకున్న 271 మంది గ్రూప్-1, 171 మంది గ్రూప్-2 అధికారులు, 51 మంది మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.



# వీహెచ్, జెట్టిలకు రాజ్యసభ ఇవ్వాలి

**ఆ ఇద్దరి సభ్యత్వాలపై ఆలోచన చేయాలని**

**ఖర్గేను కలిసి కోరిన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి ఇవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు. ఖర్గేతో ఆయన పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాలపై సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కూడా ఈ విషయంపై మాట్లాడానని, వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి రాజ్యసభ ఇవ్వాలని కోరానని అన్నారు. ఇదే విషయంపై రాహుల్ గాంధీని, మల్లికార్జున్ ఖర్గేని కలవడానికి ఢిల్లీకి వచ్చానని తెలిపారు. రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారని చెప్పుకొచ్చారు. వి. హనుమంతరావు. జెట్టి కుసుమ కుమార్‌లకు రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని కోరానని తెలిపారు. జెట్టి కుసుమ కుమార్.. యూత్ కాంగ్రెస్ లీడర్‌గా, స్టూడెంట్ లీడర్‌గా.. కమ్మ సామాజిక వర్గం నుంచి ఉన్నారని ప్రస్తావించారు. జెట్టి కుసుమ కుమార్ ఫ్యామిలీ ఫ్రీడమ్ ఫైటెర్స్ అని, వాళ్ల కుటుంబం నుంచి అంతా కాంగ్రెస్‌లోనే ఉన్నారని గుర్తుచేశారు. హనుమంతరావు తెలంగాణలో అనేక మంది ముఖ్యమంత్రులతో పని చేశారని వెల్లడించారు. మూడుసార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారని చెప్పుకొచ్చారు. ఆయనకు రాజీవ్ గాంధీ , సోనియాగాంధీ అవకాశాలు ఇచ్చారని తెలిపారు. వి.హనుమంతరావు చురుకైన వ్యక్తి అని, ఆయనకు మరోసారి రాజ్యసభకు అవకాశం ఇవ్వాలని ఖర్గేను కోరానని అన్నారు. కమిటీలో చర్చిస్తామని ఖర్గే హామీ ఇచ్చారని తెలిపారు. రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# చిన్నారి మృతి కారకులను శిక్షించాలి

**లేదంటే హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం**

**మాజీమంత్రి తలసాని హెచ్చరిక**



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 26 :** కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల చిన్నారి మృతికి కారణమైన వారిని శిక్షించాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నాగర్ కర్నూల్ కేంద్రంలో కుమ్మెర బాధితుల పక్షాన చేపట్టిన దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులలో దోషులపై చర్యలు తీసుకోకుంటే హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని , అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అభం శుభం తెలియని చిన్నారి మృతికి కారకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజల పట్ల కొనసాగుతున్న వివక్ష, దాడులు, దౌర్జన్యాలు, ఆలయాల్లో ప్రవేశంపై ఆంక్షలు కొనసాగడం బాధాకరమని అన్నారు.దేవుడిని దర్శించుకునే అర్హత బలహీన వర్గాలకు లేదా? అని ప్రశ్నించారు. కుమ్మెర దోషులను రక్షించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

# గిరిజన కళపై ఐదు రోజుల శిక్షణ





**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ సూచనల మేరకు గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా వినూత్నంగా 20 మంది క్రాఫ్ట్ టీచర్స్ మరియు 10 మంది గిరిజన ఆర్టిజన్స్ మొత్తం 30 మందికి గిరిజన సంప్రదాయక కళల పైన ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ అనే అంశంపై ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాదులో 26 వ తేదీ నుండి 2 మార్చ్ వరకు నిర్వహిస్తున్నారు. శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులు ఐటిడిఏ ఉట్నూర్, ఎటునాగారం, భద్రాచలం, ప్లెయిన్ ఏరియా నుండి సంబంధిత ఐటిడిఏ అధికారుల ద్వారా నామినేట్ చేయబడి రావడం జరిగింది. వీరందరికీ భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా పదిమంది గిరిజన ఆర్టిజన్స్ కు ప్రతిరోజు వెయ్యి రూపాయల చొప్పున ఆనరోరియం కూడా ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో టిఆర్ఐ సంచాలకులు డాక్టర్ వి సముజ్వల , టి ఆర్ ఐ సంగ్రహాలయ సంరక్షకులు డాక్టర్ డి సత్యనారాయణ , శిక్షణనిస్తున్న డైరెక్టర్ డా. సునీతా ప్రసాద్ బృందం, ట్రైనింగ్ కోఆర్డినేటర్ శ్రీమతి అజ్మీరా శైలజ , టిఆర్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యమంటే ఇండ్లు కూల్చడమేనా?

- పట్టాలు, పన్ను రశీదులు ఉన్నా దౌర్జన్యమా?
- బాధితులకు అండగా సుప్రీంకోర్టుకైనా..
- కూల్చిన చోటే గృహప్రవేశం చేయిస్తాం
- ఖమ్మం బాధితుల పక్షాన కేటీఆర్ గర్జన



**ఖమ్మం, ఫిబ్రవరి 26:** తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో తొలగించిన ఆక్రమణలను కేటీఆర్ పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. వచ్చే నెల16వ తేదీ నుంచి అసెంబ్లీ ప్రారంభ మవుతుందని ఖమ్మం ప్రజల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని అన్నారు. మీ అందరికీ న్యాయం జరిగేవరకూ మీ పక్షాన ప్రభుత్వంపై పోరాడతామని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే మీ అందరికీ ఇదే స్థలంలో ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని కేటీఆర్ భరోసా కల్పించారు. అందరూ ధైర్యంగా ఉండాలని అంటూ బాధితులకు కేటీఆర్ మాటిచ్చారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ఎక్కడ చూసినా కూల్చివేతలేనని ఆరోపించారు. ఖమ్మంలో కూల్చివేసిన కాలనీ చూశానని.. ముగ్గురు మంత్రులకు 60 ఎకరాల మీద కన్నుబడిందని ఆక్షేపించారు. ముగ్గురు మంత్రులు కలిసికట్టుగా ఈ దుర్మార్గం చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరికీ తాము అన్యాయం చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అందరూ ధైర్యంగా ఉండాలని.. మీ అందరికీ అదే ప్రాంతంలో అక్కడే ఇళ్ల స్థలాలు ఇల్లు ఇస్తామని మాటిచ్చారు. ఇక్కడి వారందరికీ అండగా నిలబడాలని తాను వచ్చానని చెప్పుకొచ్చారు. ఇళ్ల కూల్చివేతపై కోర్టుకి కూడా వెళ్దామని.. మీకెవరికీ ఒక రూపాయి ఖర్చు లేకుండా మీ తరపున తమ లీగల్ టీం పోరాడుతుందని మాజీమంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్నఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. రేవంత్ సర్కార్ కనికరం లేకుండా ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల ఇళ్లను నేలమట్టం చేస్తోంది. ఈ క్రమంలో వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులను కలిశారు. ఇళ్లు కోల్పోయిన వెలుగు మట్ల బాధితులను కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మిమ్మల్ని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుస్తరు. మీకు అది చేస్తం.. ఇది చేస్తం.. అది చేస్తమని.. మీ 900 కుటుంబాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తాడు. మీరు ఐక్యంగా ఉంటేనే విజయం సాధిస్తరు.. లేదంటే వీళ్లు ఏం చేస్తరు. ఏ 100 మందితో వేలి ముద్రలు తీసుకొని మీకు ఆన్నేన్నో ఇస్తరు.. కేసీఆర్ 2000 డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించారు. వాటిలో కొన్ని మిగులున్నయట. ఆ ఇండ్లలో కొంతమందికిస్తమని చెప్పి వారిని లొక్కెళతారని కేటీఆర్ హెచ్చరించారు. ఓపీడీఆర్ వాళ్లు గతంలో ఎప్పుడో చేసిన పని. పాపం వాళ్లేం తప్పు చేయలేదు.. మీకు పట్టాలిప్పించారు. వాళ్లు తప్పు చేసిందేమి లేదు.. ఇప్పుడు వాళ్లను పట్టుకుని ప్రభుత్వం నానా మాటలు అంటోంది. ల్యాండ్ మాఫియానట.. ఎవడమ్మా ల్యాండ్ మాఫియా.. ఎవడైతే ఇవాళ మీ చుట్టూ వందల ఎకరాలు కొన్నాడో.. ఎవడైతే పేదవాడి ఇల్లు కట్టుకున్నడో వాడు మాఫియానా..? మీకు జరిగిన కష్టం.. మీ ఏడుపులు రాష్ట్రం మొత్తం చూసింది. మీ పిల్లలు, మీరు పడుతున్న అవస్థలు చూసే కేసీఆర్ సార్ మమ్మల్ని పంపించారు. దయచేసి ధైర్యంగా ఉండండి.. మీకు అన్ని రకాలుగా అండగా అజయ్ అన్న, మా ఎంపీ గాయత్రి రవిచంద్ర ఉంటారన్నారు. ఏ తప్పు జరుగకపోతే ఆర్డీవోను ఎందుకు వెంటనే బదిలీ చేశారు. సమాధానం చెప్పాలే ప్రభుత్వం. మంత్రులు తప్పు చేయకపోతే.. నిజంగా ధైర్యముంటే వాళ్లెందుకు రావడం లేదు.. ఇక్కడికి.. వాళ్లొచ్చి మాట్లాడాలి కదా.. అందుకే మీరు ధైర్యంగా ఉండండి. మీ వెంబడి కేసీఆర్ అన్న ఉన్నడు.. కేటీఆర్ అన్న ఉన్నడు. మేమంతా ఉన్నం. ఎట్టి పరిస్థితుల్లో మీకు న్యాయం జరిగేదాకా మేము అండగా ఉంటామని హామీనిచ్చారు. మీకు అన్ని కాగితాలున్నాయి.. కోర్టుకు పోదాం.. కోర్టుకు కూడా మీరు రూపాయి ఖర్చు పెట్టుకునే పని లేదు. పార్టీ తరపున మేం కొట్లాడుతాం.. మీకు మేం అండగా ఉంటాం. మళ్లీ వస్తాం మిమ్మల్ని కాపాడుకుంటాం. న్యాయపరంగా పట్టాలిప్పించే ప్రయత్నం చేస్తాం. దయచేసి ఐకమత్యాన్ని కోల్పోకండి.. సంఘటితంగా, ఒక్కటిగా ఉండండని సూచించారు.





# భూభారతి పేరుతో కాంగ్రెస్ మార్క్ అవినీతి

- రెవెన్యూ వ్యవస్థను భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ సర్కార్
- మాజీ మంత్రి హరీష్ రావు విమర్శ
- సిద్దిపేట అర్బన్ ఎమ్మార్వో కార్యాలయం సందర్శన



**సిద్దిపేట, ఫిబ్రవరి 26:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని, ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని చెప్పిన నాయకులు.. ఇప్పుడు 'భూభారతి' పేరుతో ప్రజలను గోసపెడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీష్ రావు విమర్శించారు. గురువారం సిద్దిపేట అర్బన్ ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన, అక్కడ పడిగాపులు కాస్తున్న ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వారం రోజుల్లోనే ఇంటికి వచ్చే పాస్ పుస్తకాలు, ఇప్పుడు ఆరు నెలలైనా రావడం లేదని హరీష్ రావు మండిపడ్డారు. రెవెన్యూ సదస్సుల పేరిట రైతులు పెట్టుకున్న 8.68 లక్షల దరఖాస్తులను ప్రభుత్వం పక్కన పడేసిందని, సాదా బైనామా భూముల విషయంలో 'అమ్మిన వ్యక్తి అఫిడవిట్ ఇవ్వాలి' అనే కొత్త నిబంధన తెచ్చి లక్షలాది మంది రైతుల నోట్లో మట్టికొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిషేధిత భూముల జాబితాను ఆన్‌లైన్‌లో పెట్టకుండా కోటి ఎకరాలకు పెంచేసి కాంగ్రెస్ నేతలు పక్కాగా రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని ఆరోపించారు. హైకోర్టు మొట్టికాయలు వేస్తున్నా ప్రభుత్వ తీరు మారడం లేదని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తోందని ఆయన విమర్శించారు. రెవెన్యూ శాఖలో అవినీతి పరాకాష్టకు చేరిందని, సాక్షాత్తు మంత్రి కుమారుడే భూకబ్జాలకు పాల్పడుతుంటే ప్రశ్నించిన సీఐని బదిలీ చేయడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. చనిపోయిన వీఆర్ఓల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, 4 వేల మంది వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రెవెన్యూ సమస్యలను పరిష్కరించకుంటే రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల పక్షాన గట్టిగా పోరాడుతామని హరీష్ రావు హెచ్చరించారు.

# మార్చి 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా '100 రోజుల ప్రణాళిక'

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** సీఎం ఆదేశాల మేరకు రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం '100 రోజుల కార్యాచరణ ప్రణాళిక'ను సిద్ధం చేసింది. సచివాలయంలో గురువారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో కలిసి ఈ ప్రణాళికపై చర్చించారు. మార్చి 2 నుంచి జూన్ 9 వరకు (తెలంగాణ ఆవిర్భావ వేడుకల వరకు) ఈ 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ వంద రోజుల ప్రణాళికపై ఈ నెల 28న ముఖ్యమంత్రి స్వయంగా కార్యదర్శులతో సమావేశమై దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం మార్చి 1న (ఆదివారం) రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లందరితో సీఎం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై తక్షణమే నివేదికలు రూపొందించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ తమ పరిధిలోని అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న భవనాల వివరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఈ 100 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యం, వ్యవసాయం, పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యుత్ వంటి అన్ని కీలక శాఖలు ఈ 100 రోజుల కార్యాచరణలో భాగం పంచుకోనున్నాయి. ముఖ్యంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లకు పారిశుధ్యం, గ్రామీణాభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీఎస్ స్పష్టం చేశారు. అలాగే పాలనలో పారదర్శకత కోసం సచివాలయంతో పాటు అన్ని హెచ్ఓడీ కార్యాలయాల్లో 'ఈ-ఆఫీస్' విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేస్తూ, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ 100 రోజుల కార్యక్రమం ఒక వేదికగా నిలవనుంది.



# సిద్దిపేటలో ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు!

**ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినుల సందడి**

**కట్టుదిట్టమైన భద్రత మధ్య ప్రారంభమైన పరీక్షలు**

**గదుల వివరాల కోసం నోటీసు బోర్డుల వద్ద బారులు తీరిన విద్యార్థినులు**




**మనసులో మాట - సిద్దిపేట**

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలు సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే విద్యార్థినులు తమ హాల్ టికెట్లతో పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. కేంద్రం వద్ద ఎలాంటి గందరగోళం లేకుండా అధికారులు సజావుగా ఏర్పాట్లు చేశారు. తల్లిదండ్రులతో కలిసి వచ్చిన విద్యార్థినులు నోటీసు బోర్డుపై తమకు కేటాయించిన గది నంబర్లు చూసుకుని పరీక్షా హాల్లోకి ప్రవేశించారు.

పరీక్షలు సమయానికి ప్రారంభమయ్యేలా నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ భద్రత కట్టుదిట్టంగా నిర్వహించారు. ఇన్విజిలేటర్లు, సిబ్బంది విద్యార్థినులకు అవసరమైన సూచనలు అందించారు. ప్రశ్నాపత్రాలు సమయానికి పంపిణీ చేయగా.. పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగాయి. తమ పిల్లలు పరీక్షలు విజయవంతంగా రాయాలని ఆకాంక్షిస్తూ తల్లిదండ్రులు కళాశాల ప్రాంగణం బయట వేచి చూశారు. మొత్తానికి సిద్దిపేట పట్టణంలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా మొదలయ్యాయి.

# అనారోగ్యంతో ఉన్న మహిళకు భరోసా

- రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీ అందజేత!
- సిద్దిపేట కాంగ్రెస్ ఇంచార్జి పూజల హరికృష్ణ ఉదారత
- పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- ఆపద సమయంలో అండగా ఉంటామని వెల్లడి



**మనసులో మాట - సిద్దిపేట**

సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు గ్రామానికి చెందిన మక్కన లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ వెంటనే స్పందించారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం తరపున రూ. 2,50,000 విలువైన ఎల్‌ఓసీ పత్రాన్ని మంజూరు చేయించారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఈ సహాయక పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ ధ్యేయమని, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రజలు అధైర్యపడొద్దని సూచించారు. ప్రభుత్వం, పార్టీ నాయకత్వం ఎల్లప్పుడూ ప్రజలకు తోడుగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వెల్కటూరు గ్రామ సర్పంచ్ నరేష్, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు నాయిని నర్సింహా రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు నాయకులు మేరుగు రాజు, మాజీ ఉప సర్పంచ్ బత్తిని వెంకటేశం, వార్డు సభ్యుడు మల్లమ్మరి శంకర్, గోల్లెనా నరేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఆపద సమయంలో ఆర్థిక సహాయం అందించిన హరికృష్ణకు బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మత్తులో స్టీరింగ్ పడితే ప్రాణాలు గాల్లోనే..

- 'అరైవ్ఉఅలైవ్'తో రంగంలోకి దిగిన సీపీ!
- రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించిన అంబర్ కిషోర్ ఝా
- "నీ మత్తు చుక్క.. నీ కుటుంబ కన్నీటి చుక్క కాకూడదు" అని నినాదం
- మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



**మంచిర్యాల, ఫిబ్రవరి 26 (మనసులో మాట):**

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 'అరైవ్-అలైవ్' రెండో విడత కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన ఐబీ చౌరస్తాలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్వయంగా పర్యవేక్షించి, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను చేపట్టారు. "నువ్వు తాగే మత్తు చుక్క.. నీ కుటుంబ కన్నీటి చుక్క కాకూడదు" అనే నినాదంతో పోలీసులు క్షేత్రస్థాయిలో రోడ్లపైకి వచ్చారు. ప్రతి వాహనదారుడు సురక్షితంగా తన ఇంటికి చేరుకోవాలనే ఉన్నత ఆశయంతో ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు సీపీ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే కేవలం జరిమానాలే కాకుండా, కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. కేవలం కేసులు నమోదు చేయడం పోలీసుల ఉద్దేశ్యం కాదని, ప్రాణ విలువను గుర్తించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు.

*"మీ ప్రాణం మీ కుటుంబానికి ఎంతో విలువైనది. ట్రాఫిక్ నియమాలు పాటించడం అంటే పోలీసుల కోసం కాదు, మీ భద్రత కోసం అని గుర్తించండి."*
*-అంబర్ కిషోర్ ఝా, పోలీస్ కమిషనర్.*

**శాఖల సమన్వయం - పకడ్బందీ తనిఖీలు**

ఈ కార్యక్రమంలో సీపీతో పాటు ఉన్నతాధికారుల బృందం క్షేత్రస్థాయిలో పాల్గొని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించే వారి పట్ల రాజీ పడే ప్రసక్తే లేదని అధికారులు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ ప్రమోద్ రావు, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు. మంచిర్యాల పోలీసులు చేపట్టిన ఈ 'అరైవ్-అలైవ్' కార్యక్రమం పట్ల ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోంది.

# మధ్యాహ్న భోజన బియ్యంలో పురుగులు.. చర్యలు తీసుకోవాల్సిందే!

**తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన 'తపస్' నేతలు**

**విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం వద్దు**

**ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ద్వారా విచారణ జరిపిస్తామన్న అధికారులు**



**జుక్కల్, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా అవుతున్న మధ్యాహ్న భోజన బియ్యం నాణ్యత అత్యంత దారుణంగా ఉందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆందోళన వ్యక్తం చేసింది. బియ్యంలో పురుగులు ఉండటం వంటి సమస్యలపై బుధవారం తహసీల్దార్ వేణు గోపాల్, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డికి సంఘం ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. సమస్యను తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. వెంటనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీకి సమాచారం అందించి, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం దృష్ట్యా నాణ్యమైన బియ్యం సరఫరా అయ్యేలా త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షులు రచ్చ శివకాంత్, బిచ్కుంద మండల అధ్యక్షుడు ముత్యాల సందీప్, ప్రధాన కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు. నాయకులు అనిల్ రెడ్డి, సంగమేశ్వర్, దేవిదాస్ తో పాటు సీఆర్పీలు ప్రమోద్, గోపాల్, సుధాకర్ తదితరులు పాల్గొని విద్యార్థులకు మంచి ఆహారం అందేలా చూడాలని కోరారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంపై స్థానిక ఉపాధ్యాయులు, విద్యా వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

# బిచ్కుంద డిగ్రీ కళాశాలలో మండల స్థాయి క్రీడలు

**విజేతలకు బహుమతులు అందజేసిన ప్రిన్సిపల్ అశోక్**

**చదువుతో పాటు క్రీడలు అవసరం**

**కేంద్ర యువజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ**



**జుక్కల్, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** బిచ్కుంద ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కేంద్ర యువజన వ్యవహారాల శాఖ, నిజామాబాద్ జిల్లా యువజన కార్యాలయం సంయుక్తంగా 'మేరా యువ భారత్' (బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్) పేరుతో ఈ పోటీలను నిర్వహించాయి. జిల్లా యువజన సమన్వయకర్త బి. శైలి ఆదేశాల మేరకు వాలంటీర్ సునీల్ రాథోడ్ ఈ క్రీడా వేడుకను పర్యవేక్షించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ కె. అశోక్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆటలు ఆడటం వల్ల శారీరక దృఢత్వం చేకూరడమే కాకుండా మానసిక ఉల్లాసం లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. వెంకటేశం, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ టి. హన్మండ్లు, క్రీడల విభాగం సమన్వయకర్త డాక్టర్ వై. సంజీవరెడ్డి, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి!

**ఇండియన్ బ్యాంకు మేనేజర్ జ్యోతి పిలుపు**

**గాగిల్లాపూర్‌లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు**

**బీమా పథకాలు, కేవైసీ ప్రయోజనాలపై వివరణ**



**బెజ్జంకి, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** బ్యాంకు ఖాతాదారులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ బ్యాంకు మేనేజర్ జ్యోతి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో బెజ్జంకి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం, ఇండియన్ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ జ్యోతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాల ప్రాముఖ్యతను గుర్తించాలని కోరారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జేజేబీవై, పీఎం ఎస్బీవై వంటి బీమా పథకాల్లో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కేవైసీ అప్‌డేట్ చేసుకోవడం వల్ల ఖాతాలు సురక్షితంగా ఉంటాయని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు వివరాలు చెప్పకూడదని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కౌన్సిలర్ ప్రవీణ్, ఏబీఎం మోహన్, ఫీల్డ్ ఆఫీసర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు పాల్గొన్నారు. అలాగే ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు మహేష్, సతీష్ తో పాటు స్థానిక రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# మహిళా సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

**ఆవిష్కరించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**

**మార్చి 3న నాగోల్‌లో ప్రగతిశీల సమ్మేళనం**

**జయచంద్ర రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ**



**ఎల్బీనగర్, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జయచంద్ర రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో "తెలంగాణ ప్రగతిశీల మహిళ సమ్మేళనం" మార్చి 3వ తేదీన నాగోల్‌లోని పీఎంఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మహిళల సాధికారత, సమాన హక్కులు, విద్యా, ఉపాధి అవకాశాల విస్తరణకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, వారి ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని మహిళలు పార్టీలకు అతీతంగా భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ మహిళా నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్‌కు వివాహ ఆహ్వానం!

**కుమారుడి పెళ్లికి రావాలన్న డిప్యూటీ సీఎం భట్టి**

**గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసిన భట్టి, కేఎల్ఆర్**

**రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక చర్చ**



**రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** లోక్ భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కలిసి హైదరాబాద్‌లో మార్చి 5న జరిగే తన కుమారుడు సూర్య విక్రమాదిత్య పెళ్లికి రావాలని ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క.. కేఎల్ఆర్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు పరిచయం చేశారు. లీడ్ ఇండియా ద్వారా మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ, గురుకులాలు, హాస్టళ్లలో ఉన్న లక్షలాది మంది విద్యార్థులకు ఉచితంగా నైపుణ్య శిక్షణ తరగతులు అందించినట్లు గవర్నర్‌కు వివరించారు. కేఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా విద్యా, వైద్య రంగాల్లో అందిస్తున్న అనేక సేవా కార్యక్రమాలను ఆయనకు తెలియజేశారు. అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మాజీ ఎమ్మెల్యే, లీడ్ ఇండియా అధినేత కేఎల్ఆర్ చర్చించారు.

# ఉచిత 3డీ ప్రింటింగ్ శిక్షణకు ఆహ్వానం!

**మహబూబాబాద్ ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీలో ప్రవేశాలు**

**ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద మూడు నెలల కోర్సు**

**వివరాలు వెల్లడించిన ప్రిన్సిపాల్ ఎన్. బాబు**

**మహబూబాబాద్, ఫిబ్రవరి 26:** మహబూబాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీలలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 కింద 3డీ ప్రింటింగ్ కోర్సులో 20 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ఏటీసీ ప్రిన్సిపాల్ ఎన్. బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

మూడు నెలల శిక్షణ కోసం మార్చి 4వ తేదీ నుంచి నూతనంగా నిర్మించిన ఏటీసీ నందు అత్యాధునిక మిషనరీలో శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. టీసీ 344137 కింద 3డీ ప్రింటింగ్ ఆపరేటర్ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తామని, శిక్షణ సమయంలో బయోమెట్రిక్ హాజరు కచ్చితంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కోర్సు పూర్తయిన తర్వాత అసెస్‌మెంట్ నిర్వహించి ప్రభుత్వ పాస్ సర్టిఫికెట్ అందజేస్తామని వివరించారు.

దరఖాస్తు చేసుకునేందుకు కావాల్సిన ఎస్ఎస్సీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్, వ్యక్తిగత ఈమెయిల్ ఐడీలతో నేరుగా కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. 3డీ ప్రింటింగ్ టెక్నాలజీలో నైపుణ్యం సాధించడంతో పాటు స్వయం ఉపాధి కోసం రుణ సదుపాయాల అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ కోర్సు ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవచ్చని, తద్వారా మెరుగైన స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ బాబు కోరారు.

# గ్రూప్ వన్ విజేతలతో ముఖాముఖి!

- ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ప్రొబేషనరీ అధికారులతో ఓరియంటేషన్
- బీసీ స్టడీ సర్కిల్ నుంచి 50 మంది విద్యార్థుల ఎంపిక
- వెల్లడించిన స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ



**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి గ్రూప్ వన్ పరీక్షలలో విజయం సాధించి, ఎంపికైన అభ్యర్థులను ఆయా శాఖలకు వారివారి ర్యాంకులను బట్టి కేటాయించడం, వారికి శిక్షణ నిమిత్తం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ట్రైనింగ్ కోర్స్‌కి పంపించడం మనందరికీ తెలిసిందే. ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్లు, ప్రొబేషనరీ డీఎస్పీలు, ఇతర అధికారులు దాదాపు 260 మంది మొదటి బ్యాచ్ ట్రైనింగ్‌లో ఉన్నారు. వారందరూ వేర్వేరు నేపథ్యాల నుంచి పోటీ పరీక్షలలో పాల్గొని విజయాలు సాధించి నిలిచిన వారు. లక్షలాది మంది పోటీపడే ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షలలో విజేతలయిన వీరందరూ స్ఫూర్తిప్రదాతలు, ప్రేరణ కారకాలని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. వారితో మాట్లాడటం, వారి అనుభవాలను తెలుసుకోవడం, వారి ప్రణాళికలతో పరిచయం కలగడం, వారి మార్గదర్శకత్వాన్ని స్వీకరించడం ద్వారా పోటీ పరీక్షల అభ్యర్థులు తమని తాము సన్నద్ధం చేసుకోవడానికి సరైన మార్గం దొరుకుతుందని ఆయన వెల్లడించారు.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పన్నెండు బీసీ స్టడీ సర్కిళ్లలో యూపీఎస్సీ ప్రిలిమ్స్, ఇతర పోటీ పరీక్షల ఫౌండేషన్ కోర్సులలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులలో 50 మందిని ఎంపిక చేసి.. గురువారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు, ట్రైనీ డీఎస్పీలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనే విధంగా చొరవ తీసుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో యూపీఎస్సీ ప్రిలిమ్స్ కోసం వంద మంది అభ్యర్థులు ఎంపిక కాగా వారిలో 50 మందిని మరింత వడపోసి ఎంపిక చేసి ఈ ముఖాముఖి కార్యక్రమానికి పంపించడం విశేషం. తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి ముప్పై మూడు జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థుల్లో గ్రామీణ నేపథ్యం, తెలుగు మీడియం, వ్యవసాయ కుటుంబాలు, దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాల నుంచి వచ్చిన అభ్యర్థులు ఈ 50 మందిలో ఉన్నారు. అందరూ ప్రత్యక్షంగా గ్రూప్ వన్ విజేతను కలవడం ద్వారా తమలో ఉండే సంకోచాలు, బిడియాలు తొలగిపోతాయని.. పరీక్షలను ఎదుర్కొనే విధానం, పరీక్షలలో రాసే మెలకువలు వంటి ఎన్నో విషయాలు ముఖతః ప్రత్యక్షంగా తెలుసుకోవడం సాధ్యమవుతుందని హరికృష్ణ వివరించారు. ఎంతో ప్రణాళికాబద్ధంగా జరిగే శిక్షణా కార్యక్రమాలతో పాటు ఈ మెలకువలు భవిష్యత్‌లో వారికి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో వివిధ కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన సిలబస్‌ని అనుసరించి వివిధ సబ్జెక్టులలో నిపుణులైన వ్యక్తులతో క్లాస్‌లను, ఉపన్యాసాలను, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక లెక్చర్ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్స్, బయోడైవర్సిటీ, డిజాస్టర్ మేనేజ్మెంట్, కరెంట్ అఫైర్స్, న్యూమరికల్ ఎబిలిటీ, మెంటల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, సీ-శాట్ లాంటి అంశాలన్నీ తెలుస్తాయన్నారు. అయితే వీటిని చదువుకోవడంలో, గుర్తు పెట్టుకోవడంలో, ఆబ్జెక్టివ్ పరీక్షలో సరైన సమాధానాన్ని గుర్తించడంలో ఉండే షార్ట్‌కట్స్‌ని, మెలకువలను అభ్యర్థులు ఈ ట్రైనీ ఆర్డీవో, డీఎస్పీలతో ముఖాముఖి చర్చలలో పాల్గొనడం ద్వారా తెలుసుకుంటారని స్పష్టం చేశారు.

బీసీ స్టడీ సర్కిల్ ప్రస్థానంలో ఇది మొట్టమొదటిసారి జరుగుతున్న బృహత్ ప్రయత్నం అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఒకరిద్దరు విజేతలతో ఇన్స్పైరింగ్, మోటివేషనల్ స్పీచ్‌లు, సన్మానాలు చేసిన సందర్భం ఉందన్నారు. కానీ ఇలా ఏక కాలంలో రెండు వందల అరవై మందికి పైగా ఆర్డీవో, డీఎస్పీలతో బీసీ స్టడీ సర్కిల్ విద్యార్థులకు ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఇది మొదటిసారి అని గుర్తుచేశారు. భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతపు వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులకు మరింత మెరుగైన శిక్షణ సౌకర్యాలను అందించే దిశగా చేస్తున్న ప్రయత్నాల్లో ఇది తొలి సోపానంగా భావిస్తున్నట్లు ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సమర్థులైన నాయకులనే ఎన్నుకోవాలి!

**బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం పర్యటన**

**రెండో వార్డు ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం**

**బాన్సువాడ, ఫిబ్రవరి 26:** బాన్సువాడ పట్టణంలోని 2వ వార్డు బీడీ కార్మికుల కాలనీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, స్థానిక శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. వార్డు ప్రజలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మీ మీ వార్డుల నుంచి సమర్థవంతమైన నాయకులను మీరే ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. అలా ఎన్నుకున్న నాయకులకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. వారిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని, అప్పుడే రానున్న రోజుల్లో మన వార్డులను, పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చు అని వారు స్థానికులకు వివరించారు.

ఈ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పరీక్షల వేళ ట్రాఫిక్ చలాన్ల దందా!

**విద్యార్థుల తల్లిదండ్రులకు పోలీసుల వేధింపులు**

**పరీక్షా కేంద్రాల వద్ద ఫోటోలు తీసి ఫైన్లు**

**అధికారుల తీరుపై టీఆర్పీ నేత వెంకటేష్ గౌడ్ ఆగ్రహం**





**ఎల్బీనగర్, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైన సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సేవాభావంతో సహకరించాలని ఎల్బీనగర్ నియోజకవర్గ ఇంచార్జి, రంగారెడ్డి జిల్లా తెలంగాణ రాజ్యాధికారం పార్టీ (టీఆర్పీ) అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్ కోరారు. పరీక్షా కేంద్రాలకు వెళ్లేటప్పుడు విద్యార్థులు లిఫ్ట్ అడిగినా, ఏదైనా వస్తువు మర్చిపోయినా వాహనదారులు వారికి సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పరీక్షా కేంద్రాలకు తమ పిల్లలను దూర ప్రాంతాల నుంచి తీసుకొచ్చే తల్లిదండ్రుల ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులు వారికి సహకరించాలని ఆయన కోరారు. కానీ కొందరు ట్రాఫిక్ పోలీసులు అతి ఉత్సాహంగా నడిరోడ్డుపై బండ్లను ఆపి ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, ఇన్సూరెన్స్ ఉన్నాయా అంటూ చలాన్లు రాస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేధింపులు తాళలేక తల్లిదండ్రులు తమ పార్టీ హెల్ప్ లైన్‌కు ఫోన్ చేసి మొరపెట్టుకుంటున్నారని ఆయన వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్దకు వెళ్లి మరీ ట్రాఫిక్ పోలీసులు బండ్ల ఫోటోలు తీసి చలాన్లు ఇంటికి పంపిస్తున్నారని ఆయన మండిపడ్డారు. తమ పిల్లలు పరీక్షలు ఎలా రాస్తున్నారో అని తల్లిదండ్రులు ఒకవైపు ఆందోళన చెందుతుంటే.. కేంద్రాల బయట ఉన్న బండ్ల వద్దకు వచ్చి పోలీసులు చలాన్లు రాయడం దారుణమన్నారు. ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు అర్హత లేకున్నా ఫోటోలు తీసి తమ అధికారుల మెప్పుకోసం, ప్రభుత్వ ఖజానా నింపడం కోసం చలాన్ల రూపంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇలాంటి పద్ధతి మంచిది కాదని, తక్షణమే ఈ వేధింపులు ఆపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీస్ అధికారులను వెంకటేష్ గౌడ్ హెచ్చరించారు.

# పిల్లల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి!

**ఉపాధ్యాయులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచన**

**కలెక్టరేట్‌లో 'శక్తి' కార్యక్రమంపై ప్రత్యేక సమీక్ష**



**పెద్దపల్లి, ఫిబ్రవరి 26:** పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీహర్ష 'శక్తి' కార్యక్రమం అమలు తీరుపై విద్యాశాఖ, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా సంస్థల్లోని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మధ్య మంచి అనుబంధం (కనెక్షన్) ఏర్పడాలనే ఉద్దేశంతో చేపట్టిన శక్తి కార్యక్రమం అద్భుతమైన ఫలితాలను అందించిందని అన్నారు. ఈ కార్యక్రమం అమలు వల్ల పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు వారి విద్యా ప్రమాణాలు కూడా ఎంతో మెరుగ్గా తయారయ్యాయని కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మరిన్ని మెరుగైన ఫలితాల సాధన దిశగా ఉపాధ్యాయులు అడుగులు వేయాలని ఆయన సూచించారు.

కేవలం పాఠాలు బోధించడమే కాకుండా పిల్లల పట్ల ఉపాధ్యాయులు ప్రేమ చూపెడితే వారి మధ్య మంచి కనెక్టివిటీ ఏర్పడుతుందని ఆయన స్పష్టం చేశారు. దీని కారణంగా విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు మనం సరైన మార్గదర్శకం చూపే అవకాశం ఉంటుందనే ప్రధాన ఉద్దేశంతో చేపట్టిన శక్తి కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా అమలవుతోందని కలెక్టర్ ప్రశంసించారు.

ఈ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శారద, అకాడమిక్ మానిటరింగ్ అధికారులు పీఎం షేక్, జీసీడీఓ కవిత పాల్గొన్నారు. వీరితో పాటు మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సంబంధిత విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పసిపాప మృతిపై హత్య కేసు నమోదు చేయాలి!

- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్
- కుల వివక్షకు పసికందు బలికావడంపై జిల్లా వ్యాప్త నిరసనలు
- బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని హెచ్చరిక



**గొల్లపెల్లి, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** నాగర్‌కర్నూలు జిల్లా కుమ్మెర జాతరలో చోటుచేసుకున్న అమానవీయ ఘటనపై ఎమ్మార్పీఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిందితులపై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాయి. కుల వివక్ష కారణంగా రెండు నెలల పసికందు మరణించడం సభ్యసమాజం తలదించుకోవాల్సిన విషయమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుమల గంగారం ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గురువారం మృతి చెందిన పసిపాప చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పించి నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా గంగారం మాట్లాడుతూ రజక కుటుంబానికి చెందిన చంద్రకళ తన కుటుంబంతో కలిసి మల్లన్న స్వామి దర్శనానికి వెళ్లగా.. అగ్రకులానికి చెందిన కొందరు వ్యక్తులు వారిని అడ్డుకోవడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. దర్శన టికెట్ సాకుతో గొడవకు దిగి, రెండు నెలల పసిపాపను కాలితో తొక్కడం వల్లే ఆ బిడ్డ ప్రాణాలు కోల్పోయిందని ఆయన ఆరోపించారు. నిందితులపై కేవలం వివక్ష కేసు కాకుండా, హత్య కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని గట్టిగా డిమాండ్ చేశారు.

బాధితులకు ప్రభుత్వం తక్షణమే భారీ ఆర్థిక సహాయం ప్రకటించి ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని గంగారం కోరారు. భవిష్యత్తులో ఇలాంటి కుల వివక్ష ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలను అమలు చేయాలని హితవు పలికారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాస్తూ ఆలయ ప్రవేశాన్ని అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ధూమాల గంగారం మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు బోనగిరి కిషన్ మాదిగ, మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు శనిగారపు కాంతక్క మాదిగ పాల్గొన్నారు. వీరితో పాటు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దుమల గంగాధర్ మాదిగ, జిల్లా నాయకులు నక్క సతీష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సంగపు ముత్తు మాదిగ విచ్చేశారు. జిల్లా సీనియర్ నాయకులు దయ్యాల హనుమంత్ మాదిగ, జగిత్యాల నియోజకవర్గం ఇన్ ఛార్జి బొల్లారం దివాకర్ మాదిగ, నియోజకవర్గ కో ఇన్ ఛార్జ్ పొడేటి సునీల్ మాదిగ, జగిత్యాల రూరల్ మండల అధ్యక్షులు దాసరి సతీష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మోతే సుధాకర్ మాదిగ, గంగాధర మధుసూదన్ మాదిగ, తిరుపతి మాదిగ, నరసయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# చందాపూర్ అంగన్వాడీ పర్యవేక్షణ కమిటీ నియామకం!



- సర్పంచ్ కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక
- చిన్నారులకు పౌష్టికాహారం, మెరుగైన వసతులు అందాలి
- ఐసీడీఎస్ పర్యవేక్షణలో గర్భిణులు, బాలింతలకు అవగాహన

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** చిన్నశంకరంపేట మండలంలోని చందాపూర్ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ పర్యవేక్షణ కమిటీని సర్పంచ్ కృష్ణ గౌడ్ సమక్షంలో గురువారం నియమించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణ గౌడ్ మాట్లాడుతూ చిన్నారులకు అన్ని విధాల సదుపాయాలతో పాటు పోషణ పక్కాగా అందుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అనంతరం ఐసీడీఎస్ సూపర్వైజర్ అంజమ్మ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో అంగన్వాడీ పర్యవేక్షణ కమిటీని అధికారికంగా నియమించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేఖర్, అంగన్వాడీ టీచర్ స్వప్న, వార్డు సభ్యులు తుడుం సిద్దిరాములు, తలారి సిద్దమ్మ పాల్గొన్నారు. వీరితో పాటు ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్ రెడ్డి, కేటాయిడ్ ఎంప్లాయ్ పందరి గౌడ్, ఆశ వర్కర్ ఏసుమని, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య!

చిన్నశంకరంపేటలో విషాదం.. అనుమానాస్పద స్థితిలో మృతి

తొమ్మిదేళ్ల క్రితం పెళ్లి.. ఇద్దరు పిల్లలున్న శ్రీలత

తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు



**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** చిన్నశంకరంపేట మండల కేంద్రంలో అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ ఇంట్లో ఉరేసుకుని మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జాల శ్రీలత (30)కు తొమ్మిదేళ్ల క్రితం మెదక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన సిద్దయ్య కుమార్తెకు జాల సునీల్ తో వివాహం జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీలత చున్నీతో ఉరేసుకుని ప్రాణాలు తీసుకుంది. కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి చూసేసరికి అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తన కుమార్తె మృతిపై తండ్రి సిద్దయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



# చిన్నశంకరంపేట ఎంఈఓగా దీప్లా రాథోడ్

- మండల విద్యాధికారిగా బాధ్యతల స్వీకరణ
- కలెక్టర్ ఆదేశాలతో నియామక ఉత్తర్వులు
- ఉపాధ్యాయ సంఘాల నేతల ఘన సన్మానం

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** చిన్నశంకరంపేట మండల విద్యాశాఖ అధికారిగా దీప్లా రాథోడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిన్నశంకరంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా, నోడల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయనను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ విజయ్ ఎంఈఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన దీప్లా రాథోడ్‌ను ఆయా గ్రామాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే

**జూలపల్లి, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** జూలపల్లి మండలం బాలరాజపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన లబ్ధిదారులు కోరుకంటి సత్తమ్మ - ఓదెలు దంపతులు నిర్మించుకున్న నూతన గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి వారికి శుభాభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి, ఉపసర్పంచి, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు. జూలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. పేద ప్రజల సొంతింటి కల నెరవేరడం సంతోషదాయకమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఆకాంక్షించారు.




# పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణ లక్ష్మి!

జూలపల్లిలో 23 మంది లబ్ధిదారులకు రూ. 23,27,697 చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు చేతుల మీదుగా అందజేత

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలకు కొండంత భరోసా



**జూలపల్లి, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** జూలపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నాడు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు రూ. 23,27,697 కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద అండగా నిలుస్తున్నాయని అన్నారు. మహిళల సాధికారతకు ఇవి దోహదపడుతున్నాయని, ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాల అమలులో తాము ముందున్నామని.. ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు సన్న వడ్లకు బోనసు, నిరుపేదలకు వైద్యం కోసం ఎఓసీలు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇలా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ముందుకు పోతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో పయనించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలం అయ్యే విధంగా పాలన కొనసాగుతోందని, రైతులకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడించారు. ప్రజలందరూ కాంగ్రెస్ పాలనలో సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, పలు గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను నివారించాలి!

జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశం

నిబంధనలు పాటించాలన్న అదనపు ఎస్పీ మహేందర్

కలెక్టరేట్‌లో రవాణా అధికారులతో సమీక్షా సమావేశం



**మెదక్, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** రోడ్డు ప్రమాదాలను నివారించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో రోడ్డు రవాణా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించి.. ప్రజల్లో రోడ్డు రవాణాపై అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకుని బండి నడపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బెట్టింగ్ మహమ్మారికి మరో బలి..

# అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య!

ఆన్‌లైన్ బెట్టింగ్ ఉచ్చులో చిక్కి రూ. 25 లక్షలు పోగొట్టుకున్న మహేష్

తండ్రి మరణంతో అనాథలైన ఇద్దరు ఆడపిల్లలు.. లక్ష్మీపూర్‌లో విషాదం



**గొల్లపెల్లి, ఫిబ్రవరి 26 (మనసులో మాట):** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు సామాన్యుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. క్షణికావేశంలో ఆశకు పోయి లక్షలాది రూపాయలు పోగొట్టుకుని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ఒక యువకుడు బెట్టింగ్ యాప్ మాయలో పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గర్వందుల మహేష్ అనే యువకుడు కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో దాదాపు రూ. 25 లక్షల వరకు డబ్బును బెట్టింగ్‌లో పోగొట్టుకున్నట్లు సమాచారం. పెట్టిన డబ్బు రాకపోగా చేసిన అప్పులు పేరుకుపోవడంతో మహేష్ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక దిక్కుతోచని స్థితిలో గురువారం ఊరి చివరన ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహేష్ మరణంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. తండ్రి మరణవార్త విని చిన్నారి పిల్లలు ఏడుస్తున్న తీరు గ్రామస్తులను కన్నీరు పెట్టించింది. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని లక్ష్మీపూర్ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి యాప్‌లను వెంటనే నిషేధించి ఇంకెక్కడా ఇలాంటి విషాదాలు జరగకుండా చూడాలని వేడుకుంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# రాజకీయ 'క్రీ'నీడలో బ్యూరోక్రసీ

వ్యవస్థల విధ్వంసం.. అధికారుల భవితవ్యం అంధకారం!

## రాజకీయ కక్షసాధింపు చర్యలకు సమిధలుగా మిగిలిపోతున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు

### బలిపీఠంపై కింది స్థాయి అధికారులు

ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజాస్వామ్యవాదులు



ప్రజాస్వామ్యానికి వెన్నెముకగా నిలవాల్సిన బ్యూరోక్రసీ (అధికార యంత్రాంగం) నేడు రాజకీయ కక్షసాధింపు చర్యలకు సమిధగా మారుతోంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నాయి. అధికారం మారినప్పుడల్లా 'పాత' అధికారులపై వేటు, 'కొత్త' అధికారులకు పట్టాభిషేకం అన్నట్లుగా సాగుతున్న ఈ ప్రహసనం చివరకు వ్యవస్థల పతనానికి దారితీస్తోంది. అధికారం ఉన్నప్పుడు 'అతి' చేయడం, అధికారం పోయాక 'అజ్ఞాతంలోకి' వెళ్లడం లేదా 'సస్పెన్షన్ల' పాలవ్వడం ఇప్పుడు ఏపీలో నిత్యకృత్యమైంది.

## కేసుల ఉచ్చులో ఐఏఎస్, ఐపీఎస్ లు

గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తీసుకున్న నిర్ణయాలకు గానూ శ్రీలక్ష్మి వంటి ఐఏఎస్ అధికారులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఆ పరంపర నేటికీ కొనసాగుతోంది.

**వైసీపీ హయాంలో:** ఏబీ వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ రమేష్ కుమార్ వంటి ఉన్నతాధికారులు ప్రభుత్వంతో న్యాయపోరాటం చేయాల్సి వచ్చింది. కేవలం రాజకీయ ప్రాధాన్యతలు మారాయన్న కారణంతో వారికి పోస్టింగులు ఇవ్వకుండా వేధించారనే విమర్శలు ఉన్నాయి.

## కూటమి ప్రభుత్వంలో 'రివర్స్' యాక్షన్

**2024లో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సీన్ రివర్స్ అయింది. గత ఐదేళ్లలో అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులపై ఇప్పుడు ఉచ్చు బిగుస్తోంది.**

**ముంబై నటి కేసు:** ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ సీతారామాంజనేయులు, విశాల్ గున్ని వంటి ఐపీఎస్ అధికారులు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

**లిక్కర్ & స్కిల్ స్కామ్:** కాంతిరాణా టాటా, విజయకుమార్ వంటి అధికారులు మద్యం కుంభకోణం ఆరోపణల్లో చిక్కుకోగా, చంద్రబాబు అరెస్టు సమయంలో కీలక పాత్ర పోషించిన సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు.

**టీటీడీ ప్రక్షాళన:** తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో మాజీ ఈవో ధర్మారెడ్డి, సింఘాల్ వంటి అధికారుల నిర్ణయాలు ఇప్పుడు రాజకీయ రచ్చకు కారణమయ్యాయి.

**రాజకీయ నాయకులు ఐదేళ్లకోసారి మారుతుంటారు, కానీ బ్యూరోక్రాట్లు 30-35 ఏళ్ల పాటు సేవలో ఉంటారు. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం చట్టాన్ని అతిక్రమిస్తే, భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రస్తుత పరిణామాలు హెచ్చరిస్తున్నాయి. అధికారులు 'రాజకీయ నీడ' నుంచి బయటకు వచ్చి, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించకపోతే.. ఏపీ బ్యూరోక్రసీ కేవలం 'ప్రతీకార రాజకీయాల'కు వేదికగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.**

**అమరావతి, మనసులో మాట (పొలిటికల్ బ్యూరో)**

## అధికార పీఠం - అధికారుల ఆట

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా, తమకు అనుకూలంగా వ్యవహరించే అధికారులను కీలక పోస్టుల్లో కూర్చోబెట్టుకోవడం, ప్రత్యర్థి పార్టీలను అణచివేయడానికి వారిని ఆయుధాలుగా వాడుకోవడం పరిపాటిగా మారింది. 2010 నుండి మొదలైన ఈ 'క్విడ్ ప్రో కో' సంస్కృతి, నేడు పరాకాష్టకు చేరింది. రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వహించాల్సిన అధికారులు, రాజకీయ యజమానుల కనుసన్నల్లో మెలిగితేనే మనుగడ సాగించగలమనే భయాందోళనలో ఉన్నారు.

## కింది స్థాయి అధికారుల పరిస్థితి దారుణం

కేవలం ఉన్నతాధికారులే కాదు, క్షేత్రస్థాయిలో పనిచేసే డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల మాట వినకపోతే లూప్ లైన్ పోస్టింగులు, విచారణలు తప్పవనే భయం వారిని వెంటాడుతోంది. రాజకీయ నేతల 'జేబు సంస్థలు'గా పోలీస్ స్టేషన్లు మారుతున్నాయన్న ఆరోపణలు ప్రజాస్వామ్యవాదులను కలవరపెడుతున్నాయి.

## రాజ్యాంగం వర్సెస్ రాజకీయం

అధికారులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన చోట, రాజకీయ విధేయతను ప్రదర్శించడమే అసలు సమస్యకు మూలం. "అధికారులు పాలకుల సేవకులు కాదు, ప్రజల సేవకులు. కానీ ఏపీలో అధికారులు పార్టీల కార్యకర్తల కంటే దారుణంగా వ్యవహరిస్తున్నారు" అని మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వ్యవస్థల పతనం:** సీబీఐ, ఈడీ, ఏసీబీ వంటి స్వతంత్ర సంస్థలను రాజకీయ కక్ష సాధింపులకు వాడుకోవడం వల్ల సామాన్య ప్రజలకు వ్యవస్థలపై నమ్మకం పోతోంది.

## అంధకారంలో భవిష్యత్తు.. వ్యవస్థకు ముప్పు

**రాజకీయ నాయకుల ఆదేశాలను గుడ్డిగా పాటించే అధికారులు తాత్కాలికంగా లబ్ధి పొందినా, ప్రభుత్వం మారగానే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. సస్పెన్షన్లు, కోర్టు కేసులు, విచారణల వల్ల అధికారుల ప్రమోషన్లు ఆగిపోయి, వారి కెరీర్ అర్ధాంతరంగా ముగిసిపోతోంది. చట్టం పట్ల గౌరవం కంటే, రాజకీయ యజమాని పట్ల విధేయతకే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల వ్యవస్థపై సామాన్య ప్రజలకు నమ్మకం పోతోంది. ఏ నిర్ణయం తీసుకుంటే రేపు ఏ ప్రభుత్వం వచ్చి బోనులో నిలబెడుతుందో అన్న భయంతో అధికారులు ఫైళ్లపై సంతకాలు చేయడానికి కూడా వెనుకాడే పరిస్థితి నెలకొంది.**


## ప్రజాస్వామ్యవాదుల ఆందోళన

*"అధికారులు పార్టీలకు కాకుండా, రాజ్యాంగానికి జవాబుదారీగా ఉండాలి. కానీ నేడు వ్యవస్థలు కలుషితమయ్యాయి. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో పరిపాలన కుంటుపడుతుంది"* అని మేధావులు హెచ్చరిస్తున్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో అధికారులను సమిధలను చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిది.

రాజకీయ నాయకులు వస్తుంటారు, పోతుంటారు. కానీ శాశ్వతంగా ఉండేది అధికార యంత్రాంగమే. అధికారులు తమ విచక్షణను కోల్పోయి రాజకీయ రంగు పులుముకుంటే, భవిష్యత్తులో వారు అనుభవించే శిక్షలకు వారే బాధ్యులవుతారు. ఇప్పటికైనా బ్యూరోక్రాట్లు రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించడం, పాలకులు అధికారులను తమ స్వార్థానికి వాడుకోకుండా ఉండటమే రాష్ట్ర ప్రయోజనాలకు శ్రేయస్కరం







# ఘనంగా అర్జున్ -సానియా ప్రీవెడ్డింగ్ ఈవెంట్

## వచ్చే నెల 5న జరుగనున్న వివాహం

క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ కుమారుడు అర్జున్ తెందుల్కర్ వివాహం వచ్చే నెల 5న జరగనుంది. అర్జున్ తన స్నేహితురాలు సానియా చందోక్‌ను పెళ్లాడనున్నాడు. ఈ క్రమంలో సచిన్ ఇంట పెళ్లి పనులు షురూ అయ్యాయి. ఇప్పటికే ప్రధాని నరేంద్రమోదీ సహా పలువురు సెలబ్రిటీలు, రాజకీయ ప్రముఖులకు ఆహ్వాన పత్రిక అందించారు. తాజాగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, నీతా అంబానీ జామ్‌నగర్‌లో అర్జున్ -సానియా ప్రీ వెడ్డింగ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో సచిన్ ఎమోషనల్ స్పీచ్ ఇచ్చారు. ఈ ఈవెంట్‌లో సచిన్ మాట్లాడాడు. తమ కుమారుడి ప్రీ వెడ్డింగ్ ఈవెంట్‌ను నిర్వహించినందుకు ముకేశ్ అంబానీ కుటుంబానికి థాంక్స్ చెప్పాడు. 'మమ్మల్ని ఇక్కడికి ఆహ్వానించినందుకు మీకు థాంక్స్. అర్జున్- సానియా జంటను ఆశీర్వదించేందుకు ఇది సరైన వేదిక. ఎప్పుడైతే మన కుమారుడు, ఎవరైనా అమ్మాయిని ఇంటికి తీసుకొచ్చి పరిచయం చేశాడంటే, అప్పుడే కొడుకు పెద్ద వాడయ్యాడని తెలుస్తుంది. వాళ్లు (అర్జున్- సానియా) ఒకరినొకరు ఇష్టపడుతున్నారు. నిన్ను ప్రేమించే వ్యక్తిని పెళ్లి చేసుకుంటున్నావు. అర్జున్ నిన్ను చూస్తూ గర్విస్తున్నా' అని సచిన్ కుమారుడి పట్ల ఎమోషనల్‌గా మాట్లాడాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.'రెండేళ్ల కిందట అనంత్- రాధిక పెళ్లి జరిగిన ఈ జామ్‌నగర్‌లోనే మళ్లీ అర్జున్- సానియా వివాహ వేడుక కోసం మనం కలుసుకున్నాం. సచిన్- అంజలీ ఎల్లప్పుడూ మా కుటుంబ సభ్యులే. ఈరోజు మీకు ఆతిథ్యం ఇస్తున్నందుకు మాకు సంతోషంగా ఉంది. మా స్కూల్‌లో చదువుతున్నప్పటి నుంచి అర్జున్‌ను నేను చూస్తున్నా. ఇప్పుడు నీ జీవితంలో ముఖ్యమైన, అందమైన జర్నీని ప్రారంభిస్తున్నావు. సానియా నీ చుట్టూ పాజిటివిటీ ఉంది. మీ ఇద్దరు ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నాం' అని నీతా అంబానీ అన్నారు. కాగా, సచిన్ తెందుల్కర్?కు అంబానీ కుటుంబంతో మంచి సంబంధాలు ఉన్నాయి. ముకేశ్‌తో సచిన్‌కు వ్యక్తిగతంగానూ అనుబంధం ఉంది. ముఖ్యంగా ఐపీఎల్‌లో సచిన్ ముంబయి ఇండియన్స్‌కు ఆడుతున్నప్పటి నుంచి ఇంకా దగ్గరయ్యారు. తెందుల్కర్ క్రికెట్ నుంచి (2013) రిటైరైన తర్వాత కూడా ఐపీఎల్‌లో ముంబయి ఫ్రాంచైజీతోనే కొనసాగుతున్నారు. దశాబ్ద కాలంగా సచినే ముంబయికి మెంటార్?గా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా అర్జున్ తెందుల్కర్ కూడా ముంబయి జట్టుతోనే ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. గతసీజన్?దాకా ముంబయితోనే ఉన్నాడు. అయితే 2026 సీజన్?కుగాను అతడిని లఖ్?నవూ సూపర్ జెయింట్స్ ట్రేడింగ్?లో తీసుకుంది. పెంపుడు జంతువులకు గ్రూమింగ్, వెల్?నెస్ బ్రాండ్ అయిన మిస్టర్ పాన్స్ పెట్ స్పా ఉ స్టోర్ ూూ వ్యవస్థాపకురాలు సానియా చందోక్. ఆమె 2020లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి పట్టా అందుకున్నారు. ఆ తర్వాత వెటర్నరీ టెక్నిషియన్‌గా అర్హత సాధించారు. ఆమె గ్రావిస్ గ్రూప్ చైర్మన్ రవి ఘాయ్ మనవరాలు. ఆమె తల్లిదండ్రులు సన్నీ -గౌరిక కూడా ఈ సంస్థతో సంబంధం కలిగి ఉన్నారు.

# రంజీ ట్రోఫీ ఫైనల్..

## 584 పరుగులు చేసిన జమ్మూకశ్మీర్

**బెంగళూరు:** హుబ్లీ వేదికగా కర్ణాటకతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో జమ్మూ కశ్మీర్ దుమ్ము రేపింది. 527/6 ఓవర్ నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన జమ్మూ జట్టు 584 పరుగుల భారీ స్కోర్ చేసి ఆలౌటైంది. ప్రత్యర్థి కర్ణాటకు 585 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. రెండో రోజు హాఫ్ సెంచరీ సాధించి అజేయంగా నిలిచిన సాహిల్ లోత్రా నేడు 72 పరుగులకు పెవిలియన్ చేరాడు. 20 రన్స్‌తో బ్యాటింగ్‌కు దిగిన అబిద్ ముస్తాక్ మరో 8 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆఖరి వికెట్‌గా యుద్వీర్ సింగ్(30) రనౌట్ అయ్యాడు. అయితే జమ్మూ కశ్మీర్ ఇన్నింగ్స్‌లో ఓ శతకం, ఐదు హాఫ్ సెంచరీలు నమోదు కావడం విశేషం. శుభమ్ పుందిర్(121), హసన్(88), అబ్దుల్ సమద్(61), కన్హియా వాదవాన్(70), సాహి లోత్రా(72) అద్భుతంగా రాణించారు. కర్ణాటక బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. యుద్వీర్ పాటిల్, విజయ్ కుమార్ వైశాఖ్, శ్రేయస్ గోపాల్, శిఖర్ శెట్టి తలో వికెట్ తీసుకున్నారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కర్ణాటక తడబడుతోంది. 44 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్(13), దేవ్‌దత్ పడిక్కల్(11), కరుణ్ నాయర్(0), సమరన్ రవిచంద్రన్(0) తీవ్రంగా విఫలమయ్యారు. మయాంక్ అగర్వాల్(85ణి) హాఫ సెంచరీ సాధించాడు. మరో ఎండ్‌లో శ్రేయాస్ గోపాల్(25ణి) కొనసాగుతున్నాడు. జమ్మూ బౌలర్లలో అకిబ్ నబీ దార్ 3 వికెట్లతో చెలరేగాడు. సునీల్ కుమార్ ఓ వికెట్ తీసుకున్నాడు.



# బెన్నెట్ పోరాటం వృథా

## జింబాబ్వేపై టీమిండియా ఘన విజయం!






చెన్నై: వరల్డ్ కప్ సూపర్ 8 దశలో భాగంగా చెన్నైలోని స్టేడియం వేదికగా జరిగిన కీలక మ్యాచ్‌లో టీమిండియా జింబాబ్వేపై 72 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 256 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో జింబాబ్వే 6 వికెట్ల నష్టానికి 184 పరుగులు మాత్రమే చేసింది. టీమిండియా ఇన్నింగ్స్‌లో ఓపెనర్ సంజూ శాంసన్ వేగంగా 24 పరుగులు చేసి మంచి ఆరంభం ఇచ్చాడు. అభిషేక్ శర్మ 55 పరుగులు, ఇషాన్ కిషన్ 38 పరుగులతో జట్టుకు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 33 పరుగులు చేసి స్కోరు వేగం పెంచాడు. చివర్లో హార్దిక్ అర్ధ శతకం సాధించి జట్టును భారీ స్కోరు దిశగా నడిపించాడు. తిలక్ వర్మ దూకుడుగా 44 పరుగులు చేసి భారత్‌కు మంచి స్కోరు అందించాడు. 256 పరుగులు టీమిండియాకు టీ20 వరల్డ్ కప్‌లో అత్యధిక స్కోర్. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే తరపున బ్రియాన్ బెన్నెట్ అద్భుతంగా ఆడాడు. అతడు చివరి వరకు అవుట్ కాకుండా 97 పరుగులు చేసి ఒంటరిగా పోరాడాడు. సికందర్ రాజా 31 పరుగులు చేసినా, మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. భారత్ బౌలర్లలో అర్షదీప్ సింగ్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. అతడు కీలక సమయంలో మూడు వికెట్లు తీసి జింబాబ్వేను కట్టడి చేశాడు. ఇతర బౌలర్లు కూడా సమిష్టిగా రాణించి జింబాబ్వేను లక్ష్యానికి దూరంగా నిలిపారు.

# గొప్ప సహాయం చేసిన దక్షిణాఫ్రికా

## టీమిండియా సెమీఫైనల్స్ ఛాన్సెస్ మరింతగా మెరుగు!






**అహ్మదాబాద్ :** టీ20 ప్రపంచకప్ 2026 సూపర్-8లో భాగంగా జరిగిన కీలక పోరులో వెస్టిండీస్‌పై దక్షిణాఫ్రికా ఘనవిజయం సాధించింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రోటీస్ జట్టు 9 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. ఈ గెలుపు దక్షిణాఫ్రికా సెమీస్ అవకాశాలను మెరుగుపరచడమే కాకుండా, టీమిండియా ఆశలను కూడా సజీవంగా ఉంచింది. ఈ రోజు జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ నిర్దేశించిన 177 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా కేవలం ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ ఐడెన్ మార్క్రామ్ మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టును విజయ పథంలో నడిపించాడు. అతనికి క్వింటన్ డి కాక్, ర్యాన్ రికెల్టన్ చక్కని సహకారం అందించారు. ఈ పోరులో ఇంకా 23 బంతులు మిగిలి ఉండగానే (16.1 ఓవర్లలోనే) లక్ష్యాన్ని ఛేదించి దక్షిణాఫ్రికా విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

### విండీస్ రన్ రేట్‌కు భారీ గండి..

ఈ ఘోర పరాజయం వెస్టిండీస్ సెమీస్ అవకాశాలపై దెబ్బకొట్టింది. 9 వికెట్ల తేడాతో ఓడిపోవడంతో వెస్టిండీస్ నెట్ రన్ రేట్ భారీగా పడిపోయింది. మ్యాచ్‌కు ముందు ం5.35 గా ఉన్న విండీస్ రన్ రేట్, ఇప్పుడు ం1.791 కి పడిపోయింది. ఇది భారత్‌కు కలిసొచ్చే అంశం. దక్షిణాఫ్రికా విజయం తర్వాత గ్రూప్-ూ పాయింట్ల పట్టికలో సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. ఈ రోజు జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ ఓడిపోవడంతో ఇప్పుడు టీమిండియా భవిష్యత్తు తన చేతుల్లోనే ఉంది. రన్ రేట్ గందరగోళం లేకుండా భారత్ సెమీస్ చేరడానికి మార్గం సుగమమైంది. భారత్ తన నెక్స్ట్ రెండు మ్యాచ్‌ల్లో (జింబాబ్వే, వెస్టిండీస్) తప్పనిసరిగా గెలవాల్సి ఉంటుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధిస్తే టీమిండియా నేరుగా సెమీఫైనల్‌కు దూసుకెళ్తుంది. అహ్మదాబాద్‌లో దక్షిణాఫ్రికా కొట్టిన దెబ్బకు వెస్టిండీస్ కోలుకోలేకపోయింది. ఈ ఫలితం గ్రూప్‌లో దక్షిణాఫ్రికాను అగ్రస్థానానికి చేర్చడమే కాకుండా, భారత అభిమానుల్లో కొత్త ఆశలు చిగురించేలా చేసింది.

# మార్క్రమ్ మెరుపులు.. డీకాక్ దూకుడు!

- విండిస్ పై సౌతాఫ్రికా భారీ విజయం!
- వెస్టిండీస్ మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 8 వికెట్లకు 176 పరుగులు
- సౌతాఫ్రికా కేవలం 16.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయం..

**అహ్మదాబాద్:** టీ20 వరల్డ్ కప్ సూపర్ 8 గ్రూప్-1లో భాగంగా అహ్మదాబాద్ లో సౌతాఫ్రికా వెస్టిండీస్ పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 177 పరుగుల లక్ష్యాన్ని సౌతాఫ్రికా కేవలం 16.1 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 176 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్ పూర్తిగా విఫలమవడంతో జట్టు ఒక దశలో 83/7 వద్ద కష్టాల్లో పడింది. అయితే జాసన్ హోల్డర్ (49), రోమారియో షెఫర్డ్ (52ణి) అద్భుత పోరాటంతో జట్టుకు గౌరవప్రదమైన స్కోర్ ను అందించారు. వీరిద్దరి మధ్య 89 పరుగుల భాగస్వామ్యం నమోదు అయింది. సౌతాఫ్రికా బౌలర్లలో లుంగీ ఎంగిడి 3 వికెట్లు.. రబడా, బోస్చ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. 177 పరుగుల లక్ష్య ఛేధనలో దక్షిణాఫ్రికా బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. కెప్టెన్ ఐడెన్ మార్క్రమ్ (ూాఅనవఅ మీుతీనీతుఎ) 46 బంతుల్లో 82 పరుగులతో నాటౌట్‌గా నిలిచి మ్యాచ్ ను వన్ సైడ్ వార్ చేసేశాడు. అతినికి తోడుగా వికెట్ కీపర్, బ్యాటర్ డీకాక్ 24 బంతుల్లో 47 పరుగులు చేసి మంచి ఆరంభం ఇచ్చాడు. డీకాక్ అవుట్ అయ్యాక వచ్చిన ర్యాన్ రికెల్టన్ (45ణి) తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. సౌతాఫ్రికా బ్యాటర్లు బౌండరీలు, సిక్సర్లతో విండీస్ బౌలర్లపై ఒత్తిడి తెచ్చారు. 23 బంతులు మిగిలుండగానే విజయం అందుకున్నారు. ఈ విజయంతో దక్షిణాఫ్రికా దాదాపు సెమీఫైనల్ బెర్త్ కన్ఫామ్ చేసుకుంది. భారీ లక్ష్యాన్ని సులభంగా చేధించడం జట్టుకు మంచి నెట్ రన్‌రేట్‌ను కూడా అందించింది. మరోవైపు, వెస్టిండీస్‌కు ఈ ఓటమి గట్టి దెబ్బగా మారింది. అయితే వెస్టిండీస్ భారీ తేడాతో ఓడడం భారత్ కు కాస్త ఊరటనిచ్చే అంశం.






మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# ఒక్క సినిమాతో ఇండస్ట్రీని షేక్ చేసిన 22 ఏళ్ల బ్యూటీ

సినిమా రంగంలో కొందరు నటీమణులు దశాబ్దాల కాలం వేచి చూసినా దక్కని గుర్తింపును, మరికొందరు తమ తొలి చిత్రంతోనే సొంతం చేసుకుంటారు. సరిగ్గా ఇదే రీతిలో బాలీవుడ్‌లో ఇప్పుడు ఒకే ఒక్క సినిమాతో స్టార్‌డమ్ దక్కించుకుని, అందరి దృష్టిని ఆకర్షిస్తోంది 22 ఏళ్ల యువ నటి అనీత్ పద్ద. కేవలం అందంతోనే కాకుండా తన అద్భుతమైన అభినయంతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తూ సరికొత్త రికార్డులను సృష్టించింది. ప్రముఖ దర్శకుడు మోహిత్ సూరి దర్శకత్వంలో తెరకెక్కిన 'సయ్యారా' సినిమాతో అనీత్ వెండితెరకు పరిచయమైంది. జూలై 18న ఎటువంటి భారీ అంచనాలు లేకుండా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఊహించని విజయాన్ని నమోదు చేసింది. ఇప్పటివరకు ఈ సినిమా రూ. 570 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి, ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. ఒక డెబ్యూ హీరోయిన్ సినిమా ఈ స్థాయిలో కలెక్షన్స్ సాధించడం బాలీవుడ్‌లో అరుదైన రికార్డుగా నిలిచింది. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జన్మించిన అనీత్ పద్ద.. ప్రస్తుతం ఢిల్లీ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తోంది. నటనపై ఉన్న మక్కువతో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఈమె, పలు వాణిజ్య ప్రకటనల్లో నటించి గుర్తింపు పొందింది. ఆ క్రమంలోనే 'సయ్యారా'లో కథానాయికగా అవకాశం దక్కించుకుంది. మొదటి సినిమాలోనే పరిణతి చెందిన నటనను కనబరచడంతో స్టార్ హీరోలు సైతం ఆమె నటనకు ఫిదా అయిపోయారు. ఈ సినిమా చూసిన పలువురు సినీ ప్రముఖులు, స్టార్ హీరోలు సోషల్ మీడియా వేదికగా అనీత్ నటనపై ప్రశంసలు కురిపించారు. యువతలో ఆమెకు విపరీతమైన క్రేజ్ పెరగడంతో, ప్రస్తుతం గూగుల్‌లో ఈ అమ్మడి గురించి తెలుసుకోవడానికి నెటిజన్లు తెగ ఆరా తీస్తున్నారు. తొలి ప్రయత్నంలోనే వందల కోట్ల క్లబ్‌లో చేరిన అనీత్ పద్ద, భవిష్యత్తులో బాలీవుడ్‌ను ఏలే స్టార్ హీరోయిన్ అవుతుందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



## వివాహ బంధంతో ఒక్కటైన విరోష్

హైదరాబాద్, ఫిబ్రవరి 26: నటులు విజయ్ దేవరకొండ, రష్మిక వివాహబంధంతో ఒక్కటైనట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం 10.10కి రష్మిక మెడలో విజయ్ మూడుముళ్లు వేసినట్లు సమాచారం. దీంతో ఈ జంటకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ పెళ్లి వేడుక రెండు సంస్కృతులు, సంప్రదాయాల కలయికగా జరుగుతోంది. ఉదయం విజయ్ వైపు నుంచి హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం జరిగింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా జరుగుతోన్న ఈ వివాహానికి ఇండస్ట్రీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ వివాహ సంబరాల్లో భాగంగా విజయ్ – రష్మిక 'విరోష్ ప్రీమియర్ లీగ్' పేరుతో సరదాగా ఓ చిన్న క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించినట్లు ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. అలాగే బుధవారం హల్దీ వేడుకను నిర్వహించినట్లు విరోష్ జోడీ తెలియజేసింది. ఇక వీరి వివాహ విందును మార్చి 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.

# ఒక్క హిట్టు పడలేదు

ఎవరు ఏ రంగాన్ని ఎంచుకున్నప్పటికీ, అందులో రాణించాలంటే ప్రతిభ ఉండాలి. టాలెంట్ ఒక్కటి ఉంటే సరిపోతుందా అంటే, కొంచెం అదృష్టం కూడా ఉండాలనుకోండి అనే సమాధానం వస్తుంది. అదృష్టం అనే విషయంలో ఎవరి అభిప్రాయాలు వాళ్లకి ఉంటాయి. కాకపోతే అదృష్టం అనే దాని గురించి అప్పుడప్పుడు నమ్మవలసి వస్తుంటుంది. అందుకు కారణాలు .. కళ్లముందు కనిపించేవే అని చెప్పాల్సి ఉంటుంది. ఆశించినస్థాయిలో గుర్తింపు రానప్పుడు .. విజయాలు అందనప్పుడు .. అదృష్టం లేదని చెప్పుకుంటూ ఉంటారు. అలాంటి అదృష్టాన్ని వెతికి పట్టుకునే పనిలో ఉంటారు. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే అదే పనిలో ఉందని అంటున్నారు. ఇప్పుడున్న కథానాయికలలో గ్లామరస్ బ్యూటీ ఎవరంటే కుర్రకారు ఠకీమని చెప్పే మాట భాగ్యశ్రీ బోర్సే. తుమ్మెదల్లాంటి కళ్లతో మనసులు దోచే ఈ సుందరికి ఇంతవరకూ హిట్టు పడలేదు. ఆమె అభిమానులు బెంగపెట్టుకోవడంలోని అసలు కారణం ఇదే. ఈ నేపథ్యంలో ఆమె అఖిల్ సరసన నాయికగా 'లెనిన్' సినిమా చేస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను, అన్నపూర్ణ – సితార సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'మే'లో ఈ సినిమాను విడుదల చేసే ఆలోచనలో ఉన్నారు. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. భాగ్యశ్రీ గ్లామర్ ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు. ఈ సినిమాతోనైనా ఆమెకి అదృష్టం కలిసొస్తుందేమో చూడాలి మరి.





# అక్కడ.. ఇక్కడ కియారా సక్సెస్



సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లుగా సక్సెస్ ట్రాక్ కొనసాగిస్తూ, వ్యక్తిగత జీవితాన్ని కూడా అంతే అందంగా బ్యాలెన్స్ చేసే వారు కొందరే ఉంటారు. ఆ జాబితాలో అగ్రస్థానంలో నిలుస్తుంది అందాల నటి కియారా అద్వానీ. తన నటనతో, గ్లామర్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్న ఈ ముద్దుగుమ్మ, ప్రస్తుతం కెరీర్ పరంగానే కాకుండా పర్సనల్ లైఫ్‌లోనూ ఎంతో సంతోషంగా ఉంది. 1992, జూలై 31న ముంబైలో జన్మించిన కియారా అసలు పేరు అలియా అద్వానీ. తండ్రి జగదీప్ అద్వానీ వ్యాపారవేత్త కాగా, తల్లి జెనీవీవ్ జాఫ్రీ ఉపాధ్యాయురాలు. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పూర్తి చేసిన కియారా.. 2014లో 'ఫగ్లీ' చిత్రంతో సినీ అరంగేట్రం చేసింది. ఆ తర్వాత 'ఎం.ఎస్ ధోనీ' బయోపిక్ ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. తెలుగులో మహేశ్ బాబుతో 'భరత్ అనే నేను', రామ్ చరణ్‌తో 'వినయ విధేయ రామ' మరియు త్వరలో విడుదల కానున్న 'గేమ్ ఛేంజర్' సినిమాలతో టాలీవుడ్ ప్రేక్షకులకు కూడా ఎంతో దగ్గరైంది. కియారా తన సహనటుడు, బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాను ప్రేమ వివాహం చేసుకుంది. 'షేర్షా' సినిమా షూటింగ్ సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. కొన్నేళ్ల పాటు డేటింగ్‌లో ఉన్న ఈ జంట గతేడాది రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో అట్టహాసంగా పెళ్లి చేసుకున్నారు. తాజాగా ఈ జంటకు కుమార్తె జన్మించడంతో కియారా జీవితం మరింత పరిపూర్ణమైంది. ప్రస్తుతం ఈ దంపతులు ముంబైలోని బాంద్రాలో గల తమ లగ్జరీ నివాసంలో ఫ్యామిలీ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. ఒకవైపు తల్లిగా బాధ్యతలు నిర్వహిస్తూనే, మరోవైపు సినిమాల్లోనూ బిజీగా ఉంది కియారా. ప్రస్తుతం ఆమె చేతిలో 'డాన్ 3', 'టాక్సిక్' వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. తన వ్యక్తిగత విషయాలను, ఫోటోలను నిత్యం సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటూ, మోడ్రన్ ఉమెన్‌గా అందరికీ స్ఫూర్తినిస్తోంది.

# ది కేరళ స్టోరీ విడుదలకు బ్రేక్

## సెన్సార్ బోర్డును తప్పుపట్టిన హైకోర్టు

**తిరువనంతపురం, ఫిబ్రవరి 26:** సరిగ్గా విడుదలకు ఒక్కరోజు ముందు 'ది కేరళ స్టోరీ2' మూవీకి న్యాయపరంగా ఎదురుదెబ్బ తగిలింది. సినిమా ప్రచార చిత్రంలో కేరళను తప్పుగా చూపించారని, మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయని సామాజిక మాధ్యమాల వేదికగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సినిమా విడుదలపై స్టే విధించాలని, సెన్సార్ సర్టిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గురువారం రాష్ట్ర హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) తీరును హైకోర్టు తప్పుపట్టింది. సినిమా పునః పరిశీలించాల్సిందిగా జస్టిస్ కురియన్ థామస్ సీబీఎఫ్‌సీకి సూచించారు. అప్పటివరకూ సినిమా విడుదలపై స్టే విధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందింది. దీనికి కామాఖ్యా నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా నటించారు. ప్రేమ మాయలో పడి కొందరు అమ్మాయిలు.. కన్నవాళ్లను ఎదిరించి తమ ప్రియుడితోనే జీవితం అనుకుని దూరమవుతుంటారు. కానీ రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రేమే ఓ పెద్ద మోసమని తెలుసుకున్నాక దిక్కుతోచని పరిస్థితుల మధ్య ఎవరికీ చెప్పుకోలేని హింసని భరిస్తుంటారు. అలాంటి నిజజీవిత కథాంశంతో 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' రూపొందింది. ఫిబ్రవరి 27న ఈ మూవీని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కేరళ హైకోర్టు ఉత్తర్వులతో ప్రస్తుతం వాయిదా పడింది.




CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861